


కొట్టుకుపోయిన గుండ్లకమ్మ గేటు నుంచి బయటకు వెళ్తున్న నీరు (ఫైల్)



గుండ్లకమ్మ జలాశయంలో ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు

- వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో గతంలో రెండుసార్లు కొట్టుకుపోయిన గేట్లు
- వరుసగా రెండేళ్లపాటు ఆయకట్టుకు అందని నీరు
- ఇప్పటికీ ప్రమాదకరంగానే సగం గేట్లు
- నీరు అందుబాటులో ఉన్నా పూర్తిగా నిల్వ చేయలేని దుస్థితి
- ఒక టీఎంసీకే పరిమితం చేస్తున్న అధికారులు
- వాస్తవ సామర్థ్యం 3.85 టీఎంసీలు
- పాలక పెద్దలు దృష్టిపెడితే రబీకి నీరు

గుండ్లకమ్మ భద్రమేనా?

తుంగభద్ర డ్యాం ఘటనతో ప్రాజెక్టుపై మరింత టెన్షన్

ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై చూపిన నిర్లక్ష్యం జిల్లాలోని గుండ్లకమ్మను నేటికీ వెంటాడుతోంది. కృష్ణానది పొంగిపొర్లుతూ సాగర్ కాలువలకు సీజన్ కంటే ముందుగానే నీరు వస్తోంది. దీనితో ప్రాజెక్టును నింపుకొనే అవకాశం ఉన్నా గేట్లు ప్రమాదకరంగానే ఉండటంతో అధికారులు ధైర్యం చేయలేకపోతున్నారు. తాజాగా తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకుపోయిన ఘటనతో గుండ్లకమ్మ భద్రతపై యంత్రాంగం ఆందోళన చెందుతోంది. ఇంచుమించు సగం గేట్లు మరమ్మతులు లేదా కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉంది. మిగతా వాటిలో కొన్నింటి పనులు జరుగుతున్న తరుణంలో కనీసం రెండు టీఎంసీల నీటిని అయినా నిల్వ చేద్దామన్న ఆలోచనతో ఉన్న అధికారులు తుంగభద్ర ఘటనతో వెనక్కి తగ్గారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 3.859 టీఎంసీలు కాగా.. ఒక టీఎంసీ రాగానే, అంతకు మించి నిల్వ చేయడం మంచిది కాదన్న అభిప్రాయంతో ఎగువ నుంచి నీరు రాకుండా ఆపేస్తున్నారు.



పూర్తిస్థాయిలో బిగించని గుండ్లకమ్మ గేటు

ఒంగోలు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం, అసమర్థతతో గుండ్లకమ్మ ప్రాజెక్టులో వరుసగా రెండేళ్లు రెండు గేట్లు కొట్టుకుపోయాయి. తక్షణం మరమ్మతులలోనూ చేసిన జాప్యంతో గత రెండేళ్లుగా ఆయకట్టుకు నీరు ఇవ్వలేదు. ఆలస్యంగా గేట్ల మరమ్మతులు చేపట్టినా సకాలంలో నిధులు ఇవ్వకపోవడంతో ఇప్పటికీ పనులు పూర్తికాలేదు. ప్రస్తుతం నీరు అందుబాటులో ఉన్నా నిల్వ చేసుకునే అవకాశం లేకుండా పోయింది. గుండ్లకమ్మ ప్రాజెక్టు పరిధిలో 80,060 ఎకరాల ఆయకట్టు ఉండగా ఒంగోలుతోపాటు దాదాపు 70కిపైగా గ్రామాలకు తాగునీరు అందనుంది. గత టీడీపీ పాలనలో ప్రాజెక్టు నిర్వహణ బాగానే ఉన్నా వైసీపీ ప్రభుత్వం వచ్చాక గాలికొదిలేశారు. గేట్ల నిర్వహణ సరిలేక దెబ్బతిని పోగా రెండు గేట్లకు మరమ్మతులు అత్యవసరమని అందుకు రూ.90లక్షలు ఇవ్వాలని యంత్రాంగం కోరినా పట్టించుకోలేదు. ఫలితంగా 2022 ఆగస్టు 31న మూడో నంబరు గేటు కొట్టుకుపోయింది. ఆతర్వాత మేల్కొన్న ప్రభుత్వం అప్పటికే టెండర్ పూర్తయిన 6,7గేట్ల మరమ్మతులకు నిధులు ఇవ్వడంతో వాటి పనులు ప్రారంభించారు.

బిల్లుల పెండింగ్‌తో..

సదరు కాంట్రాక్టర్లకు రూ.60లక్షల బిల్లులు పెండింగ్ పెట్టడంతో కొట్టుకుపోయిన మూడో నంబరు గేటు పని ఇస్తామన్నా వద్దని వెళ్లిపోయారు. ఈక్రమంలో 2023 డిసెంబరులో రెండో నెంబరు గేటు కొట్టుకుపోయింది. దీంతో వరుసగా రెండేళ్ల ప్రాజెక్టులో నీరు నిల్వ చేసే అవకాశం లేక ఆయకట్టుకు నీరు ఇవ్వక రైతులు రూ.500 కోట్లకుపైగా పంట ఉత్పత్తులను నష్టపోయారు. ఆ విషయం అలా ఉంచితే వరుసగా రెండో ఏడాది కూడా గేటు కొట్టుకుపోయిన నేపథ్యంలో మొత్తం గేట్ల మరమ్మతులు లేదా కొత్తవి అమర్చడం అవసరమని నిపుణుల కమిటీ చేసిన సూచనకు మోక్షం లభించింది. అప్పటికే చేసిన 6,7 గేట్లు అలాగే పెండింగ్‌లో ఉన్న మూడో గేటు మినహా మిగిలిన 12 గేట్ల కోసం రూ.9.60 కోట్లకు టెండర్ పిలిచారు. అహ్మదాబాద్‌కు చెందిన కంపెనీ టెండర్ పొంది వేగంగా పనులు చేపట్టింది. ఇప్పటి వరకు దాదాపు రూ.5 కోట్ల విలువైన పనులు చేశారు. టెండర్‌లో 12 గేట్లలో ఐదింటిని పూర్తిగా బిగించగా రెండింటిని అమర్చుతున్నారు. మరొకటి ఈ వారంలో రానుంది. అయితే వారికి కూడా బిల్లులు చెల్లించకపోవడంతో తదుపరి గేట్ల పనులు ముందుకు సాగడం లేదు.

నిధులు ఇవ్వకపోవడంతో ఆలస్యం

గుండ్లకమ్మకు ఉన్న మొత్తం 15 గేట్లలో గతంలో పెట్టిన 6,7 గేట్లతోపాటు మరో ఐదు పూర్తిగా అమర్చారు. మరో ఐదు కొత్తవి పెట్టాల్సి ఉంది. మిగిలిన పనులు జరుగుతున్నాయి. అయితే గత వైసీపీ ప్రభుత్వం నిధులు ఇచ్చి ఉంటే మిగిలిన పనులు కూడా జరిగేవి. పట్టించుకోకపోవడంతో ఇంకా సగం గేట్లు ప్రమాదకరంగానే ఉన్నాయి. దీంతో ప్రాజెక్టులోకి నీటిని పెట్టే అవకాశం ఉన్నా గేట్ల భద్రతపై అనుమానంతో అధికారులు ధైర్యం చేయలేకపోతున్నారు. గుండ్లకమ్మ నీటిమట్టం 24.38 మీటర్లు, నిల్వ సామర్థ్యం 3.85 టీఎంసీలు. కాగా ప్రస్తుతం 20.40 మీటర్ల నీటిమట్టంతో ఒక టీఎంసీ నిల్వ ఉంది. గతంలో గేట్ల పనులతో నీటిని వదిలివేశాక 0.4 టీఎంసీలు ఉండగా కొత్తగా 0.6 టీఎంసీలు నింపారు. ప్రస్తుతం గేట్లు బాగా ఉండి ఉంటే ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నీరు నింపుకోవచ్చు. కృష్ణానదికి వరద పోటెత్తి శ్రీశైలం, సాగర్ డ్యాంలు నిండి నీరు సముద్రం పాలవుతున్న నేపథ్యంలో సాగర్ కుడి కాలువకు ప్రభుత్వం నీరిచ్చింది. దానితో చెరువులను నింపుకోవాలని ఆదేశించింది. తదనుగుణంగా సాగర్ కాలువ జిల్లా సరిహద్దు 85/3 వద్ద ఉన్న ఎస్కేప్ నుంచి వారం క్రితం గుండ్లకమ్మకు నీరు వదిలారు. ఇప్పటికీ వస్తున్న నీటితో పూర్తిగా ప్రాజెక్టును నింపుకొనే అవకాశం ఉంది. అయితే ప్రాజెక్టు నిల్వ ఒక టీఎంసీకి పరిమితం చేసి ఎగువ నుంచి నీటిని ఆపేశారు.

పనులు పూర్తికాకనే..

వాస్తవానికి ఐదు గేట్ల పూర్తితోపాటు మరో మూడింటి వద్ద పనులు జరుగుతున్నాయి. వాటి వద్ద స్టాప్‌లాక్ గేట్లు అమర్చడం, మరో మూడింటి వద్ద ఒకస్థాయి వరకు స్టాప్‌లాక్ గేట్లు పెట్టి ఉండటంతో మరో టీఎంసీ నీటిని నిల్వ చేసే అవకాశం ఉంటుంది. అయితే తాజాగా జరిగిన తుంగభద్ర ఘటనతో గుండ్లకమ్మ అధికారులు ఒక టీఎంసీ మించి నిల్వ చేసేందుకు ధైర్యం చేయడం లేదు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 1,200 క్యూసెక్కుల నీరు వస్తోంది. దిగువన అవసరాల కోసం 600 క్యూసెక్కులు నాలుగు రోజులు ఇచ్చారు. ఎగువన ఒకట్రెండు రోజులలో ఆగిపోనుండటంతో దిగువకు విడుదల కూడా నిలిపేశారు. ఎడమ కాలువకు 50 క్యూసెక్కులు ఇస్తున్నారు. మొత్తంగా ఒక టీఎంసీ మించి నిల్వ చేయలేని పరిస్థితి నెలకొంది. ఇదిలాఉండగా కాంట్రాక్టు కంపెనీ వేగంగా పనులు చేపట్టడంతో నాలుగైదు నెలల్లోనూ ఐదు గేట్లను పూర్తిగా అమర్చింది. మరో మూడు గేట్లు ఈ నెలాఖరుకు పూర్తయ్యే అవకాశం ఉంది. ఈ తరుణంలో ప్రస్తుత ప్రభుత్వం సదరు కంపెనీకి చేసిన పనులకు బిల్లులు ఇస్తే కనీసం అక్టోబరు నాటికి అయినా గేట్లు పూర్తిచేసి పూర్తిస్థాయిలో నీటిని నిల్వచేసి ఆయకట్టుకు ఇవ్వవచ్చు. ఆ వైపుగా పాలకపక్ష పెద్దలు తక్షణం దృష్టిపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాకపోతే ఈ ఏడాది కూడా ఆయకట్టు రైతులు ఇక్కట్లు పడక తప్పదు.



దివ్యాంగుడు రామకృష్ణతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

కదిలొచ్చిన కలెక్టరమ్మ

- వేదిక నుంచి కిందికి దిగి వచ్చిన తమీమ్ అన్సారియా
- దివ్యాంగుడి సమస్య విని తక్షణమే స్పందన
- అర్హత ఉంటే వెంటనే పింఛన్ పెంచాలని ఆదేశం

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 12 : ఒంగోలులోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా తన హోదాను పక్కన పెట్టి సమస్యను చెప్పుకునేందుకు వచ్చిన దివ్యాంగుడి వద్దకు వేదిక దిగి వచ్చారు. అక్కడే కింద కూర్చొని ఆ దివ్యాంగుడి సమస్యను అడిగి తెలుసున్నారు. ఒంగోలు మండలం ఉలిచి గ్రామానికి చెందిన మేడా రామకృష్ణ మీకోసం కార్యక్రమంలో తన సమస్యను చెప్పుకునేందుకు ఒంగోలులోని ప్రకాశం భవన్‌కు వచ్చారు. చేనేత కుటుంబానికి చెందిన ఆయన 90శాతం వికలత్వం ఉండటంతో ఏమీ పనిచేయలేని స్థితిలో ఉన్నారు. ప్రస్తుతం దివ్యాంగుల కోటా కింద నెలకు రూ.6వేలు పింఛన్ తీసుకుంటున్నారు. అయితే పూర్తిస్థాయిలో వైకల్యం ఉన్నందున తనకు నెలకు రూ.15వేలు పింఛన్ ఇవ్వాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతి పత్రం ఇచ్చేందుకు వచ్చారు. నేలపై కూర్చుని ఉన్న అతనిని చూసిన కలెక్టర్ వేదిక దిగి వచ్చి మాట్లాడారు. నిబంధనల ప్రకారం అర్హత ఉంటే తప్పని సరిగా పింఛన్‌ను పెంచేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆ అర్జీని వెంటనే పరిశీలించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



అధికారులు పట్టుకున్న ఎక్స్‌కవేటర్, లారీలు

చెరువు మట్టి అక్రమ రవాణా

- రాజంపల్లిలో ఎక్స్‌కవేటర్, రెండు టిప్పర్ల పట్టివేత

దర్శి, ఆగస్టు 12: మండలంలోని రాజంపల్లి చెరువు నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లు, ఎక్స్‌కవేటర్‌ను సోమవారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. పట్టపగలు చెరువులో మట్టి అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందటంతో తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ హుటాహుటిన వెళ్లారు. చెరువులో ఎక్స్‌కవేటర్‌తో టిప్పర్లకు మట్టి ఎత్తుతుండగా పట్టుకున్నారు. దానితోపాటు రెండు టిప్పర్లను దర్శికి తరలించారు. ప్రభుత్వం మారినప్పటికీ వైసీపీ నాయకుల మట్టి దందా ఆగలేదు. అధికారుల మెతక వైఖరితో దొంగచాటుగా తరలిస్తూనే ఉన్నారు. ఇటీవలకాలంలో రెండు సార్లు రాజంపల్లి చెరువులో మట్టి తవ్వుతూ పట్టుబడినప్పటికీ మళ్లీ సోమవారం అక్రమంగా తరలిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రావణ్‌కుమార్ సమాచారం అందిన వెంటనే వెళ్లి మట్టి తరలింపును అడ్డుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో, కొండల వద్ద నుంచి మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మట్టి తరలించే టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.



ఉప్పుగుండూరులో నిర్మించిన అంతర్గత రహదారి

ఎన్నాళ్లకెన్నాళ్లకు...!

- కూటమి ప్రభుత్వం రాకతో గ్రామీణ రహదారుల అభివృద్ధి

నాగులుప్పలపాడు, ఆగస్టు 12 : కూటమి ప్రభుత్వంలో రహదారులు నూతన శోభను సంతరించుకొంటున్నాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మండల పరిధిలోని జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లోని అంతర్గత రోడ్లు దెబ్బతిని గోతులమయంగా మారాయి. అప్పటి సర్కారు రోడ్ల అభివృద్ధి వైపు దృష్టిసారించిన దాఖలాలు లేవు. గోతుల్లో గుప్పెడు మట్టి కూడా వేయకుండా వదిలేయడంతో ప్రజలు, వాహనదారులు ఎన్నో అవస్థలు పడ్డారు. ఇటీవల అధికారం చేపట్టిన టీడీపీ కూటమి ప్రభుత్వం వస్తూనే రోడ్ల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. జాతీయ రహదారులకు అనుసంధానంగా ఉన్న ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లను తక్షణమే అభివృద్ధి చేయాలని సంబంధిత అధికారులను తక్షణమే ఆదేశించింది. దీంతో చకచకా రోడ్ల నిర్మాణ పనులు సాగుతున్నాయి. మండల పరిధిలోని 216 జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న త్రోవగుంట, మద్దిరాలపాడు, చదలవాడ, ఉప్పుగుండూరు గ్రామాలలోని అంతర్గత రహదారులు రెండు వరుసలుగా అభివృద్ధి చెంది సరికొత్త కళను సంతరించుకున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



త్రోవగుంట వద్ద అభివృద్ధి చేసిన రహదారి

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం

- 16 నుంచి రెవెన్యూ సదస్సులు
- మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 12 : భూ సంబంధ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించే లక్ష్యంతో ఈనెల 16 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశపు హాలులో సోమవారం రెవెన్యూ సదస్సులపై జరిగిన జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో మంత్రి మాట్లాడారు. భూ సమస్యలపై ఈనెల 16 నుంచి సెప్టెంబరు 30వతేదీ వరకూ 45రోజులపాటు సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల వద్దకే పాలన తరహాలో ప్రతి గ్రామంలో ఈ సదస్సులు జరుగుతాయన్నారు. ఈనెల 15న ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తామన్నారు. నిజమైన హక్కుదారులకు న్యాయం చేయడమే లక్ష్యమన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ మీకోసం కార్యక్రమంలో వచ్చే అర్జీల్లో 80 నుంచి 90శాతం రెవెన్యూ సమస్యలపైనే ఉంటున్నాయన్నారు. వీటికి పూర్తిస్థాయిలో పరిష్కారం చూపే లక్ష్యంతో ప్రభుత్వం ఈ సదస్సులను ప్రారంభిస్తున్నదని తెలిపారు. మంగళవారం సాయంత్రానికి గ్రామాల వారీ రెవెన్యూ సదస్సుల నిర్వహణ షెడ్యూల్‌ను రూపొందిస్తామని తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9గంటలకే ప్రారంభమవుతాయన్నారు. ప్రజాప్రతినిధులు, రైతుసంఘాల ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని కోరారు. రెవెన్యూ యంత్రాంగంతోపాటు పలుశాఖల అధికారులు పాల్గొంటారన్నారు. అంతకుముందు డీఆర్వో విశ్వేశ్వరరావు రెవెన్యూ సదస్సులకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో పెద్దఎత్తున ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఆక్రమణకు గురయ్యాయని, వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించి హక్కుదారులకు మేలు చేకూరే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు ఎమ్మెల్యేలు కోరారు. గతంలో ఉన్న అసైన్డ్ కమిటీని తిరిగి పునరుద్ధరించాలని సూచించారు. సమావేశంలో ఒంగోలు, కనిగిరి, గిద్దలూరు, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఎం.అశోక్‌రెడ్డి, బీఎన్.విజయకుమార్, దర్శి, వైపాలెం ఇన్‌చార్జిలు గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్‌బాబు, జేసీ ఆర్.గోపాలకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి స్వామి, పక్కన కలెక్టర్ అన్సారియా, పాల్గొన్న టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు



సర్దుబాటు వాయిదా!

- 15 వరకు టీచర్ల నుంచి వినతుల స్వీకరణ
- 16న కొత్త సీనియారిటీ జాబితాలు
- 17న కౌన్సెలింగ్

ఒంగోలు(విద్య), ఆగస్టు 12 : ఉపాధ్యాయుల సర్దుబాటు వాయిదా పడింది. టీచర్ల సంఘాల తిరుగుబాటుతో నష్టనివారణ చర్యల్లో భాగంగా విద్యాశాఖ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. టీచర్ల సర్దుబాటుకు సంబంధించి మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సోమవారం ఉదయానికి మండల విద్యాధికారుల లాగిన్‌లో ఆ మండలంలోని మిగులు టీచర్లు, కొరత ఉన్న పాఠశాలలు దర్శనమిచ్చాయి. ఆ జాబితాలు చూసిన టీచర్లకు అయోమయానికి గురయ్యారు. సర్దుబాటుకు సంబంధించి ఒక్కటే చర్చ నడిచింది. సీనియారిటీ విషయం తప్ప మరే ప్రతిపాదనను విద్యాశాఖ పరిగణనలోకి తీసుకోలేదు. టీచర్ల సర్దుబాటు ప్రక్రియ యథాతథంగా జరిగితే ప్రభుత్వ పాఠశాలల మనుగడకే ముప్పు వస్తుందని భావించారు. వెంటనే ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ప్యాప్టో) రంగంలోకి దిగింది. ఇతర సంఘాల నాయకులు కూడా కదిలారు. తమతో చర్చలు జరపకుండా, తమ సూచనలను పరిగణనలోకి తీసుకోకుండా సర్దుబాటును తాము అంగీకరించబోమని తేల్చిచెప్పారు. సోమవారం మూడు గంటలకు మండలాల్లో జరగాల్సిన సర్దుబాటు కౌన్సెలింగ్‌ను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఎంఈవోలకు నోటీసులు ఇచ్చారు. దీంతో కౌన్సెలింగ్ వాయిదాపడింది జీవో నెంబరు 117ను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా దాని ప్రకారం సర్దుబాటుకు సంబంధించి మిగులు టీచర్లు, కొరత ఉన్న పాఠశాలలను గుర్తించడమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

అభిప్రాయ సేకరణకు నిర్ణయం

తాజా పరిణామాల నేపథ్యంలో క్షేత్రస్థాయి నుంచి టీచర్ల అభిప్రాయాలను తెలుసుకోవాలని విద్యాశాఖ నిర్ణయించింది. అందుకోసం కొత్త షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈనెల 15 వరకు టీచర్ల నుంచి అభిప్రాయ సేకరణ చేయనుంది. ఇప్పటికే విడుదల చేసిన మిగులు టీచర్ల సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయమంది. 15వతేదీ వరకు వచ్చిన సూచనలను పరిశీలించి 16న సీనియారిటీ తుది జాబితాను ప్రకటించి 17న మండల స్థాయిలో సర్దుబాటు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. సోమవారం విడుదలైన జాబితా ప్రకారం ఒంగోలు మండలంలో 51మంది సర్ ప్లస్‌గా తేలారు. అయితే వారిలో 36 మందిని సర్దుబాటు చేయవచ్చు. దీంతో నికరంగా 15 మంది టీచర్లు మిగులుగా తేలారు. సంతనూతలపాడు మండలంలో 38మంది మిగులు ఉండగా ఆరుగురుని మాత్రమే సర్దుబాటు చేయవచ్చు. దీంతో నికరంగా 32మంది టీచర్లు మిగులుగా తేలారు.

టీచర్ల సర్దుబాటు బహిష్కరణ

అసంబద్ధమైన, అశాస్త్రీయమైన ఉపాధ్యాయుల సర్దుబాటును ప్యాప్టో, ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖల పిలుపు మేరకు బహిష్కరిస్తున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాకా జనార్దన్‌రెడ్డి, డి.శ్రీనివాసులులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలు చెప్పిన ఏ అంశాన్నీ పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఆగమేఘాల మీద కౌన్సెలింగ్ చేపట్టడాన్ని వారు తప్పుబట్టారు. 117 జీవో వల్ల వేలాదిమంది విద్యార్థులు పాఠశాలలను వదిలి డ్రాపవుట్లుగా మిగులుతున్నారని, అందువల్ల ఆ జీవోను రద్దుచేయాలని డిమాండ్ చేశారు.



ఎమ్మెల్యే దామచర్ల నుంచి బహుమతులు అందుకుంటున్న నారాయణ ఒలింపియాడ్ విద్యార్థులు

జిల్లాస్థాయి క్రీడల్లో నారాయణ విద్యార్థుల హవా

● బహుమతులు అందించిన ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 12 : స్వాతంత్ర్య క్రీడోత్సవాల్లో భాగంగా జై భీమ్ నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడాపోటీల్లో స్థానిక లాయర్‌పేటలోని నారాయణ సీవో అండ్ ఒలింపియాడ్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఫుట్‌బాల్‌లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలువగా క్రికెట్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచారు. బహుమతుల ప్రదానోత్సవ సభలో ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సోమవారం నారాయణ స్కూలులో జరిగిన కార్యక్రమంలో విజేతలను స్కూలు ప్రిన్సిపాల్ సయ్యద్ నాగూర్ వలి, ఏజీఎం పెద్దిరెడ్డిలు అభినందించారు.



మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న జీజీహెచ్ వైద్యులు, సిబ్బంది

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 12 : మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులపై ఉందని, ఆ దిశగా అందరూ కృషి చేయాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవి పిలుపునిచ్చారు. సోమవారం జీజీహెచ్‌లో డ్రగ్ ఫ్రీ ప్రచార కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ సాగర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి సూపరింటెండెంట్ హాజరై మాట్లాడారు. వివిధ రకాల మాదకద్రవ్యాలకు కొందరు యువత బానిస అవుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఈప్రమాదాన్ని గుర్తించి క్షేత్రస్థాయి నుంచి అవగాహన కల్పించే విధంగా సదస్సులు ఏర్పాటు చేసిందని డాక్టర్ ప్రభాకర్ రావు తెలిపారు. జీజీహెచ్‌లో సిబ్బంది పూర్తి అవగాహనతో ఉండాలని, సైక్రియాట్రిక్ విభాగంలో పూర్తి స్థాయిలో సిబ్బంది పనిచేస్తున్నారని అన్నారు. మద్యం, మత్తు పదార్థాలకు బానిసలైన వారికి జీజీహెచ్‌లో పూర్తి వైద్యం అందిస్తున్నట్లు ఆర్ఎంవో డాక్టర్ చెంచయ్య తెలిపారు. ఈకార్యక్రమంలో డాక్టర్ కల్యాణి, నర్సింగ్ సూపరింటెండెంట్ సంపూర్ణమ్మ, స్కూలు ప్రిన్సిపాల్ సుమిత్రాదేవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

ఏఐటీయూసీ జాతీయసమితి సమ్మేళనాలను విజయవంతం చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 12:విశాఖపట్నంలో సెప్టెంబరు 1నుంచి మూడు రోజుల పాటు జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాలను విజయవంతం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరి ఎస్. వెంకట సుబ్బయ్య పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో సోమవారం ఆంధ్రప్రదేశ్ ముఠా హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆఫీసు బేరర్ల సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సాంబశివరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ముఠా రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఎలాంటి చట్టాలు లేవన్నారు. ఈ నేపథ్యంలో విశాఖలో జరిగే సమ్మేళనాలలో కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ సమ్మేళనాలలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఠా కార్మిక సంఘం నాయకులు ఎండీ రవి, ఆర్. అంజిబాబు, ఎం.కృష్ణ, మహేష్,వియ్యపు నాగేశ్వరరావు, సుమన్ నాయుడు, వెంకటేశ్వర్లు, పీవీఆర్ చౌదరి, కొత్తకోట వెంకటేశ్వర్లు ఉన్నారు.



డొక్కా సీతమ్మ క్యాంటీన్‌వద్ద అన్నదానం చేస్తున్న టీడీపీ సీనియర్‌నేత శ్రీరామమూర్తి

పేదల ఆకలి తీర్చడం అభినందనీయం

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 12 : ఆకలితో అలమటిస్తున్న పేదలకు నిరంతరాయంగా అన్నదానం చేయడం అభినందనీయమని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు టీవీ శ్రీరామమూర్తి అన్నారు. స్థానిక లాయర్‌పేటలోని డొక్కా సీతమ్మ క్యాంటీన్ వద్ద సోమవారం శ్రీరామమూర్తి తన కుటుంబ సభ్యులతో కలిసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో డొక్కా సీతమ్మ పేరుతో క్యాంటీన్ ఏర్పాటు చేసిన ఆ పార్టీ నాయకుడు జడ బాలనాగేంద్రయాదవ్ నిరంతరాయంగా పేదలకు అన్నదానం చేయడం హర్షణీయమన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. జడ బాలనాగేంద్ర ఈ సందర్భంగా శ్రీరామమూర్తి కుటుంబ సభ్యులను సత్కరించారు. ఈకార్యక్రమంలో టీడీపీ వాణిజ్యవిభాగం అధ్యక్షుడు కొల్లిపల్లి సురేష్, ఆకుతోట చంద్రతో పాటు జనసేన, టీడీపీ నాయకులు ఉన్నారు.

నీటి పథకానికి విద్యుత్ కట్

మద్దిపాడు,ఆగస్టు 12: పంచాయతీ పాలకులు, అధికారులు నిధులు మింగేసి విద్యుత్ బిల్లులు చెల్లించకపోవటంతో నీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం మద్దిపాడు ఏఈ విద్యుత్ ఉన్నతాధికారుల ఆదేశాలతో దొడ్డవరం మంచినీటి పథకానికి ఫీజులు కట్‌చేసి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. గుండ్లకమ్మ జలాశయం సమీపంలో బావిలో మోటార్లు ఏర్పాటు చేసి పైప్‌లైను ద్వారా గ్రామానికి నీటి సరఫరా చేస్తున్నారు. ప్రజల నుంచి నీటి పన్ను వసూలు ద్వారా లక్షల ఆదాయం వస్తోంది. అయితే పంచాయతీ పాలకులు, అధికారులు ఆ నిధులు మింగేశారు. దీంతో విద్యుత్ శాఖకు రూ.22 లక్షల మేర బకాయి పడ్డారు. సోమవారం విద్యుత్ శాఖ అధికారులు మంచినీటి పథకానికి విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

ప్రతి అర్జీని సహేతుకంగా పరిష్కరించండి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



మీకోసంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 12 : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి అర్జీని సీరియస్‌గా పరిగణనలోకి తీసుకొని సహేతుకంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన మీ కోసం కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలురకాల సమస్యలను విన్నవించారు. ఆయా సమస్యలపై కలెక్టర్ మాట్లాడుతూ మీ కోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అర్జీలను పరిష్కరిస్తున్న తీరును ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అధికారులు పర్యవేక్షిస్తున్నారన్నారు. మొక్కుబడి సమాధానాలతో అర్జీదారులకు ఎండార్స్‌మెంట్ ఇచ్చేసి సమస్యను పరిష్కరించినట్లుగా రికార్డుల్లో చూపితే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో సమస్య పరిష్కారం కావాల్సిందేనని, పరిష్కరించలేని పక్షంలో అందుకు కారణాలను కూడా అర్జీదారులకు వివరించాలన్నారు. ఇప్పటికీ కొన్నిశాఖలు నిర్దిష్ట గడువులోగా సమస్యను పరిష్కరించకపోగా, కొన్నిశాఖలు అసలు అర్జీలనే చూడకపోవడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల తీరు మారకపోతే మెమోలు ఇస్తామని హెచ్చరించారు. కేవలం అర్జీల పరిష్కారంలోనే కాదని మీ కోసం కార్యక్రమానికి హాజరు విషయంలోనూ సమయపాలన పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి సోమవారం ఉదయం 9.55 గంటలకు అధికారులందరూ హాజరుకావాలని, ఆ తర్వాత వస్తే గైర్హాజరుగా పరిగణించాల్సి వస్తోందని కలెక్టర్ హెచ్చరించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు సుమారు 196 అర్జీలను అధికారులకు అందజేశారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, డీఆర్వో విశ్వేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఝాన్సీలక్ష్మి, వరకుమార్, లోకేశ్వరరావుతో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.



ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఎస్పీ దామోదర్

ప్రజా ఫిర్యాదులపై సమగ్ర విచారణ : ఎస్పీ

ఒంగోలు(క్రైం)ఆగస్టు12 : ప్రజా ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం చేస్తామని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యాక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 94 మంది తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఫిర్యాదిదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫిర్యాదిదారులు ఇచ్చిన అర్జీల గురించి మాట్లాడి చట్ట పరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు తీసుకొని మోసం చేసిన ఫిర్యాదులు , భూ వివాదాలు, అత్తింటి వేధింపులపై ఎక్కువగా ఫిర్యాదులు అందాయి.

● తన కుమారునికి రేణిగుంట ఎమ్మార్వో కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని కేతా పరమేశ్వరరావు అతని భార్య వసంత కుమారిలు రెండు లక్షలు నగదు తీసుకొని మోసం చేసారని ఒంగోలు పాపాకాలనీలో నివాసం ఉండే పసుపులేటి నరసింహరావు ఎస్పీకి ఫిర్యాదు చేసారు . ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు , అదనపు ఎస్పీ ఎస్‌వీ శ్రీధర్‌రావు, మహిళ పోలీసుస్టేషన్ సీఐ ఖాజావలి సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల వినియోగంపై ప్రశ్నించినందుకే తప్పుడు ఆరోపణలు

సమగ్ర విచారణ చేయాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ నాయకుడు సుబ్బారావు

ఒంగోలు(కలెక్టరేట్),ఆగస్టు 12 : గత ఏడాది జిల్లాకు నిధులు కేటాయించిన 'ఆడుదాం ఆంధ్రా'కు వచ్చిన నిధుల వినియోగంపై ప్రశ్నించినందుకే తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ బొడ్డు సుబ్బారావు ఫిర్యాదు చేశారు. సోమవారం మీకోసం కార్యక్రమంలో కలెక్టర్ అన్సారియాను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేసి సమస్యను వివరించారు. ఆడుదాం ఆంధ్రాకు, గతేడాది జరిపిన సమ్మర్ కోచింగ్ క్యాంపులకు ఎంత బడ్జెట్ వచ్చిందని అడిగినందుకు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. శీనయ్య అనేవ్యక్తి స్కూలుకు వెళ్ళకుండా డీఎస్‌డీవో వద్దనే ఉంటూ ఓడీ తీసుకుంటూ అధికారులను, ఇతర క్రీడా సంఘాలను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. జిల్లాలో 35 వరకు క్రీడాసంఘాలు ఉన్నాయని, డీఎస్‌డీవో వద్ద వీటికి సంబంధించిన ఎటువంటి రికార్డులూ లేవన్నారు. డీఎస్‌డీవో గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి స్పోర్ట్స్ కోటాలో కొన్ని ఉద్యోగాలు కూడా ఇచ్చారని ఫిర్యాదు చేశారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. తనపై చేసిన ఆరోపణలపై కూడా విచారణ చేసి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.

అక్రమాలు బయటపెట్టినందుకే తప్పుడు ప్రచారం

ప్రభుత్వ పీఈటీల సంఘం అధ్యక్షులు శీనయ్య వెల్లడి

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 12 : సాఫ్ట్ బాల్ అసోసియేషన్ పేరుతో అర్హులైన క్రీడాకారులకు అన్యాయం జరుగుతుందని, అనర్హులపై చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా కష్టపడి పతకాలు సాధించే క్రీడాకారులకు న్యాయం జరగాలని తాను పోరాటం చేస్తున్నానని ప్రభుత్వ వ్యాయామోపాధ్యాయుల సంఘం అధ్యక్షులు వై. శీనయ్య తెలిపారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలపై సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొడ్డు సుబ్బారావు, ఆయనతోపాటు మరి కొందరు క్రీడా సంఘాల ప్రతినిధులు తనపై నిందలు వేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో తాను ఎప్పుడు అక్రమాలకు పాల్పడలేదని, అలాగే నిబంధనలు ఉల్లంఘించలేదన్నారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ పేరుతో నిబంధనలు అతిక్రమించి నకిలీ సర్టిఫికెట్‌లు మంజూరు చేసినట్లు తన వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని తెలిపారు. అధికారులకు తాను చేసిన చేసిన ఫిర్యాదులపై కట్టుబడి ఉన్నానని వెల్లడించారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్‌పై అనవసరంగా ఆరోపణలు చేయాల్సిన అవసరం తనకు లేదని, ఇది తన వ్యక్తిగత విషయం కాదని, అర్హులైన క్రీడాకారులకు న్యాయం కోసమేననే విషయాన్నే క్రీడా మంత్రి, కలెక్టర్‌కు వివరించడం జరిగిందని తెలిపారు. తనపై తప్పుడు ప్రచారం చేసిన సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొడ్డు సుబ్బారావు, ఆయనతోపాటు మరి కొందరిపై న్యాయపరమైన పోరాటం చేస్తామని తెలిపారు.

అర్హులైన క్రీడాకారులకు న్యాయం జరిగే వరకు, క్రీడల పేరుతో జరుగుతున్న నకిలీ సర్టిఫికెట్ బాగోతంపై చర్యలు తీసుకునే వరకు తాను పోరాడతామని తెలిపారు. ఇప్పటికైనా సుబ్బారావు, ఆయనకు అండగా నిలుస్తున్న కొన్ని క్రీడా సంఘాల ప్రతినిధులు తనపై విమర్శలు మానుకోవాలని శీనయ్య హెచ్చరించారు.



వాటర్ ఫిల్టర్‌ను అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

సరస్వతీ శిశుమందిర్‌కు వాటర్ ఫిల్టర్ బహూకరణ

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 12:స్థానిక కర్నూల్ రోడ్‌లోని శ్రీ సరస్వతి శిశుమందిర్ స్కూలుకు సుహరి ఫౌండేషన్ నిర్వాహకులు సోమవారం రూ.12 వేలు విలువైన వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. సుహరి ఫౌండేషన్ అధ్యక్షులు సాదనాల సురేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మేడికొండ మోహన్ వాటర్ ఫిల్టర్‌ను స్కూలు యాజమాన్య ప్రతినిధి రాజ్యలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు శుభ్రమైన నీటిని తాగటం ద్వారా వారి ఆరోగ్యం బాగుంటుందనే ఉద్దేశంతో మేడ లక్ష్మి శ్రీ సహకారంతో వాటర్ ఫిల్టర్‌ను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో భువనేశ్వరి, బండారుపల్లి రవితేజ, దాసరి శ్రీనివాస్, చిన్న, సురేష్, చైతన్య, భాను, రవితేజ, ఉష, వెంకట్, అధ్యాపక బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

బొమ్మరిల్లు పిల్లల ఆశ్రమంలో..

మరోవైపు స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని బొమ్మరిల్లు పిల్లల ఆశ్రమంలో డ్వామా కార్యాలయ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పాలేటి వెంకట స్వామి పిల్లలకు పుస్తకాలు, పండ్లు తదితర వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సురేష్ బాబు, చిన్న, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

మూడు చక్రాల సైకిళ్లు అందజేత

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 12 : స్థానిక కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీకోసం) వద్ద దివ్యాంగులకు మూడు చక్రాలసైకిళ్ళు, వయోవృద్ధులకు శ్రవణ యంత్రాలను కలెక్టర్ తమీమ్ అన్సారియా అందజేశారు. సోమవారం మీ కోసం కార్యక్రమంలో సమస్యల పరిష్కారం కోసం పలువురు కలెక్టర్ అన్సారియాను కలిసి విన్నవించుకున్నారు. వెంటనే స్పందించిన కలెక్టర్ దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్ళు, వయోవృద్ధులకు శ్రవణ యంత్రాలను ఏర్పాటు చేయాలని ఆశాఖ అధికారి అర్చనను ఆదేశించారు. దీంతో దివ్యాంగులు రుద్రపాటి ఏలీషా, పాలేటి ప్రభుదాస్, సోమవరపు స్టీఫెన్, యామర్తి రాజా, కుంచాల ఏలేషా, సోమేపల్లిహిమబిందు, రామదుర్గం బాలవెంకటేశ్వర్లు, మేడ రామకృష్ణ, సయ్యద్ బాషాలకు మూడు చక్రాల సైకిళ్లను అందజేశారు. బెజవాడ వెంకట సుబ్బమ్మ, పబ్బిశెట్టి శ్రీరామమూర్తి, పాలేటి చిన వెంకటేశ్వర్లు, ఇరువురి వెంకటేశ్వర్లుకు శ్రవణ యంత్రాలను అందజేశారు. కలెక్టర్ వెంట జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో విశ్వేశ్వరరావు, దివ్యాంగుల సంక్షేమశాఖ అధికారి అర్చన తదితరులు ఉన్నారు.

హెచ్ఐవీ నియంత్రణ పోస్టర్ల ఆవిష్కరణ

హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ మండలి, జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ, వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రచురించిన ఎయిడ్స్ నియంత్రణ పోస్టర్లను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆవిష్కరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీ కోసం కార్యక్రమంలో సోమవారం ఈ పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణకు ఆయాశాఖలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్, ఒంగోలు ఏఆర్టీ సెంటర్ ఎంఎస్‌ఎంవో డాక్టర్ జోసఫ్ శామ్యూల్, హెల్ప్‌స్వచ్ఛందసంస్థ టీఐ ప్రాజెక్టు డైరెక్టర్ సాగర్, లింక్ వర్కర్స్ జిల్లాకమ్యూనికేషన్ మేనేజర్ డి. స్వరూప్‌కుమార్, ఎస్‌కే అమీన్ సాహెబ్, సినార్డ్, గ్రో గ్రాండ్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఎస్‌కే పీరుబాషా, సునీల్, కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.అంతకుముందు ఎయిడ్స్ నియంత్రణ కోసం కలెక్టరేట్ వద్దనుంచి స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన ర్యాలీని డాక్టర్ సురేష్‌కుమార్ ప్రారంభించారు.

బయోడైవర్సిటీ జిల్లా స్థాయి పోటీల విజేతలు వీరే

ఒంగోలు(విద్య),ఆగస్టు 12 : బయోడైవర్సిటీ జిల్లా స్థాయి పోటీలను సోమవారం స్థానిక బండ్లమిట్టలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. వక్తృత్వ పోటీల్లో కే మాధురి(ఇంకొల్లు), ఎం.నందిని,కే జాహ్నవి(కరవది), ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలువగా వ్యాసరచనలో ఎస్‌కె మహి(బండ్లమిట్ట), బి. గంగ అక్షయ(ఒంగోలు), ఎ. గీతిక(ఈతముక్కల), క్విజ్ పోటీల్లో ఎం. నవ్యశ్రీ, ఆర్. లాస్యశ్రీ, ప్రియ(ఒంగోలు వీవీఆర్ బాలికల), ఆర్‌వీ జీతవేశ్వర్, ఎం. నవదీప్(పొందూరు) వరుసగా నిలిచారు. బయోడైవర్సిటీ జిల్లా కో ఆర్డినేటర్ ఎం. సంజీవరాజు ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. విజేతలను అభినందించారు. ఈకార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎంవో ఎం.రమేష్, పాఠశాల హెచ్ఎం జి.కృష్ణకుమారి, ఎ. ప్రసాద్, ప్రదీప్‌కుమార్, గౌరి నివేదిత, డి. చంద్రశేఖర్, ఉమామహేశ్వరచారి, అనిల్ తదితరులు ఉన్నారు. విజేతలకు స్వాతంత్ర్య వేడుకల్లో బహుమతులు ప్రదానం చేయనున్నారు.

19న పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 12 : జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న సబ్ జూనియర్స్ బాల, బాలికల, జూనియర్, స్త్రీ పురుషులు, మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ ఎంపికలు జరుగుతాయని ప్రధాన కార్యదర్శి జి. భక్తధ్రువుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3గంటలకు ఒంగోలు శర్మాకాలేజి సమీపంలోని భారత జాతీయ వ్యాయామ కళాశాలలో ఎంపికలు జరుగుతాయని, ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబరు 14, 15 తేదీలలో డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జరుగు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు సెల్ 8142555000 ద్వారా సంప్రదించాలన్నారు.

ఎస్పీని కలిసిన రాఘవరెడ్డి

ఒంగోలు(క్రైం)ఆగస్టు12 :ఎస్పీ ఏఆర్.దామోదర్‌ను తెలుగుదేశం పార్టీ యువనాయకుడు, ఎంపీ మాగుంట తనయుడు మాగుంట రాఘవరెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్పీకి బొకే అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఒంగోలు పార్లమెంట్ పరిధిలో శాంతి భద్రతల సమస్యల గురించి ఎస్పీకి రాఘవరెడ్డి వివరించారు.

ఎస్పీని కలిసిన సీఐలు

ఒంగోలు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న వై.పాండురంగారావు, ఒంగోలు రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన ఎన్.శ్రీకాంత్ బాబు సోమవారం వేర్వేరుగా ఎస్పీ ఏఆర్. దామోదర్‌ను కలిసి పూల మొక్కలు అందజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మద్దిపాడు, ఆగస్టు 12:రాచవారిపాలెం దళిత కాలనీకి చెందిన ఏడుగురు పేకాట రాయుళ్లను మద్దిపాడు ఎస్సై వెలగా మహేష్ సోమవారం అరెస్ట్ చేశారు. పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారంతో శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.4,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లుఎస్సై తెలిపారు.

మద్దిపాడు ఎంపీడీవోగా శ్రీనివాసరావు

మద్దిపాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా వై.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు.

అవీ..ఇవీ..

ఉత్తమ సేవా పురస్కారానికి ఆశా వర్కర్ ఎంపిక



ఉత్తమసేవా పురస్కారానికి ఎంపికైన ఆశా వర్కర్‌ను అభినందిస్తున్న డీఎంహెచ్‌వో

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 12 : స్వాతంత్ర్య దినోత్సవం రోజున కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఉత్తమ సేవా పురస్కారానికి ఒంగోలుకు చెందిన రూతమ్మ ఎంపికయ్యారు. స్థానికసుజాత నగర్‌లో పనిచేస్తున్న ఆశా వర్కర్ రూతమ్మ చేసిన సేవలను ఆదర్శంగా తీసుకొని ఆమెను పురస్కారానికి ఎంపిక చేశారు. స్థానిక వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఉత్తమసేవా పురస్కారానికి ఎంపికైన రూతమ్మను అభినందించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్ మాట్లాడుతూ రూతమ్మను ఆదర్శంగా తీసుకొని ఆశా వర్కర్లు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాస్‌మీడియా అధికారి శ్రీనివాసులు, డీపీవో సుబ్బలక్ష్మి తదితరులు ఉన్నారు.

గాయకులకు గౌరవ డాక్టరేట్లు



డాక్టరేట్లతో గాయకులు

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 12:ఒంగోలుకు చెందిన ఇద్దరు గాయకులకు సంగీతంలో గౌరవ డాక్టరేట్లు లభించాయి. స్థానిక పీడీసీసీ బ్యాంకు ఏజీఎంగా పనిచేస్తున్న కుంభా రాఘవయ్య, న్యాయశాఖలో పనిచేస్తున్న డి.ఉషారాణిలను చెన్నైకు చెందిన ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ కళలలో గౌరవ డాక్టరేట్‌తో ఘనంగా సత్కరించారు. చెన్నై నగరంలోని ఒక ప్రయివేటు ఫంక్షన్ హాలులో పలువురు ముఖ్యఅతిథుల నుంచి వారికి డాక్టరేట్ ప్రదానం జరిగింది. కాగా వారికి డాక్టరేట్ లభించటం పట్ల పలువురు స్థానిక కళాకారులు, సాంస్కృతిక సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

వీవోఏను కొనసాగించాలి



ఏపీఎంకు వినతిపత్రం అందిస్తున్న గ్రూపు మహిళలు

నాగులుప్పలపాడు, ఆగస్టు 12:తిమ్మసముద్రం గ్రామంలో శ్రీ షిరిడి సాయి బాబా గ్రామైక్య సంఘం వీవోఏ రాచూరి మాధవిని ఎలాంటి ఆరోపణలు లేకుండా తొలగించడం సరైన పద్ధతికాదని సీపీఎం మండల కార్యదర్శి టి.శ్రీకాంత్, సీఐటీయూ మండల కార్యదర్శి జి.బసవపున్నయ్యలు పేర్కొన్నారు. తక్షణమే తొలగించిన వీవోఏను తిరిగి నియమించాలని కోరుతూ డ్వాక్రా గ్రూపు మహిళలతో కలసి సోమవారం ఏపీఎం హనుమంతరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రూపు లీడర్లతో సంబంధం లేకుండా వీవోఏను మార్చడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని మహిళలు, సీపీఎం నాయకులు హెచ్చరించారు.

ఘనంగా మల్లవరపు జాన్ జయంతి

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 12:ప్రముఖ పద్యకవి మల్లవరపు జాన్ జయంతి సభ సోమవారం స్థానిక సుజాతనగర్ అపెక్స్ పాఠశాలలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి జానుడి కన్వీనర్ వై.విజయ్‌కుమార్ అధ్యక్షత వహించగా పాఠశాల కరస్పాండెంట్ శివకోటి రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జానుడి డైరెక్టర్ డాక్టర్ నూకతోటి రవికుమార్ మాటాడుతూ జాన్ స్మారకార్థం ఈ ఏడాది నిర్వహించిన పోటీలలో 50 మందికి పైగా చిన్నారులు పాల్గొన్నారని, వారిలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమ సమన్వయకర్తలుగా పాఠశాల ఉపాధ్యాయినులు కె.పద్మ, వి.శ్రీలక్ష్మి వ్యవహరించారు.

ప్రణాళికాబద్ధంగా పారిశుధ్య నిర్వహణ



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 12 : గ్రామాల్లో ప్రణాళికాబద్ధంగా పారిశుధ్య నిర్వహణ, ఘన వ్యర్థాల నిర్వహణ, గ్రామాభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని ఒంగోలు ఎంపీడీవో బండి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో సోమవారం పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అంశాల వారీగా సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ రమణమ్మ, రిసోర్స్ పర్సన్ రామమోహన్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు ఎన్.బాబు, శేషగిరిరావు తదితరులు ఉన్నారు.

రమేష్‌బాబుకు డాక్టరేట్

ఒంగోలు(విద్య), ఆగస్టు 12 : చీమకుర్తి మండలం పి. నాయుడుపాలెం జడ్పీ హైస్కూలులో ఇంగ్లీషు స్కూలు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి. రమేష్‌బాబుకు ఆచార్య నాగార్జున యూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఏ స్టడీ ఆఫ్‌ది ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఇన్‌పుట్స్ ఇన్‌ది బీఈడీ కరికులమ్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై పరిశోధన చేసి గ్రంథాన్ని సమర్పించారు. నాగార్జున విశ్వవిద్యాలయం పీజీ సెంటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ డి. హసన్ గైడ్‌గా వ్యవహరించారు. డాక్టరేట్ సాధించిన రమేష్‌బాబును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎమ్మార్పీఎస్ విజయోత్సవ సభకు తరలిరావాలి



సమావేశంలో నినాదాలు చేస్తున్న నేతలు

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 12 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పురస్కరించుకుని ఈనెల 13న హైదరాబాదులో వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో చేపట్టిన విజయోత్సవ ర్యాలీకి మాదిగలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఒంగోలు నగర అధ్యక్షులు గుంటూరి ప్రభుదాస్ పిలుపునిచ్చారు. సోమవారం ఒంగోలులోని అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాదు వేదికగా చేపట్టిన మాదిగల విజయోత్సవ సభ, ర్యాలీలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది పాల్గొంటున్నారని అన్నారు. కాగా ఒంగోలు నుంచి నగర కమిటీ ఆధ్వర్యంలో 15కి పైగా వాహనాలు ఏర్పాటు చేశామని వివరించారు. సమావేశంలో నాయకులు ఐదుపోగుల అజయ్, ఐదుపోగుల శిఖామణి, సుబ్బారావు, బాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దశదిన కర్మలో ఎమ్మెల్యే బీఎన్



వెంకట్రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, ఆగస్టు 12: వినోదరాయునిపాలెం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు తోటి అంజిబాబు తండ్రి వెంకట్రావు దశదిన కర్మ సోమవారం గ్రామంలో నిర్వహించారు. ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ పాల్గొని వెంకట్రావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, కుటుంబ సభ్యులను పరామర్శించి తన సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు తేళ్ళ మనోజ్ కుమార్, గ్రామ పార్టీ అధ్యక్షులు నాగరాజు, జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు కొంజేటి ధనుష్, సాయి, మెట్టు సుబ్బయ్య నాయుడు, స్వర్ణ కిషోర్, సాయి చరణ్, సుబ్బారావు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

నిలకడగా పొగాకు ధరలు


కొనసాగుతున్న పొగాకు వేలం

టంగుటూరు, ఆగస్టు 12 : పొగాకు ధరలు వారం రోజుల నుంచి నిలకడగా కొనసాగుతున్నాయి. సాధారణ వేలంలో పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.366 వరకూ లభించింది. అదనపు పంట కొనుగోళ్ల ప్రారంభం కాగానే వ్యాపారులు ధర తగ్గించారు. మొదట్లో కిలో రూ.360 వరకూ కొనుగోలు చేశారు. గత సోమవారం రూ.2 వరకూ తగ్గించి రూ.358కి పరిమితం చేశారు. వారం రోజులుగా అదే ధరను కొనసాగిస్తున్నారు. సోమవారం తూర్పునాయుడుపాలెం, కాకుటూరివారిపాలెం రైతులకు చెందిన 1,161 బేళ్లను అధికారులు వేలానికి అనుమతించారు. అందులో 1,003 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించారు. గరిష్ఠ ధర కిలో రూ.358, కనిష్ఠ ధర రూ.205 లభించింది. సరాసరి ధర రూ.291.93 దక్కింది. కొనుగోళ్లలో 15 కంపెనీల వ్యాపారులు పాల్గొన్నారు.

108 పైలట్ కుటుంబానికి ఆర్థిక సాయం


నగదును అందిస్తున్న యూనియన్ సభ్యులు

టంగుటూరు, ఆగస్టు 12 : కురిచేడు మండలం భోగనంపాడుకు చెందిన అబిద్‌వలి 108 వాహనంలో పైలెట్‌గా విధులు నిర్వర్తిస్తూ రెండు నెలల క్రితం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులకు 108 ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం భోగనంపాడులో రూ.95వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు దర్గా మస్తాన్‌వలి, ప్రధాన కార్యదర్శి వి.గాలిరెడ్డి, కోశాధికారి ఆదాం, పొదిలి డివిజన్ సభ్యులు నరేష్, మస్తాన్‌వలి, మెహబూబ్‌బాషా, కురిచేడు ఈఎంటీ యెహాను, పైలెట్ రెహమాన్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

జరుగుమల్లి (కొండపి), ఆగస్టు 12 : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎంఈవో బత్తుల నాగేంద్రవదన్ సూచించారు. మత్తుపదార్థాల వలన కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మండలంలోని కె.బిట్రగుంటలో కేజీబీవీ విద్యార్థినులు సోమవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్రవదన్ మాట్లాడుతూ వ్యసనాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.స్రవంతి పాల్గొన్నారు.

సూక్తి సుధలు ఖండకావ్యం ఆణిముత్యం


ఖండకావ్యాన్ని ఆవిష్కరిస్తున్న మద్రాస్ వర్సిటీ తెలుగు శాఖాధిపతులు విస్తాలి శంకరరావు

అద్దంకిటౌన్, ఆగస్టు 12 : సూక్తి సుధలు ఖండకావ్యం ఒక ఆణిముత్యం అని, ఇది అన్ని వయస్సులవారు ఆచరించదగిన పారాయణ గ్రంథమని మద్రాస్ యూనివర్సిటీ తెలుగు శాఖాధిపతులు ఆచార్య విస్తాలి శంకరరావు అన్నారు. సోమవారం అద్దంకిలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో రచయిత విద్వాన్ జ్యోతి చంద్రమౌళి రచించిన సూక్తి సుధలు ఖండకావ్యం ఆవిష్కరణ కార్యక్రమం హెచ్‌ఎం డీఎస్ పద్మావతి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విస్తాలి శంకరరావు గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతు ఇటువంటి గ్రంథాన్ని తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుకు అంకితం ఇవ్వడం ఆదర్శవంతమైనదన్నారు. గ్రంథ సమీక్షకులు డాక్టర్ యూ దేవపాలన మాట్లాడుతూ ఈ గ్రంథం నేటి సమాజంలో జరిగే అసమానతలకు అర్థంపట్టే విధంగా ఉందని, పద్యాలు సమాజంలో జరిగే మార్పులు, నేటి చరిత్రను గుర్తు తెస్తున్నాయని అన్నారు. మరో సమీక్షకులు అన్నమనేని వెంకట్రావు మాట్లాడుతూ ఈ గ్రంథం నాటి నుంచి నేటి వరకూ జరుగుతున్న అఘాత్యాలను సందేశాత్మకంగా రచయిత చెప్పారన్నారు. అనంతరం రచయిత జ్యోతి చంద్రమౌళిని అతిథులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య), డాక్టర్ చుక్కా నాగభూషణం, డాక్టర్ కాకాని సుధాకర్, దివాకర్ దత్తు, పీఈటీ ఎం.నాగయ్య, వీరయ్య, వీరాంజనేయులు, నాగేశ్వరరావు, శ్రీమన్నారాయణమూర్తి, రమేష్, ఉపాధ్యాయుడు వీలక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారి వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం

చీరాలటౌన్, ఆగస్టు 12 : వడ్డీ వ్యాపారి వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈఘటన సోమవారం మధ్యాహ్నం పట్టణ పరిధిలోని థామస్‌పేటలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు పేటకు చెందిన గొల్ల సాల్మన్ రోజువారి కూలీ. ఇతనికి భార్య ఇద్దరు కుమార్తెలున్నారు. కుటుంబ అవసరాల నిమిత్తం అదే ప్రాంతానికి చెందిన బడుగు హెప్సిబా వద్ద అధిక వడ్డీకు సుమారు రూ.1.50లక్షలు వరకు అప్పు తీసుకున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే చాలా వడ్డీ చెల్లించారు. రోజుకు రూ.వెయ్యి చెల్లించాలని లేదా ఉన్న పళంగా బాకీ ఇవ్వాలని, లేకుంటే ఇంటికి తాళాలు వేస్తానని హెప్సిబా బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ విషయమై రెండు రోజులుగా పంచాయితీ జరుగుతుంది. గడువుకు సోమవారం చివరి రోజు కావడంతో చేసేదిలేక సాల్మన్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గ్రహించిన చిన్న కుమార్తె ఏంజిల్ బిగ్గరగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. ఈమేరకు అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. అయితే దీనిపై బాధితుడి సోదరి దయమ్మ మాట్లాడుతూ హెప్సిబా వేధింపులకు గతంలోనే చిన్న తమ్ముడు సామ్యేల్ రైలు కిందపడి మృతిచెందినట్లు ఆరోపించారు. బాపట్లకు చెందిన తులసి అనే వ్యక్తిని తీసుకువచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు.

వ్యక్తిపై కత్తితో పలువురు దాడి

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఆగస్టు 12 : ద్విచక్ర వాహనాన్ని ఆపి వ్యక్తిపై పలువురు కత్తితో దాడిచేసి గాయపరిచిన సంఘటన ఆదివారం రాత్రి చీరాల మండలం ఈపూరుపాలెం యూసూఫ్‌నగర్ రైలు గేటు వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల మండలం స్టూవర్టుపురానికి చెందిన దేవరకొండ కిషోర్, మరియమ్మ ద్విచక్ర వాహనంపై చీరాల నుంచి యూసూఫ్‌నగర్ మీదుగా ఇంటికి వెళుతున్నారు. బోయినవారిపాలెంకు చెందిన కోటి మోహన్, మరో ఇద్దరు వీరిని అడ్డగించి కత్తితో దాడిచేసి గాయపరిచారు. అడ్డు వచ్చిన మరియమ్మపై కూడా దాడి చేశారు. బాధితులు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.

గ్రావెల్ తవ్వకాలను నిలిపివేసిన మైనింగ్ అధికారులు

మార్టూరు, ఆగస్టు 12 : నాగరాజుపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలను సోమవారం మైనింగ్, రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు పరిశీలించారు. అనంతరం గ్రావెల్ తవ్వకాలను నిలిపివేయించా రు. నాలుగు టిప్పర్లను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న భూములు అటవీ భూములు పరిధిలో లేవని ఫారెస్ట్ అధికారులు స్పష్టం చేశారు. అనంతరం ద్రోణాదులలో గ్రావెల్ కొండ ప్రాంతాన్ని మైనింగ్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షల సాయం

మంత్రి డాక్టర్ స్వామి

వైసీపీ పాలనలో నిర్మాణ రంగం కుదేలైందని విమర్శ

కలికివాయిలో స్వామి, సత్యను సత్కరించిన వడ్డెరులు


మంత్రి స్వామి, దామచర్ల సత్యకు సత్కారం చేస్తున్న వడ్డెర సంఘ నాయకులు

సింగరాయకొండ, ఆగస్టు 12 : రాష్ట్రంలో పేదల ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.4 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తుందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి వెల్లడించారు. మండలంలోని కలికివాయిలో సోమవారం వడ్డెరలు ఏర్పాటు చేసిన ఆత్మీయ సత్కారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం అనుసరించిన అస్తవ్యస్త విధానాల వలన నిర్మాణ రంగం కుదేలైందని స్వామి విమర్శించారు. ఉచిత ఇసుక విధానం రద్దు వలన భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారని ధ్వజమెత్తారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన నెలలోనే ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో భవన నిర్మాణ కార్మికుల కోసం అమలుచేసిన ప్రమాద బీమా పాలసీని త్వరలోనే పునరుద్ధరిస్తామన్నారు. వడ్డెరులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘనవిజయంలో వడ్డెరులు కూడా తమవంతు పాత్రను పోషించారని కితాబిచ్చారు. అనంతరం వల్లెపు రాఘవులు ఆధ్వర్యంలో స్వామి, సత్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మందలపు గాంధీచౌదరి, కూనపరెడ్డి సుబ్బారావు, సుదర్శి చంటి, గణిపినేని రవి, గుల్లా వెంకటేష్, వడ్డెర సంఘ నాయకులు పాల్గొన్నారు.

నాగార్పమ్మ ఆలయంలో మంత్రి పూజలు

కొండపి, ఆగస్టు 12 : మండలంలోని పెదకండ్లగుంట గ్రామంలో నాగార్పమ్మ కొలుపులకు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సోమవారం హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట పార్టీ ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్య చౌదరి, గ్రామ మాజీ సర్పంచ్ తానికొండ వెంకటేశ్వర్లు, నాయకులు కల్లూరి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువల పూడ్చివేత

కట్టడాలు చేపట్టేందుకు పూడ్చిన వైసీపీ నేత

ముందుకు నీరు వెళ్లే మార్గంలేక

ఇబ్బందులు పడుతున్న ప్రజలు


మట్టితో పూడ్చివేసిన మురుగు కాల్వ

తాళ్లూరు, ఆగస్టు 11 : మండలంలోని తూర్పుగంగవరం గ్రామపంచాయతీలో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన మురుగు కాలువలను పూడ్చి వేస్తున్నారు. ప్రధానంగా చీమకుర్తి వెళ్లే మార్గంలో మట్టితో పూడ్చి చదునుచేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలో రోడ్లను విస్తరించి మురుగునీరు వెళ్లేందుకు కాలువలు నిర్మించారు. కాలువలు ఆనుకుని ఉన్న యజమానులు వాటిని ఆక్రమించి బంకులు, తోపుడు బండ్లు ఏర్పాటు చేశారు. కాలువలపై ఉన్న బండ్లను తొలగించకపోవటంతో వైసీపీ నేత ఏకంగా మురుగుకాలువను పూడ్చి కట్టడాలు చేపట్టేందుకు యత్నిస్తున్నారు. బొద్దికూరపాడు బస్టాండ్ నుంచి చీమకుర్తి వెళ్లే మార్గంలో మాజీ సర్పంచ్ గుజ్జుల వెంకటేశ్వరరెడ్డి సమాధి సమీపంలో మురుగు కాలువను నామరూపాల్లేకుండా పూర్తిగా మట్టితో పూడ్చివేశారు. ఆ ప్రాంతంలో గల స్థలంలో నిర్మాణాలు చేపడుతున్న స్థలం యజమాని వైసీపీ నేత తమకు ఎవరు అడ్డుచెబుతారన్న ధీమాతో ఏకంగా మురుగు కాలువను మట్టితో పూడ్చి వేశారని గ్రామస్థులు పేర్కొన్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు మట్టితో చదును చేశారు. కాలువను పూడ్చి వేయటంతో మురుగు నీరు ముందుకు వెళ్లే మార్గంలేక రోడ్డుపైకి చేరుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, గ్రామపంచాయతీ స్పందించి కాలువను పూడ్చివేసిన వారిపై చర్యలు గైకొని మురు గునీరు సక్రమంగా ప్రవహించేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆక్రమణలు తొలగించేనా!

» భవనాసిని రిజర్వాయర్‌గా మార్చే క్రమంలో అడ్డంకిగా సమస్య » అధికారుల ఉదాసీనతతో పెరుగుతున్న చేపల చెరువులు


భవనాసి చెరువు


భవనాసి అంచున ఉన్న చేపల చెరువులు

అద్దంకి, ఆగస్టు 12 : భవనాసి చెరువులో ఉన్న ఆ క్రమణలు తొలగింపుపై అధికారుల ఉదాసీనత భవిష్యత్‌లో మరిన్ని సమస్యలకు కారణంగా నిలిచే అవకాశం ఉంది. భవనాసి చెరువును రిజర్వాయర్‌గా మార్చే పనులు 2009 సంవత్సరంలో ప్రారంభమయ్యాయి. అప్పట్లోనే రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి సర్వే చేపట్టి హద్దు రాళ్లు వేశారు. అప్పటికే కొంత మేర భవనాసి చెరువు ఆ క్రమణకు గురైనట్లు గుర్తించారు. 1918 సంవత్సరంలో భవనాసి చెరువు నిర్మాణం పూర్తయింది. అప్పట్లో భవనాసి చెరువు విస్తీర్ణం వెయ్యి ఎకరాలు ఉంటుందని అంచనా. ప్రస్తుతం చెరువు విస్తీర్ణం ఏడెనిమిది వందల ఎకరాలకు మించి ఉండదనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. కొంత భాగాన్ని రైతులు ఆ క్రమించి సాగు భూములుగా మార్చు కోగా, క్రమేపి ఆ భూమి లో చేపల చెరువుల ఏర్పాటు జరుగుతూ వస్తుంది. భవనాసి చెరువు అంచున పెద్ద ఎత్తున చేపల చెరువులు ఏర్పాటు ఏటికేడు పెరుగుతునే ఉన్నాయి. పనిలో పనిగా కొత్త చేపల చెరువులు తవ్వకాలు సమయంలో భవనాసి చెరువులో కొంత భాగాన్ని ఆ క్రమిస్తున్నారు. ఆ క్రమణలు జరుగుతున్నా ఆయా శాఖల అధికారులు మొక్కుబడిగా హడావుడి చేయడం మినహా అడ్డుకోకపోవడంతో ఆక్రమణ దారులు మరింత రెచ్చిపోతున్నారు. దీంతో భవనాసి చెరువుకు రెండు వైపులా ప్రస్తుతం చేపల చెరువులు పెద్ద ఎత్తున ఏర్పడ్డాయి. రిజర్వాయర్ పనులు పూర్తయితే చేపల చెరువులు తొలగించకుండా నీటి నిల్వ సామర్థ్యం పెంచటం సాధ్యం కాదు. చేపల చెరువులను తొలగించాలంటే పెద్ద మొత్తంలో పరిహారం ఎలాగూ పొందవచ్చు అన్న ధీమాతో పెద్ద మొత్తంలో చేపల చెరువులు తవ్వకాలకు జరుగుతున్నట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో ముందస్తుగానే అధికారులు ఆక్రమణలు తొలగించాలని పలువురు కోరుతున్నారు. అలా కాకుండా రిజర్వాయర్ నిర్మాణం పూర్తయిన తరువాత అయితే ఆక్రమణల తొలగింపునకు మరికొంత కాలం సమయం పట్టి కాలయాపన జరిగే అవకాశం ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. ఇప్పటికైనా భవనాసి చెరువును ఆక్రమించి ఏర్పాటు చేసిన చేపల చెరువులను, అనుమతులు లేకుండా తవ్విన చేపల చెరువులను తొలగిస్తారో లేక తమ కెందుకులే అని గతంలో పనిచేసిన అధికారుల వలే మిన్నకుంటారో వేచి చూడాల్సి ఉంది.

నకిలీ సర్టిఫికెట్‌లపై మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు


మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు చేస్తున్న క్రీడాకారులు

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 12 : ప్రకాశం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నకిలీ సర్టిఫికెట్‌ల బాగోతం విచ్చలవిడిగా జరుగుతోందని జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు మంత్రి నారా లోకేష్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. తాము కష్టపడి ఆడినా, తమను గుర్తించకుండా అనర్హులకు సర్టిఫికెట్‌లు మంజూరు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా నీట్ పరీక్షలు రాసి, ఎంబీబీఎస్ చదివే వారికి సర్టిఫికెట్‌లు అమ్ముకుంటున్నారని, అలాగే పలు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలకు స్పోర్ట్స్ కోటా కింద సాఫ్ట్‌బాల్ సర్టిఫికెట్‌లు అమ్ముకుంటున్నారని తెలిపారు. ఈ విధమైన అక్రమాల ద్వారా అర్హత కలిగిన తాము ప్రభుత్వ ఉద్యోగాలు పొందలేకపోతున్నామని, బాధితులు లోకేష్‌కు వివరించారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ బొద్దు సుబ్బారావు, సీఈవో వెంకటేశ్వర్లుతోపాటు మరి కొంతమంది ఈ తరహా అక్రమాలకు పాల్పడుతున్నారని వివరించారు. దీనిపై స్పందించిన లోకేష్ పూర్తిస్థాయి విచారణ చేస్తామని, అలాగే నకిలీ క్రీడా సర్టిఫికెట్‌లు మంజూరు చేసిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని, ఎవరినీ ఉపేక్షించేది లేదని హామీ ఇచ్చారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లు పట్టివేత


ఇంకా చెలరేగిపోతున్న వైసీపీ ముఠా

ఇప్పటికి రెండుస్లార్లు పట్టుకున్నా వెరవని వైనం


అక్రమంగా మట్టి తరలిస్తూ పట్టుబడిన టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లు

దర్శి, ఆగస్టు 12 : మండలంలోని రాజంపల్లి చెరువులో మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లను సోమవారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. పట్టపగలు చెరువులో మట్టి అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందటంతో తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ హుటాహుటిన వెళ్లారు. చెరువులో నాలుగు ఎక్స్‌కవేటర్లతో టిప్పర్లకు మట్టి ఎత్తుతుండగా పట్టుకున్నారు. అక్కడ ఉన్న నాలుగు ఎక్స్‌కవేటర్లు, రెండు టిప్పర్లను పట్టుకొని దర్శికి తరలించారు. ప్రభుత్వం మారినప్పటికీ వైసీపీ నాయకుల మట్టి దందా ఆగలేదు. అధికారుల మెతక వైఖరితో దొంగచాటుగా మట్టి తరలిస్తూనే ఉన్నారు. ఇటీవలకాలంలో రెండుసార్లు రాజంపల్లి చెరువులో మట్టి తరలిస్తూ పట్టుబడినప్పటికీ మళ్లీ సోమవారం దందా మొదలుపెట్టారు. కొద్దిరోజుల క్రితం నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రావణ్‌కుమార్ సమాచారం అందిన వెంటనే వెళ్లి మట్టి తరలింపును అడ్డుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా ప్రభుత్వ భూముల్లో, కొండల మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మట్టి తరలించే టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లను సీజ్ చేస్తామని చెప్పారు.

కనువిందు చేస్తున్న భైరవకోన జలపాతం


కనువిందు చేస్తున్న జలపాతం

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 12: సీఎస్‌పురం మండలంలోని భైరవకోన జలపాతం నీటి ఉధృతితో సోమవారం కళకళలాడుతుంది. సాయంత్రం కురిసిన వర్షానికి జలపాతంలోకి నీళ్ళు పుష్కలంగా చేరాయి. కొండ కోనల నడుమ నుంచి జాలువారుతున్న నీటిలో స్నానాలు ఆచరిస్తే సకల పాపాలు హరిస్తాయనేది భక్తుల విశ్వాసం. జలపాతం అందాలు తిలకించేందుకు పర్యాటకులు మంగళవారం నుంచి వచ్చే అవకాశం ఉన్నందున జలపాతం వద్ద ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. కాగా, పామూరు, సీఎస్‌పురం మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది.

లారీ డ్రైవర్ మృతిపై కేసు

కనిగిరి, ఆగస్టు 12: గ్రానైట్ క్వారీలో పనిచేస్తున్న లారీ డ్రైవర్ అట్లూరి రత్తయ్య (41) అనుమానాస్పద మృతిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ త్యాగరాజు తెలిపారు. పట్టణ సమీపంలోని గార్లపేట రోడ్డులోగల దస్తగిరి గ్రానైట్ క్వారీలో ఈ ప్రమాదం జరిగిందని ఆయన తెలిపారు. గ్రానైట్ రాయిని క్వారీ ర్యాంపు నుంచి లారీలోకి లోడ్‌చేసే క్రమంలో ప్రమాదం చోటుచేసుకుంది. బండరాయి ఒక్కసారిగా ఒరిగిపోయి లారీకి, క్వారీ ర్యాంప్‌నకు మధ్యలో లారీ డ్రైవర్ రత్తయ్యపై పడింది. ప్రమాదంలో రత్తయ్య తలకు బలమైన గాయంకాగా స్థానిక ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు అట్లూరి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. క్వారీ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి, అజాగ్రత్త కారణంగా తన తండ్రి మృతిచెందాడని రత్తయ్య కుమారుడు చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు.

డిగ్రీ విద్యార్థి హత్య కేసులో నిందితుల అరెస్ట్

పరారీలో ఉన్న ఇద్దరి కోసం గాలింపు

వారంతా పాత నేరస్తులే

వివరాలు వెల్లడించిన ఏఎస్పీ విఠలేశ్వర్


వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

చీరాలటౌన్, ఆగస్టు 12 : డిగ్రీ విద్యార్థినిని అతి కిరాతకంగా మట్టుపెట్టిన నిందితులను చీరాల టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం రాత్రి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఎస్పీ విఠలేశ్వర్ వివరాలను వెల్లడించారు. చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం ఈసూబ్‌నగర్‌కు చెందిన సయ్యద్ అమీన్ ఆరీఫ్(18) పట్టణంలోని ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదవుతున్నాడు. చిన్ననాటి నుంచే ఆరీఫ్ ఆర్మీపై మక్కువ పెంచుకున్నాడు. దీంతోనే ప్రతి రోజూ శరీరదారుఢ్యాన్ని పెంచుకునేందుకు చీరాల్లో జిమ్‌కు వెళ్లేవాడు. ఈక్రమంలోనే ఈనెల 6వ తేదీ రాత్రి జిమ్ ముగించుకుని మిత్రుడు మనోజ్ (బైక్)తో కలిసి ఆరీఫ్ (సైకిల్‌పై) ఈపూరుపాలెంలో ఇంటికి వెళుతున్నారు. అయితే చీరాల - బాపట్ల రోడ్డులోని ఆదినారాయణపురం వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి కారులో బాపట్ల వైపు వెళుతున్న పాత నేరస్తులు వెదుళ్లపల్లికి చెందిన సందీప్ హారన్ కొట్టాడు. ఈక్రమంలోనే వీరి మధ్య వివాదం రేగింది. అదికాస్త పెద్దదవడంతో సందీప్‌తో పాటు కారులో ఉన్న బాపట్లకు చెందిన జిలానీ, చీరాల పాపరాజుతోటకు చెందిన మహేంద్ర ఒకరి తరువాత ఒకరు కత్తితో పొడిచి అతి కిరాతకంగా హత మార్చి పరారయ్యారు. దీనికి కారులో ఉన్న మిగిలిన ఐదుగురు సహకరించారు. ఆరిఫ్ మిత్రుడు మనోజ్ ఫిర్యాదు మేరకు కారులో ఉన్న ఎనిమిది మందిపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేట్టారు. ఎట్టకేలకు సోమవారం వారిని అరెస్ట్ చేసి హత్యకు పాల్పడిన కత్తిని ఆరుగురిని అరెస్ట్ చేశారు. మహేంద్ర, రామకృష్ణాపురానికి చెందిన కర్రెద్దుల వంశీ కోసం గాలింపు చర్యలు సాగుతున్నట్లు ఏఎస్పీ వివరించారు. సందీప్, జిలానీ, షేక్ మహ్మద్ రియాజ్, పాశం లక్ష్మీనారాయణ, దేవరకొండ శ్రీను, అంగడి సుకుమార్‌ను కోర్టులో హాజరు పరచనున్నారు. వీరిలో సందీప్, జిలానీ, మహేంద్రకు ఒక్కొక్కరిపై సుమారు 12 కేసులు, రౌడీషీట్‌లు ఉన్నట్లు ఏఎస్పీ తెలిపారు. కేసునే ఛేదించేందుకు కృషి చేసిన డీఎస్పీలు జగదీష్‌నాయక్, మురళీకృష్ణ, సీఐలు సోమశేఖర్, శ్రీనివాసరావు, సత్యనారాయణ, ఇంకొల్లు, అద్దంకి, బాపట్ల టౌన్, ఎస్‌బీ, సీసీఎస్ టీంను ఎస్పీ తుషార్ డూడీ అభినందించినట్లు ఏఎస్పీ తెలిపారు.

ఇలా ఉంటే నీరు పారేదెలా?


ముడివేముల మేజరు నిండా అడ్డుగా పెరిగిన చిల్లకంప

- సాగర్ మేజర్, మైనర్ కాలువల్లో పెరిగిన చిల్లచెట్లు
- ప్రాజెక్టుల్లో నీరున్నా పొలాలకు చేరడంపై సందేహం

త్రిపురాంతకం, ఆగస్టు 12: అన్నదాతలు సక్రమంగా తమ పొలాల్లో పంటలు పండించాలంటే వర్షాలు రావాలి. జలాశయాలు నిండాలి. ఆ నీరు కాలువల ద్వారా పొలాలకు చేరాలి. అయితే జలాశయాల్లో నీ రున్నా అధికారులు పొలాలకు నీరు వదిలితే మాత్రం ఆ నీరు పొలాలకు చేరే అవకాశం కనిపించడంలేదు. పొలాలకు సాగునీరు అందించే మేజర్లు, మైనర్లలో పిచ్చికంప విపరీతంగా పెరిగి అడవులను తలపిస్తు న్నాయి. దీంతో త్రిపురాంతకం ఎన్ఎస్‌పీ సబ్‌డివిజ న్‌లో 12 మేజర్లు, 60 మైనర్లు ఉండగా వీటి నిర్వహణకు 35 మంది వరకు లస్కర్లు, ఏడుగురు వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉండాల్సి ఉండగా కేవలం నలుగురు లస్కర్లు, ఇద్దరు వర్క్‌ఇ న్‌స్పెక్టర్లు మాత్రమే పని చేస్తున్నారు. దీంతో కాలువ లలో పిచ్చికంపను తొలగించే నాథుడే కరువయ్యాడు. సిబ్బంది సరిపోక పోవడంతో కార్యాలయ సిబ్బందిని, మహిళా మజ్దూర్‌లను కూడా కాలువలపై విధుల్లో ఉపయోగిస్తున్నారు. అయినప్పటికీ, కంపను తొలగించే పరిస్థితి లేదు. దీంతో సాగర్ జలాలు పొలాలకు ఎంతవరకు వస్తాయోనని రైతులు ఆందోళన చెందు తున్నారు. ఎగువ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు పడడంతో శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాలు నీటితో కళకళలాడుతు న్నాయి. దీంతో పంటలు సాగుచేస్తున్న రైతులు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకొని నార్లు పోసుకుంటు న్నారు. కానీ సాగర్ జలాలు వచ్చేం దుకు కాలువల్లో పిచ్చికంప తొలగించాల్సి ఉంది. కంపను తొల గించకపోవడం, పలు ప్రాంతాల్లో మేజర్లకు గండ్లు పడడంతో నీరు కిందికి వస్తుందో?, రాదో? అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి కైన ఎన్నెస్పీ అధికారులు మేజర్లు, మైనర్లపై దృష్టి సా రించి గండ్లకు మరమ్మతులు చేయించాలని, పిచ్చికం పను తొలగించాలని రైతులు కోరుతున్నారు.


మైనరు కాలువలో పెరిగిన చిల్లచెట్లు

ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే

గిద్దలూరు టౌన్, ఆగస్టు 12 : జిల్లాకు నూతన ఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎ.ఆర్.దామోదర్‌ను గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలి శారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయం నందు ముత్తుము ల అశోక్‌రెడ్డి ఎస్పీ దామోద ర్‌ను కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో శాంతిభద్రతలు, ట్రాఫిక్ అంశాల గురించి చర్చించారు.


ఎస్పీకి బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే

ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీ

- ఇరువురికి గాయాలు

గిద్దలూరు, ఆగస్టు 12 : గిద్దలూరు- బేస్తవారాపేట రోడ్డులోని గుమ్మళ్లపల్లి సమీపంలో ఎదురెదురుగా వస్తున్నజీపు, మినిట్రాలీ ఆటో వాహనం ఎదురెదరుగా ఢీ కొన్నాయి. దీంతో రెండు వాహనాల డ్రైవర్లు గాయపడ్డారు. 108 సిబ్బంది వారిని గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు చేయించారు.

దేవాలయంలో చోరీ

గిద్దలూరు, ఆగస్టు 12 : రాచర్లలోని అక్కదేవతల దేవస్థానంలో చోరీ జరిగింది. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత దొంగలు దేవాలయం తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. అందులోని టేపిరికార్డర్, సెల్‌ఫోన్, బియ్యం బస్తాను చోరీ చేశారు. సోమవారం ఉదయం దొంగతనాన్ని గుర్తించిన దేవస్థాన కమిటీ ప్రతినిధులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మూఢనమ్మకాలను విడనాడాలి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 12: ప్రజలు శాస్త్రీయ విజ్ఞానం పెంచు కుని మూడ నమ్మకాలు విడనాడాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ఆరోగ్య కన్వీనర్ డాక్టర్ శరత్ అన్నారు. స్థానిక శ్రీ విద్యా కోచింగ్ సెంటర్‌లో జన విజ్ఞాన వేదిక పట్టణ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ.. ఈ నెల 18న జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభలు మార్కాపురంలో జరుగుతాయని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, శ్రీధర్, సుధాకర్, శేఖర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పదిమంది జూదరుల అరెస్ట్

- రూ.55,800లు నగదు స్వాధీనం

పొదిలి, ఆగస్టు 12 : నగరపంచాయతీ పరిధిలోని రాజుపాలెం గ్రామంలో పేకాట ఆడుతున్న పదిమందిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులకు అందిన పక్కా సమాచారం ఆధారంగా పొలాల్లో దాడులు నిర్వహించి పదిమందిని అరెస్ట్ చేసి వారివద్ద నుంచి రూ.55,800ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీ

తర్లుపాడు, ఆగస్టు 12: తర్లుపాడులోని పలు అంగన్వాడీ కేంద్రాలను జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.వెంకట్రావ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. చిన్నారుల హాజరుపట్టీ, గర్భిణులు, బాలింతల రిజిష్టర్‌లు పరిశీలించారు. పౌష్టికాహారం, బాలామృతం సక్రమంగా అందుతుందా? లేదా? అని ఆరా తీశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆయాలకు పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ ప్రీ స్కూల్‌లలో కల్చరల్ యాక్టివిటీస్ ప్రతిరోజు నిర్వహించాలని సూచించారు. సమయపాలన పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు గాలి శివ, లలితా, పద్మావతి, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

బేస్తవారపేట, ఆగస్టు 12: బేస్తవారపేటలోని ఓ రైస్ మిల్లులో నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారు లు సోమవారం ఉదయం స్వాధీనం చేసుకున్నారు. అధికారులకు అందిన సమాచారం ప్రకారం దాడి చేసి 253 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కృష్ణమోహన్ తెలిపారు. ఆ బియ్యాన్ని కంభం గోడౌన్‌కు తరలించి మిల్లు నిర్వహకునిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


బేస్తవారపేటలో పట్టుబడిన బియ్యం

పాఠశాలను సందర్శించిన న్యాయాధికారి

పొదిలి, ఆగస్టు 12 : నగర పంచాయతీ పరిధిలోని కస్తూరిబా పాఠశాలను జూనియర్ సివిల్ న్యాయాధికారి విప్రత్యూష సోమ వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో వసతులను పరిశీలిం చారు. అనంతరం ఆమె విద్యార్థుల తో మాట్లాడుతూ పాఠశాలలో ఎమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకు న్నారు. రోజు వారి మెనూ ఎలా ఇస్తున్నారని విద్యార్థులను అడిగారు. హాస్టల్‌లో అన్ని వసతులు ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు శ్రద్ధతో మంచి చదువులు చదవాలని వారికి సూచించారు. ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చిపెట్టాలన్నారు. ఆమె వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షులు రమణకిషోర్, న్యాయవాది ఎస్ఎం బాష న్యాయవాదులు పాల్గొన్నారు.


పాఠశాలను పరిశీలిస్తున్న న్యాయాధికారి

తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

- సీఐటీయూ ఆధ్వర్యం కమిషనర్ కార్యాలయం ఎదురు ధర్నా

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 12: స్థానిక మున్సిపాలిటీలో ఇంజనీరింగ్ విభాగంలో 20 సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్న కొందరు కార్మికులను అక్రమంగా తొలగించడాన్ని ఖండిస్తూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కమిషనర్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ ఎటువంటి కారణం లేకుండా కార్మికులను కమిషనర్ విధులకు రావద్దు, మస్టర్ వేయమని చెప్పడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా ఏకపక్షంగా కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికులంతా ఐక్యంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి డి.సోమయ్య, యూనియన్ అధ్యక్షులు కె.సుబ్బరాయుడు, జి.హరి, రమణ, పి.శ్రీను, శేషిరెడ్డి, నాసరయ్య పాల్గొన్నారు.

ఏబీఎం ఆస్తుల్లో అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలి

మార్కాపురం బాప్టిస్టు ఫీల్డ్ అసోసియేషన్ నాయకుల డిమాండ్

మార్కాపురం, ఆగస్టు 12: పట్టణంలోని ఏబీఎం ఆస్తుల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణా లను వెంటనే నిలిపివేయాలని మార్కాపురం బాప్టిస్టు ఫీల్డ్ అసోసియేషన్ నాయకులు సోమ వారం మున్సిపల్ కమిషనర్ ఈ.కిరణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంబీఎఫ్ ఏ ప్రెసిడెంట్ జె.దేవానందం మాట్లాడుతూ అమెరికన్ బాప్టిస్టు మిషన్ ద్వారా స్వాతంత్ర్యాని కి పూర్వమే 1943లో మార్కాపురం బ్యాక్ చెస్ట్ ఫీల్డ్ అసోసియేషన్‌కు విద్యాభివృద్ధి నిమిత్తం ఏబీఎం హైస్కూల్‌తో కలిపి 39.99 ఎకరాలను అగ్రిమెంటు ద్వారా అప్పగించినట్లు తెలిపారు. కొన్ని దశాబ్దాలపాటు ఏబీఎం హైస్కూల్ యాజమాన్యం ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపా రు. ఈ నేపథ్యంలో టి.స్టీఫెన్ ప్రభాకర్‌పాల్ అక్రమంగా ఎన్.నాగవేణికి రిజిస్ట్రేషన్ చేశాడ న్నారు. ఏబీఎం, ఎంబీఎఫ్ఏ సంస్థలు మతపరమైన ఛారిటబు ల్ ట్రస్ట్‌లు అయినందున క్రయవిక్రయాలు చేసేందు కు అధికారం లేదన్నారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌లు చెల్లవని కోర్టు తీర్పు చెప్పిందన్నారు. అయినా ఏబీఎం ఆస్తుల్లో అక్రమ నిర్మాణాలు జరిగాయన్నారు. ఈ విషయమై 2019లో ఏపీ హైకోర్టులో కేసు వేయగా ఎనిమిది వారాల్లోగా అక్రమ నిర్మాణాలను తొలగించాలని 2023 ఫిబ్రవరిలో న్యాయస్థానం మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించిందన్నారు. అప్పటి నుంచి తాము మున్సిపల్, సబ్‌కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు. ఇప్పటికి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణాలకు అనుమతులిస్తున్నారని ఆరోపించారు. కోర్టు ఆదేశాల మేరకు త్వరగా అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఉప్పలపాటి చిన్నకాశయ్య, కరస్పాం డింగ్ సెక్రటరీ అబ్రహం డ్యానియేల్, ట్రెజరర్ జెడ్డా పీటర్, సీనియర్ పాస్టర్లు పులుకూరి ఆంద్రూస్, డాక్టర్ ఎస్.విజయభాస్కరరావు, పసుమర్తి శామ్యూల్, సంద్రపాటి జాన్ తదితరులు ఉన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంబీఎఫ్ఏ ప్రతినిధులు

ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

గిద్దలూరు టౌన్, ఆగస్టు 12 : ప్రజాసమస్య లను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించ డమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ సీనియర్ నాయకుడు కృష్ణకిశోర్‌రెడ్డి అన్నారు. సోమవారం కొంగలవీడు రోడ్డులోని పూసల బజారులో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం మంచినీటి బోరును మంజూరు చేసింది. ఈ బోరు తవ్వకం పనులను కృష్ణకిశోర్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత కల్పిస్తున్నా రన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, కౌన్సిలర్ బిల్లా జయలక్ష్మి, పట్టణపార్టీ అధ్యక్షులు షానేషావలి, టీడీపీ నాయకులు బిల్లా రమేష్, వేములపాడు చంటి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.


బోరు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కృష్ణకిశోర్‌రెడ్డి

ఘనంగా ఎస్ఆర్ రంగనాథన్ జయంతి వేడుకలు

పెద్దదోర్నాల, 12: స్థానిక గ్రంథాల యంలో డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథ పాలకుడు సుబ్బారెడ్డి అధ్యక్షతన వెల్ఫేర్ అసిస్టెంటు లక్ష్మీనాయక్ రంగనాథన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించా రు. అనంతరం గ్రంథాలయాలు అభివృద్ధి చెందేందుకు రంగనాథన్ చేసిన కృషిని గుర్తు చేశారు. ఈ కారణంగానే రంగనాథన్ జన్మదినం రోజున లైబ్రేరియన్‌డేగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రంగనాథన్ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న విద్యార్థులు

రంగనాథన్ జయంతి

గిద్దలూరు : గ్రంథాలయ పితామహుడు ఎస్.ఆర్.రంగనాథన్ జయంతి ఉత్సవాన్ని స్థానిక శాఖాగ్రంథాలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జాతీయ జెండాలతో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథపాలకు రాలు ప్రసన్నకుమారి, పాఠకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు ఉపయోగించుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్ : విద్యార్థులు గ్రంథాలయాలు ఉపయోగించుకోవాలని యూటీ ఎఫ్ జిల్లా అధ్యక్షులు వొద్దుల వీరారెడ్డి అన్నారు. స్థానికశాఖ గ్రంథాలయంలో డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతి పురస్కరించుకుని గ్రంథ పాలకుల దినోత్సవం సోమవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా రంగనాథం చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం 'హర్ ఘర్ తిరంగా' వేడుకల్లో భాగంగా జాతీయ జెండాల ప్రదర్శన నిర్వహించారు. పాఠ్యపుస్తకాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజన దంపతులకు అరుదైన గౌరవం

ఢిల్లీలో స్వాతంత్ర్యదిన వేడుకల్లో పాల్గొనేందుకు అవకాశం

ఎర్రగొండపాలెం, ఆగస్టు 12 : ఆగస్టు 15న ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు మండలంలోని పాలుట్ల గిరిజన గూడెంనకు చెందిన నిమ్మల ఈదన్న భార్య పోలమ్మ దంపతులకు ప్రధానమంత్రి కార్యా లయం నుంచి పిలుపు వచ్చింది. దీంతో వారు సోమవారం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు, ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలంలో గిరిజన గూడెంలు ఎక్కువగా ఉన్నాయి. గిరిజనులు జీవ నవిధానం తెలుసుకునేందుకు గిరిజన కుటుం బాన్ని పంపించాలని జిల్లా కలెక్టరు కార్యా లయానికి సమాచారం వచ్చింది. దీంతో జిల్లా కలె క్టరు ఆదేశాల మేరకు పాలుట్ల గూడెంనకు చెందిన నిమ్మల ఈదన్న, భార్య పోలమ్మను స్థానిక అధికారులు ఎంపిక చేసి పంపారు. నిమ్మల ఈదన్న పాలుట్ల గిరిజనగూడెం వీటీడీఏ అధ్యక్షులుగా పని చేస్తూ, గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి చేసిన అను భవం ఉంది. నల్లమల అడవు ల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న జీవన సమస్యలపై ఈదన్న దంపతులకు అవగాహన ఉండడంతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు వారిని ఎంపిక చేసి పంపించారు. టీడీపీ రాష్ట్ర ఎస్టీసెల్ కార్య నిర్వాహక కార్యదర్శి చెవులు అంజయ్య, వెంకటా ద్రిపాలెం సర్పంచి బోడా శ్రీశైలపతినాయుడు, గిరిజన నాయకులు అభినందనలు తెలిపి ఢిల్లీకి పంపించారు.


ఈదన్న దంపతులను అభినందిస్తున్న స్థానికులు

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి

సర్పంచులు, కార్యదర్శులతో ఎంపీడీవో చందన

మార్కాపురం రూరల్, ఆగస్టు 12: గ్రామా లలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమా లు అధికారులు, ప్రజాప్రతినిధులు, సమ న్వయంతో చేసుకోవాలని ఎంపీడీవో చందన సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యా లయంలోని సమావేశపు హాలులో మండలం లోని ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్య దర్శులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణపై మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించ నున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచయతీలలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రామ్మోహన్‌రెడ్డి, సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో చందన

పెద్దదోర్నాల : గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణ తరగతులు ఉపకరిస్తాయని ఎంపీడీవో నాసర్ రెడ్డి పేర్కొన్నారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తోన్న పథకాలు, మంజూరు చేసిన నిధులు గ్రామాల సమగ్రాభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రాతి శాసనాల గుర్తింపు

పొదిలి, ఆగస్టు 12 : నల్లమల అటవీ ప్రాంతంలో ప్రాచీన కాలానికి చెందిన మూడు రాతిశాసనాలను గుర్తించినట్లు పొదిలి ప్రాంతానికి చెందిన పురావస్తు పరిశోధన విద్యార్థి వడ్డే మాదవ్ తెలిపారు. కొన్ని రోజులు గా క్షుణ్ణంగా పరిశీలించి మూడు శాసనాలను గుర్తించినట్లు మాధవ్ తెలిపారు. వాటిని ఎస్టాంపేజ్ తీసి ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియాకు పంపనున్నట్లు చెప్పారు. గుర్తిం చిన మూడింటిలో ఒకటి మాత్రం పురావస్తు శాఖ వారికి తెలుసని మిగిలిన రెండు రికార్డుల్లో నమోదు కాలేదన్నారు. రెండింటిలో ఒకటి 19వ శతాబ్దానికి చెందినది కాగా, రెండవది 15వ శతాబ్దంలో దేవరాయ-2 పాలనకు చెందినదనిగా గుర్తించామన్నా రు. 2వ దేవరాయలు ఉదయగిరి రాజ్య పర్యటనకు వచ్చిన సమయంలో పూజలు, ఉత్సవాలు, శిబిరాలకు నైవేద్యాలు నిర్వహణకు రాజు శ్రీపర్వత మల్లికార్జున దేవునికి సర్వమాన్యంగా పుటలువడి గ్రామానికి (ప్రస్తుత పాలుట్ల గ్రామం), 800ల వరహాలు బంగారు నాణేలు ఇస్తున్నట్లు ఆశాసనంలో రాసి ఉందన్నారు. ఈ శాసనం ఆధారంగా 2వ దేవరాయ పరిపాలన కాలంలో పాలుట్ల గ్రామానికి పర్యటనకు వచ్చినట్లు తెలుస్తోంద న్నారు. ఈ శాసనంలోని అక్షరాల అనువా దానికి ఏపీ గ్రాపిస్ట్ డాక్టర్ ఎం.ఏసుబాబు, రీసెర్చ్ సూపర్‌వైజర్ ప్రొఫెసర్ ఎస్.మురళీమోహన్ దీన్ని అధ్యాయనం చేయడానికి సహకరించారన్నారు.


నల్లమలలో కనుగొన్న రాతి శాసనం ఇదే

అవీ..ఇవీ..

కరాటే పోటీల్లో పొదిలి విద్యార్థుల ప్రతిభ

పొదిలి, ఆగస్టు 12 : విజయవాడలో ఆది వారం జాతీయ స్థాయి లో నిర్వహించిన కుంఫూ కరాటే పోటీల్లో పొదిలి విద్యార్థులు ప్రతిభ చూపారు. స్థాని క నిర్మలా కాన్వెంట్ ఇంగ్లీస్ మీడియం స్కూల్‌కు చెందిన 8, 9వ తరగతి విద్యార్థు లైన లక్కీషాలోమ్, రాజేష్‌లు స్పారింగ్‌లో బంగారు పతకం సాధించారు. వీరిని ఆదర్శవంతంగా తీసుకొని విద్యార్థులు తమకు ఇష్టమైన ఆట, పాటలను ఎంచుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ రూబీ అన్నారు. అనంతరం ఇద్దరు విద్యార్థులకు అభినందించారు. అదేవిధంగా విజయవాడలో జరిగిన వివిధ రకాల కరాటే పోటీల్లో బంగారు, రజత పతకాలు సాధించారు. స్పారింగ్ విభాగంలో చిట్టెం షాలూమ్, జోయల్ జశ్వంత్, కట్టాస్‌లో హన్విక, శ్రీవాత్సల్య, వశిష్ఠ, సీహెచ్ షాలూమ్, వాజితారెడ్డి, షేక్ షాజియా, అబ్దుల్ షహీద్, రాకేష్, మధువిశ్వనాథ్, శశివర్ధన్, చైత్రలు బంగారు పతకాలు సాధించారు.


కరాటేలో గోల్డ్‌మెడల్ సాధించిన లక్కీషాలోమ్, రాజేష్‌లు

ఆశాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 12: ప్రభుత్వం తమను ఉద్యోగులుగా గుర్తించాలని ఆశా కార్యకర్తలు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం అందించారు. ఆశాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని రూ.26వేలు కనీస వేతనం ఇవ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆశాలకు వర్తింపజేసి ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ఆశా కార్యకర్తలు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు ఆహ్వానం

పెద్ద దోర్నాల, ఆగస్టు 12.స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల నియామకానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్.సావిత్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో కామర్స్, బోటనీ, కంప్యూటర్ సైన్స్ బోధించడానికి సంబంధిత విభాగాలలో 55శాతం మార్కులు కలిగి, ఎన్ఈటీ/ఎస్ఈటీ లేదా పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆంగ్లంలో మాత్రమే బోధించాల్సి ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 17వ తేదీ లోపు దరఖాస్తులు కళాశాలలో అందజేయాలన్నారు. ఈ నెల 21వ తేదీన ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ చెప్పారు. పూర్తి సమాచారం కోసం 6303794980 నంబరును సంప్రదించాలని కోరారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తు

గిద్దలూరు, ఆగస్టు 12 : రాచర్ల ఫారం సమీపంలోని డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లుగా ప్రిన్సిపాల్ టి.మేరీకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశించే ఎస్సీ విద్యార్థినులు మాత్రమే ఈ నెల 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఎస్సీ విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ట్యాబ్ ఆధారిత పరీక్షల పరిశీలన

కంభం, ఆగస్టు 12 : స్థానిక బాలికల గురు కుల పాఠశాలలో సోమ వారం నిర్వహించిన సీబీఎస్ఈ ట్యాబ్ ఆధా రిత బేస్‌లైన్ పరీక్షలను ఎఈవో మాల్యాద్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్యాబ్ ఆధారిత అసిస్‌మెంట్ విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలకు బాసటగా ఉంటుందన్నారు. ఉన్నతవిద్యకు ఉపయుక్తమన్నారు. 10వ తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే అసెస్‌మెంట్ ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చాముండేశ్వరి, సీఆర్‌పీ రవీంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.


పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈవో

చదరంగంలో చిన్నారుల ప్రతిభ

పొదిలి, ఆగస్టు 12 : పల్నాడు జిల్లా నరసారావుపేట సమీపంలోని కేసానిపల్లి గ్రామం ఎంఎం కళాశాలలో స్టేట్ లెవెల్ చదరంగ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో పొదిలి పట్టణానికి చెందిన జవ్వాజి విష్ణుగుప్తా, జవ్వాజి పాణ్యశ్రీవల్లి 2, 5 స్థానాల్లో నిలిచారు. మొత్తం 317 మంది పాల్గొన్న ఈ పోటీల్లో ఇద్దరు చిన్నారులు ఈ స్థానాలను సాధించడం అభినందనీయని పలువురు పట్టణవాసులు పేర్కొన్నారు. ఇంకామరిన్ని పోటీల్లో పాల్గొని ఈ చిన్నారులు పొదిలికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.


చదరంగంలో 2, 5 స్థానాల్లో నిలిచిన చిన్నారులు

ఈ-పంట నమోదు తప్పనిసరి : ఏవో


పంట నమోదును పరిశీలిస్తున్న ఏవో బుజ్జిబాయ్

పెద్దారవీడు, ఆగస్టు 12: రైతులు ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలను తప్పనిసరిగా నమోదు చేయించు కోవాలని ఏవో బుజ్జిబాయ్ అన్నారు. మండలం లోని పుచ్చకాయలపల్లి రైతుభరోసాకేంద్రాన్ని సోమవారం సందర్శించారు. అనంతరం పంటనమోదు కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటనమోదు ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందన్నారు. పంటనమోదు వలన పంటలబీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, సబ్సిడీకి ఎరువులు అందజేస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు లాలూనాయక్, రైతులు పాల్గొన్నారు.

రాజశేఖర్ సేవలకు గుర్తింపు


రాజశేఖర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు, ఆగస్టు 12 : గిద్దలూరులోని సంజీవిని అనాథా శ్రమం నిర్వాహ కులు ఓబులాపురం రాజశేఖర్ సేవలకు గుర్తింపు దక్కింది. ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న రాజశేఖర్ సంజీవిని అనాథ వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో వృద్ధులను అక్కున చేర్చుకుని వారికి నిత్యం అన్నంపెడుతూ వారి పోషణ చూస్తున్నాడు. రాజశేఖర్‌ను పాండిచ్చేరికి చెందిన ఫేస్ యూనివర్సిటీ ఘనంగా సన్మానించి గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది.



వేములలో ఎండిపోతున్న నారు మడికి ట్యాంకర్‌తో నీరు పెడుతున్న రైతు

ఎండిపోతున్న నారుమళ్లు

» ట్యాంకర్ల ద్వారా నీరు పెట్టుకుంటున్న రైతులు

ముండ్లమూరు, ఆగస్టు 12: మండలంలోని సాగర్ ఆయకట్టు పరిధిలోని రజానగరం, మోదేపల్లి మేజర్ల పరిధిలో నారుమళ్లు పోసిన రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. ఈ ఏడాది ఎగువ ప్రాంతమైన కర్నాటక రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు పడి శ్రీశైలం, నాగార్జున సాగర్ డ్యామ్‌లు పూర్తిగా నిండిపోయాయి. దీంతో రైతులు నీరు వస్తుందనే ఆశతో నారుమళ్లు పోశారు. గత వారం రోజుల నుంచి ఆయకట్టు పరిధిలోని వ్యవసాయ బోర్ల కింద నార్లు పోశారు. సరైన వర్షాలు లేకపోవటంతో భూగర్భ జలాలు అడుగంటి పోవటంతో ఒక్కసారిగా బోర్లు మొరాయించాయి. దీంతో రైతులు ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో నారు మడులు కాపాడుకొనేందుకు ఇళ్ళ దగ్గర ట్యాంకర్ల ద్వారా నారు మడులు తడుపుకొనే పరిస్థితి ఏర్పడింది. మండంలోని వేముల, కమ్మవారిపాలెం, చింతలపూడి, పసుపుగల్లు, పెద ఉల్లగల్లు, రెడ్డి నగర్, శ్రీనివాస నగర్, జగత్‌నగర్, నందమూరినగర్ గ్రామాల్లో ఈ దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా సాగర్ జలాలు విడుదల చేసి ఆదుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

'సర్దుబాటు'ను వాయిదా వేయాలి



సీఎస్‌పురంలో ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 12: జీవో నెంబర్.117ను రద్దు చేసి పని సర్దుబాటు చర్యలు చేపట్టాలని ఫ్యాప్టో నాయకులు కోరారు. అప్పటివరకు ఈ ప్రక్రియను వాయిదా వేయాలన్నారు. ఈమేరకు సోమవారం ఎంఈవో -2 రాజాల కొండారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉన్న జీవో 53 ప్రకారం సర్దుబాటు చేయాలన్నారు. సర్దుబాటు పక్రియను మ్యానువల్‌గా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు షేక్ నాయబ్‌రసూల్, జె.వెంకటరావు, టి.శ్రీనివాసులు, షేక్ పాదు షా, పి.మాలకొండయ్య, ఎస్.వెంకటరామయ్య, జి.రామకృష్ణ, ఎస్.తిరుపతయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలి

కురిచేడు, ఆగస్టు 12: పని సర్దుబాటు కౌన్సెలింగ్‌లో ఉపాధ్యాయ సంఘాల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని సోమవారం ఎంఈవోలు వస్రాంనాయక్, సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నేత ఖాజా రహంతుల్లా మాట్లాడుతూ పని సర్దుబాటు ప్రక్రియలో ఉపాధ్యాయ సంఘాల సూచనలను పరిగణలోకి తీసుకోకుండా కౌన్సెలింగ్ చేయడం ఏంటని ప్రశ్నించారు. 2020లో విడుదలచేసిన జీవో ప్రకారం కౌన్సెలింగ్ చేయాలని కోరారు. పని సర్దుబాటు మండల, డివిజన్ స్థాయికే పరిమితం చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు శ్రీనివాస రెడ్డి, ఖాదర్ వలి, శ్రీనివాసరావు, టి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

నీటితో కళకళలాడుతున్న భైరవకోన జలపాతం

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 12: సీఎస్‌పురం మండలంలోని భైరవకోన జలపాతం నీటి ఉధృతితో సోమవారం కళకళలాడుతుంది. సాయంత్రం కురిసిన వర్షానికి జలపాతంలోకి నీళ్ళు పుష్కలంగా చేరాయి. కొండ కోనల నడుమ నుంచి జాలువారుతున్న నీటిలో స్నానాలు ఆచరిస్తే సకల పాపాలు హరిస్తాయనేది భక్తుల విశ్వాసం. జలపాతం అందాలు తిలకించేందుకు పర్యాటకులు మంగళవారం నుంచి వచ్చే అవకాశం ఉన్నందున జలపాతం వద్ద ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. కాగా, పామూరు, సీఎస్‌పురం మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది.



కనువిందు చేస్తున్న జలపాతం


దేశ సమైక్యతను చాటాలి



సీఎస్‌పురంలో జాతీయ జెండాలతో ర్యాలీ చేస్తున్న బీజేపీ శ్రేణులు

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 12: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య పిలుపునిచ్చారు. సీఎస్‌పురంలో సోమవారం పాఠశాల విద్యార్థులతో కలిసి జాతీయ జండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశ సమైక్యతను చాటాలని సూచించారు. మండలంలోని ప్రతి పాఠశాలలో స్వాతంత్ర్య వేడుకలను జరపాలని ఎంఈవో రాజాల కొండారెడ్డి కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.శ్రీనివాసులు, ఆర్.సుబ్బరాయుడు, టి.రమేష్, శోభారాణి, పి.మాలకొండయ్య, ఎస్వీ రామిరెడ్డి, భువనేశ్వరం, సురేష్, సతీష్, ఉపసర్పంచ్‌లు పాములపాటి నరసయ్య, తినకం బాబురావు, ఆర్.నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు

కనిగిరి, ఆగస్టు 12: విద్యారంగాన్ని ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకుడు యాసిన్, ఎస్టీయూ మాజీ నాయకుడు బ్యంగి సుబ్రమణ్యం అన్నారు. ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా సోమవారం స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్ వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నేటి పాలకులు ప్రయివేట్ వైపు విద్యావ్యవస్థను మరల్చుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో రేషనలైజేషన్ పేరుతో అనేక పాఠశాలలను మూసివేసి గ్రామస్థాయిలో పేద వారికి విద్యను దూరం చేస్తున్నారన్నారు. విద్యారంగంలో సమూల మార్పుల కోసం ఏఐఎస్ఎఫ్ ఎనలేని కృషి చేసిందన్నారు. దేశంలోని అన్ని వర్గాలకు విద్యను అందించాలని పోరాటాలు చేసింది ఏఐఎస్ఎఫ్ ఒక్కటేనని చెప్పారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పవన్‌కల్యాణ్, పి.మోహన్, రైతు సంఘం నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, ఇఫ్రాన్, సరేష్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికుల భద్రతే ఆర్‌పీఎఫ్ లక్ష్యం

» గుంటూరు డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ సత్యహరప్రసాద్



మాట్లాడుతున్న సత్యహరప్రసాద్

దొనకొండ, ఆగస్టు 12: రైల్వే ఆస్తులను సంరక్షించడంతో పాటు ప్రయాణికులకు భద్రత కల్పించడమే రైల్వే రక్షక దళం(ఆర్‌పీఎఫ్) ప్రధాన లక్ష్యమని గుంటూరు రైల్వే డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ సత్యహరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక రైల్వే రక్షక దళం కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవలకాలంలో గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని నడికుడి వద్ద చెన్నై ఎక్స్‌ప్రెస్, నర్సాపూర్ వద్ద నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో దుండగులు దాడులు చేశారన్నారు. ఇటువంటి దాడుల్లో రైలు ప్రయాణికుల ధన, మాన ప్రాణ రక్షణ కల్పించటమే ఆర్పీఎఫ్ ప్రధాన లక్ష్యమన్నారు. అందులోభాగంగా స్థానిక ఆర్పీఎఫ్ సిబ్బందికి దిశానిర్దేశంతో పాటు అవగాహన కల్పించటం జరిగిందన్నారు. రైలు బోగీల్లో ఆర్పీఎఫ్ నిర్వహించే ఎస్కార్ట్ విధుల్లో అప్ర మత్తంగా వ్యవహరిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించా మన్నారు.

స్థానిక రైల్వే రక్షక దళం కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. 139 యాప్ ద్వారా ప్రయాణికులు వారి కి సంబంధించిన సమస్యను ఫిర్యాదు చేస్తే తక్షణమే సమీపంలోని ఆర్పీ ఎఫ్ స్వయంగా వెళ్లి పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై ఎం.ఎల్లయ్య, ఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఆగస్టు 12: ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో జరుగుతున్న పనులను సోమవారం పరిశీలించారు. ఆసుపత్రిలో సరిగ్గా గాలి లేకపోవటం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం విద్యుత్ పరికరాల ద్వారా వచ్చే గాలి రోగులకు అంత శ్రేయస్కరం కాదన్నారు. ప్రకృతి గాలి ఎంతో ఆరోగ్యకరమైనదన్నారు. ఆదిశగా గదులను మార్పులు చేయాలని సూచించారు. ప్రసూతిగది, శిశుసంరక్షణ గది, ఇన్‌పేషెంట్ గదులను భవనంలోని గాలి వచ్చే దిశగా ఉన్న గదుల్లోకి మార్పులు చేయాలని సూచించారు. ఓపీ విభాగంలో తప్పనిసరిగా రిజిస్టర్ ఉండాలన్నారు. ప్రతిరోజూ వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు అవసరమయ్యే మందులను అప్పటికప్పుడే అందించాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో ఉన్న వసతులను అనుకూలంగా మార్చుకుని ఆదిశగా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. మహిళా వైద్య సిబ్బందికి విశ్రాంతి, దుస్తులు మార్పునకు అనువైన గదిని ఏర్పాటుచేయాలన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి కేసును ఒంగోలు పంపించే ఆలోచన మానుకోవాలన్నారు. వీలైనంతవరకు డ్యూటీ డాక్టర్ అందుబాటులో ఉండి పూర్తిస్థాయి వైద్యం అందించాలన్నారు. ఆసుపత్రికి అవసరమైన సామగ్రి, సిబ్బంది, వైద్యుల వివరాల నివేదికను అందజేయాలన్నారు. సీఎం చంద్రబాబు దృష్టికి, మంత్రుల దృష్టికి తీసుకువెళ్ళి ఖాళీగా ఉన్న స్థానాల్లో వైద్యులను నియమించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అబ్దుల్‌కలాం, వైద్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దర్శి అభివృద్ధికి పూర్తి సహకారం

» విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ

» మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



లోకేష్‌కు బొకే అందజేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, ఆగస్టు 12: దర్శి నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి సహకారం అంది స్తామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ భరోసా ఇచ్చారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త డాక్టర్ లలిత్‌సాగర్, మామయ్య డాక్టర్ కడియాల వెంకటేశ్వర్లు, చిన్న మామయ్య కడియాల రమేష్‌తో కలిసి సోమవారం లోకేష్‌ను కలిశారు. ఈసందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ఓటమితో అధైర్యపడొద్దని, అభివృద్ధి చేసి చూపించి ప్రజలను మెప్పించాలని సూచించినట్లు వారు తెలిపారు. ఎక్కడైతే ఓటమి చవిచూశామో ప్రజల మన్ననలతో అక్కడే విజయం సాధించి సత్తా చాటుకోవాలని పేర్కొన్నారు. ఈ విషయంలో తనను స్ఫూర్తిగా తీసుకోవాలని లోకేష్ చెప్పినట్లు వారు వివరించారు. మీ రాజకీయ భవిష్యత్తు చూసుకుంటానని, దర్శి అభివృద్ధిపై దృష్టి సారించాలని లోకేష్ చెప్పినట్లు వారు వివరించారు.

ఈసందర్భంగా నియోజకవర్గంలో సాగునీటి పథకాల అభివృద్ధికి, తాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కోరినట్లు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. దొనకొండలో పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి కృషి చేయాలని, దర్శి పట్టణాన్ని మోడల్ టౌన్‌గా అభివృద్ధికి అధిక నిధులు విడుదల చేయాలని కోరగా అందుకు సాను కూలంగా స్పందించినట్లు తెలిపారు. మహిళా నాయకురాలిగా దర్శిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని, ఆదేవిధంగా పనిచేస్తూ ముందుకు సాగాలని లోకేష్ సూచించినట్లు డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు.

మురుగు కాల్వల పూడ్చివేత

» నిర్మాణాల కోసం వైసీపీ నేత నిర్వాకం

» ముందుకు నీరు వెళ్లే మార్గంలేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మట్టితో పూడ్చివేసిన మురుగు కాల్వ

తాళ్లూరు, ఆగస్టు 11: మండలంలోని తూర్పుగంగవరం గ్రామపంచాయతీలో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన మురుగు కాల్వలను పూడ్చి వేస్తున్నారు. ప్రధానంగా చీమకుర్తి వెళ్లే మార్గంలో మట్టితో పూడ్చి చదునుచేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలో రోడ్లను విస్తరించి మురుగునీరు వెళ్లేందుకు కాల్వలు నిర్మించారు. వీటిని ఆనుకుని ఉన్న యజమానులు వాటిని ఆక్రమించి బంకులు, తోపుడు బండ్లు ఏర్పాటు చేశారు. కాల్వలపై ఉన్న బండ్లను తొలగించకపోవటంతో వైసీపీ నేత ఏకంగా మురుగుకాలువను పూడ్చి కట్టడాలు చేపట్టేందుకు యత్నిస్తున్నారు.

బొద్దికూరపాడు బస్టాండ్ నుంచి చీమకుర్తి వెళ్లే మార్గంలో మాజీ సర్పంచ్ గుజ్జుల వెంకటేశ్వరరెడ్డి సమాధి సమీపంలోగల మురుగు కాల్వను నామరూపాల్లేకుండా పూర్తిగా మట్టితో పూడ్చివేశారు. ఆప్రాంతంలో గల స్థలంలో నిర్మాణాలు చేపడుతున్న స్థలం యజమాని వైసీపీ నేత తమకు ఎవరు అడ్డుచెబుతారన్న ధీమాతో ఏకంగా మురుగు కాల్వను మట్టితో పూడ్చి వేశారని గ్రామస్థులు పేర్కొన్నారు. ఆర్అండ్‌బీ రోడ్డు వరకు మట్టితో చదును చేశారు. కాల్వను పూడ్చి వేయటంతో మురుగు నీరు ముందుకు వెళ్లే మార్గంలేక రోడ్డుపైకి చేరుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, గ్రామపంచాయతీ స్పందించి కాల్వను పూడ్చివేసిన వారిపై తగు చర్యలు గైకొని మురుగు నీరు సక్రమంగా ప్రవహించేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మత్తుకు బానిసైతే భవిష్యత్తు అంధకారమే!

పీసీపల్లి, ఆగస్టు 12: మత్తుకు బానిసైతే భవిష్యత్తు అంధకారమవుతుందని ఎస్సై రమేష్‌బాబు అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత జీవితాలకు పెనుముప్పుగా మారి భవిష్యత్తును నాశనంచేసే మత్తుకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయవద్దన్నారు. దురలవాట్లకు లోనుకాకుండా సక్రమమైన మార్గంలో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తుపదార్థాలు తీసుకోవడం ద్వారా మన ఆరోగ్యాన్ని మనమే పాడుచేసుకుంటామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయశంకర్‌రెడ్డితో పాటు అధ్యాపక బృందం, తదితరులు పాల్గొన్నారు.



పీసీపల్లిలో మాట్లాడుతున్న ఎస్ఐ రమేష్‌బాబు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

దొనకొండ, ఆగస్టు 12: గ్రామీణ ప్రాంతాల్లోని అధికసంఖ్యలో యువత ఇటీవల కాలంలో మాదకద్రవ్యాలకు బానిసలవుతున్నారని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.దునుముని అన్నారు. సోమవారం ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినాన్ని కళాశాలలో నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో యువత వ్యక్తిగత జీవితమే కాకుండా వారి కుటుంబం, సమాజం నష్టపోతుందన్నారు. మాదక ద్రవ్యాల వినియోగానికి యువత దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులతో మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతి జ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



తాళ్లూరులో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, పోలీసులు, అధ్యాపకులు

మాదక ద్రవ్యాలతో నష్టం

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 12: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ పి.ప్రేమ్‌కుమార్ అన్నారు. స్థానిక కేజీబీవీలో మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాల గురించి సోమవారం అవగాహన కల్పించారు. సోషల్ మీడియా పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ రేష్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నివారణకు కృషిచేయాలి

తాళ్లూరు, ఆగస్టు 12: మాదక ద్రవ్యాల నివారణకు సమిష్టిగా కృషి చేయాలని వీకే జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొండపల్లి ఆంజనేయులు, ఎస్సై కె.విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగంతో విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. ప్రతిఒక్కరూ మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటంచేయాలన్నారు. ఈసందర్భంగా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఈవోలు జి.సుబ్బయ్య, ఎల్.సుధాకర్ రావు, ఏఎస్ఐ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజావేదిక

ముండ్లమూరు, ఆగస్టు 12: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఉపాధి హామీ పథకం ప్రజావేదిక నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఆర్.జనార్దన్ తెలిపారు. 2023 - 24 సంవత్సరానికి సంబంధించి మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై గ్రామ సభ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

మండల స్థాయిలో జరిగే గ్రామ సభలో నివేదికలు సమర్పించనున్నట్టు తెలిపారు. సమావేశంలో పీడీ అర్జునరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరావు

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

» ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు

తాళ్లూరు, ఆగస్టు 12: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశం హాల్‌లో మూడు రోజులపాటు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల అభివృద్ధికి పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులను భాగస్వామం చేస్తే గ్రామపంచాయతీల అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందన్నారు. జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. పలుగ్రామాల్లో పారిశుధ్యం లోపించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఎంపీడీవో కేవై కీర్తి మాట్లాడుతూ అన్ని గ్రామాలకు ఒకేరకమైన పనుల అవసరం ఉండదన్నారు. ఒక్కో గ్రామానికి అవసరాలు వేర్వేరుగా ఉంటాయని చెప్పారు. వాటికనుగుణంగా నిధులు వెచ్చించి గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాతిపిత మహాత్మాగాంధి చిత్రపటాలకు ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీడీవో, ప్రజాప్రతినిధులు పూలమాల లు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ కేజేఎస్ రాజు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషిచేయాలి

ముండ్లమూరు, ఆగస్టు 12: గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీవో ఆర్.జనార్దన్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల పాటు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి గ్రామ పంచాయతీకి అవసరమైన మౌలిక వసతులు, అవసరాలను గుర్తించాలన్నారు. పంచాయతీలకు విడుదలవుతున్న నిధులను, ఖర్చుచేసే విధానాన్ని తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ముందుగా మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ మృతిపై కేసు నమోదు

కనిగిరి, ఆగస్టు 12: గ్రానైట్ క్వారీలో పనిచేస్తున్న లారీ డ్రైవర్ అట్లూరి రత్తయ్య (41) అనుమానాస్పద మృతిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ త్యాగరాజు తెలిపారు. పట్టణ సమీపంలోని గార్లపేట రోడ్డులోగల దస్తగిరి గ్రానైట్ క్వారీలో ఈ ప్రమాదం జరిగిందని ఆయన తెలిపారు. గ్రానైట్ రాయిని క్వారీ ర్యాంపు నుంచి లారీలోకి లోడ్‌చేసే క్రమంలో ప్రమాదం చోటుచేసుకుంది. బండరాయి ఒక్కసారిగా ఒరిగిపోయి లారీకి, క్వారీ ర్యాంప్‌నకు మధ్యలో లారీ డ్రైవర్ రత్తయ్యపై పడింది. ప్రమాదంలో రత్తయ్య తలకు బలమైన గాయంకాగా స్థానిక ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు అట్లూరి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. క్వారీ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి, అజాగ్రత్త కారణంగా తన తండ్రి మృతిచెందాడని రత్తయ్య కుమారుడు చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

పామూరు, ఆగస్టు 12: మండలంలోని నుచ్చుపొద గ్రామ శివారు ప్రాంతంలో పేకాట శిబిరంపై సోమవారం ఎస్ఐ ఎం.సైదుబాబు తన సిబ్బందితో దాడి చేశారు. ఈసందర్భంగా ఏడుగురిని అదుపులోకి తీసుకొని రూ.12,880 నగదు, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





గుంటూరులో డ్రగ్స్ కలకలం

- మస్తాన్ దర్గా ధర్మకర్త తనయుడు మస్తాన్ సాయి అరెస్టు
- ఇప్పటికే గుంటూరుకు చెందిన నలుగురు నిందితుల అరెస్టు
- నిందితుల్లో ఇద్దరు హోటల్ సుభాని తనయులు
- గతంలో అత్యాచారం, హత్యాయత్నం కేసులో సాయి నిందితుడు
- ఈ ముఠాలో కీలకంగా వైసీపీ నేత అన్న కుమారుడు
- గతంలో కేసుల నుంచి తప్పించుకున్న వైనం

గుంటూరు, ఆగస్టు 12 : గుంటూరు కేంద్రంగా డ్రగ్స్ కలకలం... వైసీపీ ప్రభుత్వ హయాంలో గుంటూరుకు చెందిన ఈ ముఠా అత్యంత కీలకంగా వ్యవహరించింది. గుంటూరుకు చెందిన కొందరు ఓ ముఠాగా ఏర్పడి పెద్ద ఎత్తున డ్రగ్స్‌ను గోవా, బెంగళూరు తదితర ఇతర ప్రాంతాల నుంచి తెప్పించి విక్రయించారు. ఈ ముఠాకు వైసీపీ మాజీ ప్రజా ప్రతినిధి అన్న కుమారుడు నాయకుడు కావడం గమనార్హం. గతంలో ఎన్ని సార్లు పట్టుబడినా కేసులో వారి పేర్లు లేకుండా అప్పట్లో వైసీపీ ప్రజా ప్రతినిధి తన పలుకుబడి ఉపయోగించి వ్యవహారం నడుపుతూ రావడంతో ఈ డ్రగ్స్ ముఠా మరింతగా రెచ్చిపోయింది. తాజాగా సోమవారం తెల్లవారుజామున మస్తాన్ దర్గాలో ఆశ్రయం పొందుతున్న మస్తాన్ దర్గా ధర్మకర్త రావి రామ్మోహన రావు తనయుడు రావి మస్తాన్ సాయిని విజయవాడ సెబ్ పోలీసులు అరెస్టు చేసి తీసుకు వెళ్లారు. జూన్ 30న విజయవాడ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌బ్యూరో (సెబ్) పోలీసులకు అందిన పక్కా సమాచారంతో విజయవాడ రైల్వేస్టేషన్లో దాడి చేయగా గుంటూరులోని సుభాని హోటల్ నిర్వాహకుడు దివంగత సుభాని తనయులు షేక్ నాగుల్ షరీఫ్, ఖాజా మొహిద్దీన్ తోపాటు వారి స్నేహితులు గోపీచంద్, క్రాంతి తదితరులు పట్టుబడ్డారు. వారిని విచారించగా తమకు మస్తాన్ సాయి డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. దీంతో పోలీసులు అప్పటి నుంచి మస్తాన్ సాయి కోసం వెంటాడుతుండగా ఎవరికి దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్నాడు. అయితే మస్తాన్ సాయి గుంటూరులోని మస్తాన్ దర్గాలో ఉన్నట్లు పక్కా సమాచారం అందుకున్న విజయవాడ పోలీసులు సోమవారం మస్తాన్ దర్గాలో ఉన్న మస్తాన్ సాయిని అరెస్ట్ చేశారు. డ్రగ్స్ కేసులో మస్తాన్ సాయిని అరెస్టు చేయడంతో గుంటూరులో డ్రగ్స్ వ్యవహారం మరోసారి కలకలం రేపింది. ఎన్నో సంవత్సరాలుగా మస్తాన్ సాయిపై డ్రగ్స్ ఆరోపణలు ఉన్నాయి.

సాయిపై గతంలో పలు కేసులు

గడిచిన కొంతకాలంగా తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర దుమారం రేపిన సినీ నటుడు రాజ్ తరుణ్, లావణ్య కేసులోనూ మస్తాన్ సాయి పేరు వినిపించింది. గుంటూరులోని పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ హోటల్లో మస్తాన్ సాయి తనపై అత్యాచారం చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు అంటూ అప్పట్లో లావణ్య ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదుపై పట్టాభిపురం పోలీస్ స్టేషన్ లో ఐపీసి 376 (1), 307, 323, 506,509 తదితర సెక్షన్ కింద క్రైమ్ నెంబర్ 103/23 గా కేసు నమోదు చేశారు. అయితే ఆ కేసులో అప్పటి సీఐ రాజశేఖర్‌రెడ్డి నిందితుడు మస్తాన్ సాయికి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో అప్పట్లో కేసును నగరంపాలెం పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆ కేసులో మస్తాన్ సాయి హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. కేసు విచారణలో భాగంగా వైద్య పరీక్షలకు రావాల్సిందిగా అప్పటి నగరంపాలెం సీఐ హైమారావు బాధితురాలు లావణ్య కు ఫోన్ చేసి పిలిచినా ఆమె రాలేదు. గుంటూరు పోలీసులు మస్తాన్ సాయికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ఆమె విచారణకు గైర్హాజరయ్యారు. ప్రస్తుతం ఆ కేసు విచారణ పెండింగ్‌లో ఉంది. ఇది ఇలా ఉంటే గుంటూరులో మస్తాన్ సాయిపై ఫిర్యాదు చేసిన లావణ్య ఆ తర్వాత కొద్ది నెలలకు హైదరాబాదులో డ్రగ్స్ కేసులో పట్టుబడింది. ఆమెకు డ్రగ్స్ సరఫరా చేసింది మస్తాన్ సాయిగా ఆరోపణలు వచ్చాయి.

గతంలోనే డ్రగ్స్ కేసులో వినిపించిన పేరు

ఇదిలా ఉంటే గుంటూరుకు చెందిన వరలక్ష్మి టిఫిన్స్ నిర్వాహకుడు ప్రభాకర్ రెడ్డి హైదరాబాదులో టిఫిన్స్ నిర్వహిస్తూ డ్రగ్స్ వినియోగిస్తూ సరఫరా చేస్తుండగా హైదరాబాదులో పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే ఆ కేసులోనూ మస్తాన్ సాయి ఉన్నట్లు ఆరోపణలు వచ్చినప్పటికీ ఆ కేసులో మస్తాన్ సాయిని నిందితునిగా చేర్చకపోవడం పట్ల కూడా అప్పట్లో అనేక అనుమానాలు వ్యక్తం అయ్యాయి. ఇదిలా ఉంటే గుంటూరుకు చెందిన వైసీపీ మాజీ ప్రజా ప్రతినిధి అన్న కుమారుడు, హోటల్ సుభాని తనయులు, ప్రస్తుతం విజయవాడ సెబ్ పోలీసులు అరెస్ట్ చేసిన మస్తాన్ సాయి, హైదరాబాదులో పట్టుబడిన వరలక్ష్మి టిఫిన్స్ నిర్వాహకుడు ప్రభాకర్‌రెడ్డి అందరూ ఒక ముఠాగా ఏర్పడి డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో వైసిపి ప్రజాప్రతినిధి అన్న కుమారుడు గోవా నుంచి డ్రగ్స్ తెప్పిస్తుండగా పోలీస్ ఉన్నతాధికారులకు పక్కా సమాచారం అందడంతో ప్రకాశం జిల్లా మార్టూరు పరిధి



మస్తాన్ సాయి

లోని టోల్‌గేటు వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో తనిఖీలు నిర్వ హించగా ఎండిఎంఏ డ్రగ్ తో యువకుడు పట్టుబడ్డాడు. అతని విచారించగా వైసీపీ ప్రజాప్రతినిధి అన్న కుమారుడి పేరు చెప్పాడు. అయితే పోలీ సులు ఆయనను పిలిపించి విచారించారు. అధికార పార్టీ నాయకుడి కుటుంబ సభ్యు లు కావడంతో వారి ఒత్తిడి మేరకు అప్పటి అధికారులు వారిని కేసు నుంచి తప్పించిన ట్లు ఆరోపణలు వచ్చాయి. ఇవేగాక గుం టూరు నగరంలో డ్రగ్స్‌తో కొందరు పట్టు బడగా వారిని విచారించినప్పుడు మాజీ ప్రజాప్రతినిధి అన్న కుమారుడి పేరు కూడా విచారణలో వెలు గు చూసింది. ఆ కేసులోనూ అతడి పేరు తప్పించడంతో ఈ వ్యవహారం పెద్ద దుమారమే రేపింది. దీంతో అప్పటి లాలాపేట సిఐ మాతంగి శ్రీనివాసరావు ను ఆకస్మికంగా బదిలీ చేశారు.

ప్రముఖుని ఫిర్యాదుతో పోలీసుల నిఘా

హోటల్ సుభాని కుమారులు విజయవాడ సమీపంలోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. విశాఖపట్నం చెందిన ప్రముఖుని తనయుడు కూడా వీరి వద్ద డ్రగ్స్ తీసుకొని మత్తులో పడి పోవడంతో, ఫోన్ కూడా రిసీవ్ చేసుకోలేని పరిస్థితిలో ఉండడంతో సమాచారం అందుకున్న ఆయన ఇక్కడికి వచ్చి తన కుమారుని ఆసుపత్రికి తరలించి విచారించగా గుంటూరుకు చెందిన సుభాని తనయుడు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు చెప్పాడు. దీంతో పోలీసులు వీరిపై నిఘా ఉంచడంతోనే మార్టూరు వద్ద వీరికి డ్రగ్స్ పట్టు పడినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు వీరు గుంటూరుకు చెందిన ఎంతమందికి డ్రగ్స్ అందించారనేది చర్చనీయాంశమైంది. పోలీస్ ఉన్నతాధికారులు మరింత లోతుగా విచారిస్తే డ్రగ్స్ మాఫియా గుట్టురట్టు అవుతుందని భావిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో డ్రగ్స్ , గంజాయి వంటి వాటిని యథేచ్ఛగా సరఫరా చేసినా నాటి ప్రజా ప్రతినిధి అధికారాన్ని అడ్డుపెట్టుకొని పోలీసులు కేసులు పెట్టకుండా చూడగలిగారు. ఈ కారణంగానే డ్రగ్స్ మాఫియా రెచ్చిపోయింది. ఈ ముఠా కార్యకలాపాలపై ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికా మూలాలను కూకటివేళ్ళతో పెకిలించి వేయాలని ప్రజలు కోరుతున్నారు.

- విద్యా సంవత్సరం ప్రారంభమైనా విడుదల కాని స్కూల్ గ్రాంట్
- వైసీపీ ప్రభుత్వంలో మూడేళ్ళగా నిధులు విడుదల జీరో

బడి నడిపేదెలా..

గుంటూరు(విద్య),ఆగస్టు 12: ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభమై మూడు నెలలు పూర్తికావస్తున్నా నిధులు విడుదలతో తీవ్రజాప్యం జరుగుతోందని ప్రధానోపాధ్యాయులు(హెచ్‌ఎంలు) ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిధుల లేమి కారణంగా ఇప్పటికే మూడు నెలలుగా పారిశుధ్య కార్మికులకు, మధ్యాహ్నభోజన కార్మికుల జీతాలు నిలిచిపోవడంతో పాఠశాలల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. మరోవైపు పాఠశాలల్లోరోజువారీ ఖర్చుల కోసం నిధులు లేకపోవడంతో హెచ్‌ఎంలు సొంత డబ్బులు వినియోగించాల్సి వస్తోంది.

ఉమ్మడి జిల్లాలో జడ్పీ, ప్రభుత్వ యాజమాన్యాల ఆధ్వర్యంలో 340పైగా ఉన్నత పాఠశాలలు, మరో 3500 వరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో దాదాపు 4.50లక్షల మందికిపైగా విద్యార్థులు 1 నుంచి 10వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారు. ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో స్కూల్ గ్రాంట్స్ విడుదల చేస్తారు. కేంద్రం నుంచి ఏటా జూలై మొదటి వారంలోనే నిధులు వస్తాయని వాటికి రాష్ట్ర ప్రభుత్వం కొంతమొత్తం నిధులు జోడించి స్కూల్‌గ్రాంట్‌గా విడుదల చేస్తారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో మొదటి రెండు సంవత్సరాలు మాత్రమే నిధులు ఇచ్చారని మిగిలిన మూడు సంవత్సరాలు నిధులు నిలిపివేయడంతో హెచ్‌ఎంలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నిధులు విడుదల, వినియోగం ఇలా..

ప్రభుత్వం స్కూల్ గ్రాంట్ కింద విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు విడుదల చేస్తారు. విద్యార్థులు 100 లోపు ఉంటే రూ.25వేలు, 100 నుంచి 500 లోపు అయితే రూ.50వేలు, 1000లోపు ఉంటే రూ. లక్ష ఇలా విద్యార్థుల సంఖ్య కనుగుణంగా గ్రాంట్స్ విడుదల చేస్తారు. ఈ నిధులతో పాఠశాలలో ఎలక్ట్రికల్ బిల్లు, చాక్‌పీసులు, స్టేషనరీ, మంచి నీరు, కంప్యూటర్ల నిర్వహణ, మోటార్ ఖర్చులు మరుగుదొడ్ల నిర్వహణ, చిన్న చిన్న ఫంక్షన్ల కోసం వినియోగిస్తారు.

- జాతీయ విద్యా విధానం ప్రవేశ పెట్టి నాలుగేళ్ళు అయిన సందర్భంగా చేసిన ఖర్చులకు డబ్బులు లేక ఇబ్బందులు ఎదురయ్యాయి.



దాతల సహకారంతో తిథి భోజనం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు (పాతచిత్రం)

- ఇటీవల పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు వారం రోజులు నిర్వహించారు. ఇందు కోసం ఒక్కపైసా ప్రభుత్వం నుంచి విడుదల కాలేదు. దీంతో హెచ్‌ఎంలు దాతల్ని ఆశ్రయించాల్సి వచ్చింది. కొన్ని స్కూల్స్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు చందాలు వేసుకుని నిర్వహించగా కొన్నిచోట్ల విద్యార్థుల నుంచి కొంత మొత్తం వసూలు చేసి వారం రోజులు కార్యక్రమాలు చేశారు.
- ఈనెల మొదటి వారంలో నిర్వహించిన స్కూల్ మేనేజమెంట్ కమిటీ ఎన్నికలకు నిధులు లేవు. పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులకు అల్పాహారం, కాఫీ, టీ, బిస్కెట్ల హెచ్‌ఎంలు సొంత నిధులు ఖర్చుపెట్టాల్సిన దుస్థితినెలకొంది.
- 15న స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించాలి. ఇందుకోసం నిధులు వెతుక్కోవాల్సిన దుస్థితి పాఠశాలల్లో నెలకొంది.
- జిల్లాలో మధ్యాహ్నభోజన పథకం అమలు చేసే నిర్వాహకులకు మూడు నెలలుగా నిధులు విడుదల కాలేదు. దీంతో అనేక చోట్ల ఏజెన్సీ నిర్వాహకులు తీవ్రస్థాయిలో హెచ్‌ఎంలపై ఆగ్రహంగా ఉన్నారు. మరోవైపు మరుగుదొడ్లు, పాఠశాలల్లో పారిశుధ్య పనులు చేసే కార్మికులకు మూడు నెలలుగా జీతాలు లేవు.దీంతో కొన్ని చోట్లు పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని హెచ్ ఎంలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎన్డీఏ ప్రభుత్వం పాఠశాలలకు గ్రాంట్ విడుదల చేయాలని, ప్రభుత్వ ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్నామని హెచ్‌ఎంలు చెబుతున్నారు.





ఓ క్వారీ నుంచి పరదా కప్పి తరలిపోతున్న ఇసుక ట్రాక్టరు

ఆగని ఇసుక అక్రమ రవాణా

- ఏకంగా ఎక్స్‌వేటర్లతో తవ్వకాలు
- అధికారుల్లో లేని చలనం

చీరాల, ఆగస్టు 12 : చీరాల నియోజకవర్గంలో పలుచోట్ల, పర్చూరు నియోజకర్గం చినగంజాం మండలం కడవకుదురు పరిధిలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఈ వ్యవహారం బహిరంగంగా సాగుతున్నా, దీనిని నియంత్రించాల్సిన శాఖల అధికారులకు మాత్రం కనిపించడం లేదు. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సీఎం చంద్రబాబు ఇసుక అక్రమాలు జరగకూడదని పదే, పదే చెప్తున్నారు. ఇటీవల ఐఏఎస్, ఐపీఎస్‌లకు నిర్వహించిన సమావేశంలో కూడా ఇసుక అంశాన్ని సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. అయితే క్షేత్ర స్థాయిలో అధికారులు అక్రమార్కులతో మిలాఖత్ అవడంతో, పగలు, రాత్రి తేడాలేకుండా ఇసుక అక్రమ రవాణా సాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో..

చీరాల మండలం ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో 216 జాతీయ రహదారికి సమీపంలో ఏకంగా ఎక్స్‌కవేటర్‌తో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా సాగుతున్నాయి. ఆ ప్రాంతంలో కొంత ప్రభుత్వ భూమిలో కూడా అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారు. దీంతో అక్కడ భారీగా గోతులు ఏర్పడి, అందులో నీరుచేరి చెరువులను తలపిస్తున్నాయి. కావూరివారిపాలెం, గవినివారిపాలెం, బాపట్ల మండల సరిహద్దుల్లో ఇసుక అక్రమ తవ్వకాలు భారీ స్థాయిలో జరుగుతున్నాయి. అలానే వేటపాలెం మండలం పందిళ్లపల్లి, చినగం జాం మండలం కడవకుదురు సరిహద్దుల్లో ఇసుక అక్ర మ తవ్వకాలు (ఎక్సకవేటర్లతో) సాగుతున్నా యి. అందులో చీరాల నియోజకవర్గంలో కొంత భాగం, పర్చూరు నియోజకవర్గంలో కొంత భాగం ఉంటుంది. 216 జాతీయ రహదారిలో ఎర్రగేటుకు సమీపంలో జరుగుతున్న అక్రమ తవ్వకాలు, రవాణా కూడా బహిరంగ రహస్యమే.



ఇసుక తవ్వకాలతో చెరువులను తలపిస్తున్న గోతులు

క్వారీల్లోకి వెళ్లే అనుమతి మాకు లేదు

- కర్ణ, ఎస్ఈబీ సీఐ, చీరాల

ఇసుక అక్రమ రవాణాను అరికట్టటమే మా బాధ్యత. ఇసుక తవ్వకాలు జరిగే క్వారీలలో వెళ్లేందుకు మాకు అనుమతి లేదు. ఆ బాధ్యత మాది కాదు. మా పరిధిలో మేం ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పూర్తి స్థాయిలో ప్రయత్నిస్తున్నాం. గత నెలలో కూడా 10 కేసులు రాశాం.

నిరంతర నిఘా పెడుతున్నాం పూర్తి స్థాయిలో నియంత్రిస్తాం..

ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా నేరం. వాటి నియంత్రణకు నిరంతర నిఘా పెడుతున్నాం. పూర్తి స్థాయిలో అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నాం. ఈ రోజు కూడా మా టీంలు ఫీల్డ్‌లోనే ఉన్నాయి. అందుకు ప్రజల సహకారం కూడా అవసరం. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

- రాజేష్‌కుమార్, మైనింగ్ ఏడీ, బాపట్ల

పంచాయతీల్లో.. జెండా పండుగ



- స్వాతంత్ర్య వేడుకలకు భారీగా నిధులు
- ఖర్చు పరిమితిని రూ.10 నుంచి 10 వేలకు పెంపు
- మేజర్ పంచాయతీలకు రూ. 25 వేల వరకూ అవకాశం

గుంటూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వంద రూపాయలతో పండగ చేసుకోగలమా? పోనీ 250 రూపాయలతో? సాధ్యమే కాదు కదా? కానీ దేశ వ్యాప్తంగా జరుపుకునే పండుగ, జాతి మొత్తం చేసుకునే జెండా పండుగ, జాతి విముక్తి కోసం త్యాగాలు చేసిన అమరులను స్మరించుకునే పండుగ, ప్రతి ఒక్కరికీ స్వాతంత్ర్యం ఇచ్చిన పండుగ, జరుపుకోవడానికి ఇప్పటి వరకూ పంచాయతీలకు ఇచ్చిన నిధులు అవే. మైనర్ పంచాయతీలు అయితే వంద రూపాయలతో, మేజర్ పంచాయతీలు అయితే 250 రూపాయలతోనే జెండా పండుగ చేసుకోవాలి. స్వాతంత్ర్య వేడుకలు జరుపుకోవాలి. దీంతో జెండా ఎగరేసి మిఠాయిలు పంచడానికి కూడా డబ్బులు ఉండవు. ఈ పరిస్థితిని మార్చేందుకు కూటమి ప్రభుత్వం పూనుకొంది. ప్రత్యేకించి రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఈ పరిస్థితిపై దృష్టి సారించారు. స్వాతంత్ర్య వేడుకల నుంచే సుపరిపాలను శ్రీకారం చుట్టారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు గ్రామ పంచాయతీలకు భారీ స్థాయిలో నిధులు వినియోగించు కునేందుకు అవకాశం కల్పించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో స్వాతంత్ర వేడుకలు భారీ స్థాయిలో జరగనున్నాయి.

● రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం సర్పంచుల గౌరవ సంకేతం

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి భూమిక గ్రామ పంచాయతీ వ్యవస్థ. ఎలాం టి రాజకీయాలతో సంబంధం లేకుండా, పార్టీల పేర్లతో పనిలేకుండా జరిగే ఎన్నికలతో ప్రజలు ఎన్నుకునే పాలకు లతోసాగే ప్రజాస్వామిక పునాది గ్రామ పంచాయతీ. అందుకే గ్రా మాలను దేశాలకు వెన్నెముక అంటారు. దేశంలో ఎవరికీ లేని చెక్ పవర్ పంచా యతీ సర్పంచుకు మాత్రమే వుం టుంది. అలాంటి గ్రామ పంచాయతీ వ్యవస్థ ప్రభ పాలకుల నిర్లక్ష్యం కారణంగా మసకబా రుతూ వస్తోంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో పరిస్థితి మరింత దిగజారిపోయింది. గ్రామ సర్పంచులను పూర్తి గా ఉత్సవ విగ్రహాలుగా చేసేశారు. ఆర్థిక సంఘం నిధులతో సహా అన్ని నిధులను దారి మళ్లించి పంచా యతీలను దారుణంగా దెబ్బతీశారు. అలాంటి పరిస్థితి లో ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గ్రామ పంచాయతీలకు పూర్వ వైభవం రానుంది. ఇప్పటి వరకూ ఉత్సవ విగ్రహాలుగా మారిన పంచాయతీ సర్పంచులకు తిరిగి గౌరవాన్ని కల్పించనుంది.

● నేటికీ తొలినాటి నిర్ణయమే అమలు

రాష్ట్రంలో 1994 నుంచి మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ అమలులోకి వచ్చింది. ఆనాటి నుంచి గ్రామ పంచాయతీల్లో స్వాతంత్ర్య వేడుకలు జరుపుతున్నారు. ఆ వేడుకలు నిర్వహించకోవడానికి అప్పట్లో రూపొందించిన విధివిధానాలే ఇప్పటి వరకూ అమలులో వున్నాయి.

• ఉమ్మడి జిల్లాలో 1042 పంచాయతీల్లో సంబరాలు

2011 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1042 గ్రామ పంచాయతీలు వున్నాయి. వాటిలో 231 మేజర్ పంచాయతీలు, 811 మైనర్ పంచాయతీలు వున్నాయి. కూటమి ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం ప్రకారం 811 మైనర్ పంచాయతీలు రూ. 10 వేలు, 231 మేజర్ పంచాయతీలు రూ. 25వేలు చొప్పున నిధులు వినియోగించుకోవచ్చును. ఆ మేరకు ఘనంగా వేడుకలు నిర్వహించడానికి గ్రామ సర్పంచులు, కార్యదర్శులు ఏర్పాట్లలో నిమగ్నమైవున్నారు. మునుపెన్నడూ లేని విధంగా స్వాతంత్ర వేడుకలకు గ్రామ పంచాయతీలు వేదిక కాబోతున్నాయి.

గ్రామ జనాభా 5000 లోపు ఉన్న చిన్న (మైనర్) పంచాయతీలు అయితే స్వాతంత్ర వేడుకలకు రూ. 100 రూపాయలు, గ్రామ జనాభా 5వేలకు మించిన పెద్ద (మేజర్) పంచాయతీలు అయితే 250 రూపాయలు వినియోగించుకోవచ్చు. ఈ నిర్ణయం తీసుకుని దాదాపు 30 ఏళ్ల కావస్తున్నా అదే పరిస్థితి కొనసాగుతోంది. మూడు దశాబ్దాల్లో పెరిగిన జీవన ప్రమాణాలు, వ్యయం, ద్రవ్యోల్బణంతో పోల్చి చూస్తే అది ఎంత తక్కువో ఊహించుకోవచ్చు. ప్రస్తుతమున్న ధరల్లో కనీసం జెండాను తయారు చేయడానికి కూడా ఆ మొత్తం సరిపోదు. దీంతో గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులపై భారం పడేది. వేడుకలను ఘనంగా నిర్వహించడానికి సొంత డబ్బు ఖర్చు చేసుకోవడమో, దాతల విరాళాల మీదో ఆధారపడాల్సి రావడమో జరిగేది. దీంతో పంచాయతీల్లో రాజకీయ జోక్యం, ప్రైవేటు వ్యక్తుల పెత్తనం పెరుగుతూ వచ్చింది. తద్వారా పంచాయతీ వ్యవస్థ నీరుగారిపోయింది.

● వెల్లి విరుస్తున్న గ్రామ స్వరాజ్యం

రాజ్యాంగంలో ప్రత్యేక అధ్యాయంగా వున్న గ్రామ స్వరాజ్య సాధనపై కూటమి ప్రభుత్వం, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి పవన్‌కల్యాణ్ దృష్టి సారించారు. పంచాయతీలకు పూర్వ వైభవం తీసుకురావడానికి జెండా పండుగను వేదికగా చేయాలని భావించారు. అనుకున్నదే తడవుగా జెండా వేడుకలను ఘనంగా నిర్వహించడానికి భారీగా నిధులు కేటాయించారు. దీంతో ఒక్కసారిగా వంద రెట్లు పరిమితిని పెంచారు. చిన్న పంచాయతీలకు ఇప్పటి వరకూ వున్న 100 రూపాయల పరిమితిని రూ. 10వేలకు పెంచారు. పెద్ద(మేజర్) పంచాయతీలకు పరిమితిని 25 రూపాయల నుంచి రూ. 25 వేలకు పెంచారు. దీంతో గ్రామ పంచాయతీలు స్వాతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించుకునే అవకాశం ఏర్పడింది. దీంతో గ్రామ పంచాయతీల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ హయాంలో కోల్పోయిన తమ ప్రభ, గౌరవం తిరిగి వస్తున్నాయన్న ఆనందం సర్పంచుల్లో కనిపిస్తోంది.

డిగ్రీ విద్యార్థి హత్య కేసులో నిందితుల అరెస్ట్

పరారీలో ఉన్న ఇద్దరి కోసం గాలింపు

వారంతా పాత నేరస్తులే

వివరాలు వెల్లడించిన ఏఎస్పీ విఠలేశ్వర్



వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

చీరాలటౌన్, ఆగస్టు 12 : డిగ్రీ విద్యార్థినిని అతి కిరాతకంగా మట్టుపెట్టిన నిందితులను చీరాల టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం రాత్రి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఎస్పీ విఠలేశ్వర్ వివరాలను వెల్లడించారు. చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం ఈసూబ్‌నగర్‌కు చెందిన సయ్యద్ అమీన్ ఆరీఫ్(18) పట్టణంలోని ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదవుతున్నాడు. కుటుంబంలో అధికంగా ఆర్మీ ఉద్యోగులు ఉండడంతో చిన్ననాటి నుంచే ఆరీఫ్ ఆర్మీపై మక్కువ పెంచుకున్నాడు. దీంతోనే ప్రతిరోజూ శరీరదారుఢ్యాన్ని పెంచుకునేందుకు చీరాల్లో జిమ్‌కు వెళ్లేవాడు. ఈక్రమంలోనే ఈనెల 6వ తేదీ రాత్రి జిమ్ ముగించుకుని మిత్రుడు మనోజ్ (బైక్)తో కలిసి ఆరీఫ్ (సైకిల్‌పై) ఈపూరుపాలెంలో ఇంటికి వెళుతున్నారు. అయితే చీరాల - బాపట్ల రోడ్డులోని ఆదినారాయణపురం వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి కారులో బాపట్ల వైపు వెళుతున్న పాత నేరస్తులు వెదుళ్లపల్లికి చెందిన సందీప్ హారన్ కొట్టాడు. ఈక్రమంలోనే వీరి మధ్య వివాదం రేగింది. అదికాస్త పెద్దదవడంతో సందీప్‌తో పాటు కారులో ఉన్న బాపట్లకు చెందిన జిలానీ, చీరాల పాపరాజుతోటకు చెందిన మహేంద్ర ఒకరి తరువాత ఒకరు కత్తితో పొడిచి అతి కిరాతకంగా హత మార్చి పరారయ్యారు. దీనికి కారులో ఉన్న మిగిలిన ఐదుగురు సహకరించారు. ఆరీఫ్ మిత్రుడు మనోజ్ ఫిర్యాదు మేరకు కారులో ఉన్న ఎనిమిది మందిపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేట్టారు. ఎట్టకేలకు సోమవారం వారిని అరెస్ట్ చేసి హత్యకు పాల్పడిన కత్తిని ఆరుగురిని అరెస్ట్ చేశారు. అయితే మహేంద్ర, రామకృష్ణాపురానికి చెందిన కర్రెద్దుల వంశీ కోసం గాలింపు చర్యలు సాగుతున్నట్లు ఏఎస్పీ వివరించారు. సందీప్. జిలానీ, షేక్ మహ్మద్ రియాజ్, పాశం లక్ష్మీనారాయణ, దేవరకొండ శ్రీను, అంగడి సుకుమార్‌ను అరెస్ట్ రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచనున్నారు. వీరిలో సందీప్, జిలానీ, మహేంద్రకు ఒక్కొక్కరిపై సుమారు 12 కేసులు, రౌడీషీట్‌లు ఉన్నట్లు ఏఎస్పీ తెలిపారు. కేసునే ఛేదించేందుకు కృషి చేసిన డీఎస్పీలు జగదీష్‌నాయక్, మురళీకృష్ణ, సీఐలు సోమశేఖర్, శ్రీనివాసరావు, సత్యనారాయణ, ఇంకొల్లు, అద్దంకి, బాపట్ల టౌన్, ఎస్‌బీ, సీసీఎస్ టీంను ఎస్పీ తుషార్ డూడీ ప్రత్యేకంగా అభినందించినట్లు ఏఎస్పీ విఠలేశ్వర్ తెలిపారు.

సూక్తి సుధలు ఖండకావ్యం ఆణిముత్యం



ఖండకావ్యాన్ని ఆవిష్కరిస్తున్న మద్రాస్ వర్సిటీ తెలుగు శాఖాధిపతులు విస్తాలి శంకరరావు

అద్దంకిటౌన్, ఆగస్టు 12 : సూక్తి సుధలు ఖండకావ్యం ఒక ఆణిముత్యం అని, ఇది అన్ని వయస్సులవారు ఆచరించదగిన పారాయణ గ్రంథమని మద్రాస్ యూనివర్సిటీ తెలుగు శాఖాధిపతులు ఆచార్య విస్తాలి శంకరరావు అన్నారు. సోమవారం అద్దంకిలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో రచయిత విద్వాన్ జ్యోతి చంద్రమౌళి రచించిన సూక్తి సుధలు ఖండకావ్యం ఆవిష్కరణ కార్యక్రమం హెచ్‌ఎం డీఎస్ పద్మావతి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విస్తాలి శంకరరావు గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతు ఇటువంటి గ్రంథాన్ని తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుకు అంకితం ఇవ్వడం అదర్శవంతమైనదన్నారు. గ్రంథ సమీక్షకులు డాక్టర్ యూ దేవపాలన మాట్లాడుతూ ఈ గ్రంథం నేటి సమాజంలో జరిగే అసమానతలకు అర్థంపట్టే విధంగా ఉందని, పద్యాలు సమాజంలో జరిగే మార్పులు, నేటి చరిత్రను గుర్తు తెస్తున్నాయని అన్నారు. మరో సమీక్షకులు అన్నమనేని వెంకట్రావు మాట్లాడుతూ ఈ గ్రంథం నాటి నుంచి నేటి వరకూ జరుగుతున్న అఘాత్యాలను సందేశాత్మకంగా రచయిత చెప్పారన్నారు. అనంతరం రచయిత జ్యోతి చంద్రమౌళిని అతిథులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య), డాక్టర్ చుక్కా నాగభూషణం, డాక్టర్ కాకాని సుధాకర్, దివాకర్ దత్తు, పీఈటీ ఎం.నాగయ్య, వీరయ్య, వీరాంజనేయులు, నాగేశ్వరరావు, శ్రీమన్నారాయణమూర్తి, రమేష్, ఉపాధ్యాయుడు వీలక్ష్మినారాయణ పాల్గొన్నారు.

పూర్తి స్థాయి వైకల్యానికి పెన్షన్ పెంచి ఇవ్వాలి



మనోజ్‌కుమార్‌ని ఎత్తుకొని ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తీసుకెళుతున్న కుటుంబ సభ్యులు

బాపట్ల, ఆగస్టు 12 : పూర్తి స్థాయి అంగవైకల్యంతో ఉన్న తన బిడ్డకు పెన్షన్ 15వేల రూపాయలు వచ్చేవిధంగా చూడలంటూ ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సోమవారం కలెక్టర్ జె.వెంకటమురళీని బాధిత కుటుంబ సభ్యులు కోరారు. జిల్లాలోని ఇంకొల్లు మండల కేంద్రంలోని స్టాలిన్‌పేటకు చెందిన వై.మనోజ్‌కుమార్‌కు 90శాతం వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ ఉందని, ప్రస్తుతం 100శాతం వైకల్యంతో ఉన్న మనోజ్‌కుమార్‌కు పెన్షన్ పెంచి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇంకొల్లు నుంచి ఆటోలో తీసుకొచ్చి చేతులపై ఎత్తుకొని కలెక్టర్ వద్దకు తీసుకెళ్ళటం ప్రతిఒక్కరినీ కలిచివేసింది.

ఉద్యోగాల పేరిట డబ్బులు వసూలు చేసిన వైసీపీ నాయకురాలిపై చర్యలు తీసుకోవాలి

బాపట్ల, ఆగస్టు 12 : ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి తమ వద్ద 17లక్షల75వేల రూపాయలు వసూళ్లు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఎస్పీ తుషార్ డూడీని వినతిపత్రం ద్వారా కోరారు. వివరాల్లోకి వెళితే... జిల్లాలోని ఇంకొల్లు మండలం ఇడుపులపాడు గ్రామానికి చెందిన దొంతాల మహేష్, దొంతా మనోహర్‌లకు ఉద్యోగాలిప్పిస్తానని చెప్పి ఒంగోలుకు చెందిన వైసీపీ నాయకురాలు షేక్ సల్మాసుల్తానా డబ్బులు తీసుకుంది. విడతల వారీగా డబ్బులు తీసుకొని మోసగించిన ఆమెను అడిగితే కుమారుడు, భర్త వచ్చి చంపుతామని బెదిరిస్తున్నట్లు ఎస్పీకి వివరించారు. గత ఏడాది ఏప్రిల్‌లో రెవెన్యూ ఉద్యోగాలిస్తామని నమ్మబలికి సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు పీఏ బండారు సురేష్ ద్వారా ఉద్యోగాలు అధికారికంగా ఇస్తామని చెప్పి నమ్మించింది. విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ పోస్టుకు 15 లక్షల రూపాయలు, జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు 5లక్షల రూపాయలు కట్టాలని చెప్పి తమ వద్ద రూ.17.75లక్షలు వసూలు చేసిందని ఆరోపించారు. తీరా ఉద్యోగం కోసం వెళితే ఫేక్ జాబ్ అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపి ఇచ్చారన్నారు. ఉద్యోగం వచ్చిందన్న ఆనందంలో ఆర్డర్ కాపీ తీసుకొని బంధువులు, స్నేహితులకు పంపించామన్నారు. తీరదానిని పరిశీలిస్తే ఫేక్ జాబ్‌ఆర్డర్ కాపీగా గుర్తించామని చెప్పారు. దీనిపై సంబంధిత మహిళను ప్రశ్నించగా తమ కుటుంబ సభ్యులను చంపుతామని బెదిరిస్తున్నారన్నారు. వారి నుండి తమకు ప్రాణహాని లేకుండా రక్షణ కల్పించాలని వారు కోరారు. డబ్బులు తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

గుండ్లకమ్మ భద్రమేనా!

తుంగభద్ర డ్యాం ఘటనతో ప్రాజెక్టుపై మరింత టెన్షన్

వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో గతంలో

రెండు సార్లు కొట్టుకుపోయిన గేట్లు

వరుసగా రెండేళ్ల పాటు ఆయకట్టుకు అందని నీరు

ఇప్పటికీ ప్రమాదకరంగానే సగం గేట్లు

నీరు అందుబాటులో ఉన్నా నిల్వ చేయలేని దుస్థితి

ఒక టీఎంసీకే పరిమితం చేస్తున్న అధికారులు

వాస్తవ సామర్థ్యం 3.85 టీఎంసీలు

పాలక పెద్దలు దృష్టిపెడితే రబీకి నీరు

ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై చూపిన నిర్లక్ష్యం జిల్లాలోని గుండ్లకమ్మ ప్రాజెక్టును నేటికీ వెంటాడుతోంది. వర్షాలతో కాకపోయినా కృష్ణానది పొంగిపొర్లుతూ సాగర్ కాలువలకు సీజన్ కంటే ముందుగానే నీరు వస్తోంది. ఆ నీటితో ప్రాజెక్టును నింపుకొనే అవకాశం ఉన్నా గేట్లు ప్రమాదకరంగానే ఉండటంతో అధికారులు ధైర్యం చేయడం లేదు. తాజాగా తుంగభద్ర డ్యాం గేట్లు కొట్టుకుపోయిన ఘటనతో గుండ్లకమ్మ భద్రతపై యంత్రాంగం ఆందోళన చెందుతోంది. ఇంచుమించు సగం గేట్లు మరమ్మతులు లేదా కొత్తవి పెట్టాల్సి ఉంది. మిగతా వాటిలో కొన్నింటి పనులు జరుగుతున్న తరుణంలో కనీసం రెండు టీఎంసీల నీటిని అయినా నిల్వ చేద్దామన్న ఆలోచనతో ఉన్న అధికారులు తుంగభద్ర ఘటనతో వెనక్కితగ్గారు. ప్రాజెక్టులో మొత్తం 3.859 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉంది. ప్రస్తుతం ఒక టీఎంసీ చేరగానే ఇక అంతకు మించి నిల్వ చేయడం మంచిది కాదన్న అభిప్రాయంతో ఎగువ నుంచి నీరు రాకుండా ఆపేస్తున్నారు.

ఒంగోలు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రాజెక్టు నిర్వహణలో వైసీపీ ప్రభుత్వ అసమర్థతతో గుండ్లకమ్మ ప్రాజెక్టులో వరుసగా రెండేళ్ల రెండు గేట్లు కొట్టుకుపోయాయి. తక్షణం మరమ్మతులలోనూ చేసిన జాప్యంతో గత రెండేళ్లుగా ఆయకట్టుకు నీరు ఇవ్వలేదు. అలస్యంగా గేట్ల మరమ్మతు పనులు చేపట్టినా సకాలంలో నిధులు ఇవ్వకపోవడంతో ఇప్పటికి కూడా పనులు పూర్తికాలేదు. ప్రస్తుతం నీరు అందుబాటులో ఉన్నా నిల్వ చేసుకునే అవకాశం లేకుండాపోయింది. మొత్తం 15గేట్లు గుండ్లకమ్మ ప్రాజెక్టు పరిధిలో 80,060 ఎకరాల ఆయకట్టు ఉండగా ఒంగోలుతోపాటు దాదాపు 70కిపైగా గ్రామాలకు తాగునీరు అందనుంది. గత టీడీపీ పాలనలో ప్రాజెక్టు నిర్వహణ బాగానే ఉన్నా వైసీపీ ప్రభుత్వం వచ్చాక గాలికి వదిలేశారు. గేట్ల నిర్వహణ సరిలేక దెబ్బతిని పోగా రెండు గేట్లకు మరమ్మతులు అత్యవసరమని అందుకు రూ.90లక్షలు ఇవ్వాలని యంత్రాంగం కోరినా పట్టించుకోలేదు. ఫలితంగా 2022 ఆగస్టు 31న మూడవ నెంబరు గేటు కొట్టుకుపోయింది. అప్పటికి మేల్కొని అధికారులు మరమ్మతులు కోరిన 6, 7 గేట్లకు నిధులు ఇవ్వగా పనులు చేశారు.

బిల్లుల పెండింగ్‌తో..

అయితే సదరు కాంట్రాక్టర్లకు రూ.60లక్షల బిల్లులు పెండింగ్ పెట్టడంతో కొట్టుకుపోయిన మూడవ నెంబరు గేటు పని ఇస్తామన్న వద్దని వెళ్లిపోయారు. ఈక్రమంలో 2023 డిసెంబరులో రెండవ నెంబరు గేటు కొట్టుకుపోయింది. దాంతో వరుసగా రెండేళ్ల ప్రాజెక్టులో నీరు నిల్వ చేసే అవకాశం లేక ఆయకట్టుకు నీరు ఇవ్వక రైతులు రూ.500 కోట్లకుపైగా ఉత్పత్తులు నష్టపోయారు. ఆ విషయం అలా ఉంచితే వరుసగా రెండవ ఏడాది కూడా గేటు కొట్టుకుపోయిన నేపథ్యంలో మొత్తం గేట్ల మరమ్మతులు లేదా కొత్తవి పెట్టడం అవసరంగా చేసిన నిపుణుల కమిటీ సూచనకు మోక్షం లభించింది. అప్పటికే చేసిన 6,7 గేట్లు అలాగే పెండింగ్‌లో ఉన్న మూడవ గేటు మినహా మిగిలిన 12 గేట్లకు రూ.9.60 కోట్లు టెండర్ పిలిచారు. అహ్మదాబాద్‌కు చెందిన కంపెనీ టెండర్ పొంది వేగంగా పనులు చేపట్టింది. ఇప్పటి వరకు దాదాపు రూ.5 కోట్ల విలువైన పనులు చేశారు. టెండర్‌లో 12 గేట్లలో ఐదింటిని పూర్తిగా అమర్చగా రెండింటిని అమర్చుతున్నారు. మరొకటి ఈ వారంలో రానుంది. అయితే వారికి కూడా



గేట్లు కొట్టుకుపోవడంతో గుండ్లకమ్మ నుంచి వృథాగా పోతున్న నీరు(ఫైల్)

బిల్లులు చెల్లించకపోవడంతో తదుపరి గేట్లు పనులు ముందుకు సాగడం లేదు.

నిధులు ఇవ్వకపోవడంతో ఆలస్యం

ఇదిలా ఉండగా మొత్తం 15 గేట్లలో గతంలో పెట్టిన 6, 7 గేట్లతోపాటు మరో ఐదు పూర్తిగా అమర్చగా మరో ఐదు కొత్తవి పెట్టాల్సి ఉంది. మిగిలిన పనులు జరుగుతున్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం నిధులు ఇచ్చి ఉంటే మిగిలిన పనులు కూడా జరిగేవి. పట్టించుకోకపోవడంతో ఇంకా సగం గేట్లు ప్రమాదకరంగానే ఉన్నాయి. దీంతో ప్రాజెక్టులోకి నీటిని పెట్టే అవకాశం ఉన్నా గేట్ల భద్రతపై అనుమానంతో అధికారులు ధైర్యం చేయలేకపోతున్నారు. గుండ్లకమ్మ నీటిమట్టం 24.38 మీటర్లు, నిల్వ సామర్థ్యం 3.85 టీఎంసీలు. కాగా ప్రస్తుతం 20.40 మీటర్ల నీటిమట్టంతో ఒక టీఎంసీ నీరు నిల్వ ఉంది. అందులో గేట్ల పనులతో నీటిని వదిలివేశాక 0.4 టీఎంసీలు ఉండగా కొత్తగా 0.6 టీఎంసీలు పెట్టారు. నిజానికి ప్రస్తుతం గేట్లు బాగా ఉండి ఉంటే ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నీరు నింపుకోవచ్చు. కృష్ణానదికి వరద పోటెత్తి శ్రీశైలం, సాగర్ డ్యామ్‌లు నిండి నీరు సముద్రం పాలవుతున్న నేపథ్యంలో సాగర్ కుడి కాలువకు నీరిచ్చిన ప్రభుత్వం ఆ నీటితో వనరులను నింపుకోవాలని ఆదేశించింది. తదనుగుణంగా సాగర్ కాలువ జిల్లా సరిహద్దు 85/3 వద్ద ఉన్న ఎస్కేప్ నుంచి వారం క్రితం గుండ్లకమ్మకు నీరు వదిలారు. ఇప్పటికి అలా అక్కడి నుంచి నీరు తీసుకొని పూర్తిగా ప్రాజెక్టును నింపుకొనే అవకాశం ఉంది. అయితే ప్రాజెక్టు నిల్వ ఒక టీఎంసీకి చేరేసరికి ఎగువ నుంచి నీటిని ఆపేశారు.

పనులు పూర్తికాకనే..

వాస్తవానికి ఐదు గేట్లు పూర్తితోపాటు మరో మూడింటి వద్ద పనులు జరుగుతున్నాయి. వాటి వద్ద స్టాప్‌లాక్ గేట్లు అమర్చడం, మరో మూడు వద్ద ఒకస్థాయి వరకు స్టాప్‌లాక్ గేట్లు పెట్టి ఉండటంతో మరొక టీఎంసీ నీటిని నిల్వ చేసే అవకాశం ఉంటుంది. అయితే తాజాగా జరిగిన తుంగభద్ర ఘటనతో గుండ్లకమ్మ అధికారులు ఒక టీఎంసీ మించి నిల్వ చేసేందుకు ధైర్యం చేయడం లేదు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 1,200 క్యూసెక్కుల నీరు వస్తుంది. దిగువన నీటి అవసరాల కోసం 600 క్యూసెక్కులు నాలుగు రోజులు ఇచ్చారు. ఎగువన ఒకటి, రెండు రోజులలో ఆగిపోనుండటంతో దిగువకు విడుదల కూడా ఆపేశారు. ఎడమ కాలువకు 50 క్యూసెక్కులు ఇస్తున్నారు. మొత్తంగా ఒక టీఎంసీ మించి నిల్వ చేయలేని పరిస్థితి నెలకొంది. ఇదిలాఉండగా కాంట్రాక్టు కంపెనీ వేగంగా పనులు చేపట్టడంతో నాలుగైదు నెలల్లోనూ ఐదు గేట్లను పూర్తిగా అమర్చింది. మరో మూడు గేట్లను ఈ నెలాఖరుకు పూర్తయ్యే అవకాశం ఉంది. ఈ తరుణంలో ప్రస్తుత ప్రభుత్వం సదరు కంపెనీకి చేసిన పనులకు బిల్లులు ఇస్తే కనీసం అక్టోబరు నాటికి అయినా గేట్లు పూర్తిచేసి పూర్తిస్థాయిలో నీటిని నిల్వచేసి ఆయకట్టుకు నీరు ఇవ్వవచ్చు. ఆ వైపుగా పాలకపక్ష పెద్దలు తక్షణం దృష్టిపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాకపోతే ఈ ఏడాది కూడా ఆయకట్టు రైతులు ఇక్కట్లు పడక తప్పదు.

సర్దుబాటు వాయిదా!

15 వరకు టీచర్ల వినతులు స్వీకరణ

16న కొత్త సీనియార్టీ జాబితాలు.. 17న కౌన్సెలింగ్

ఒంగోలు(విద్య), ఆగస్టు 12 : ఉపాధ్యాయుల సర్దుబాటు వాయిదా పడింది. ఉపాధ్యాయ సంఘాల తిరుగుబాటుతో విద్యాశాఖ నష్టనివారణ చర్యల్లో భాగంగా ప్రక్రియను వాయిదా వేసింది. టీచర్ల సర్దుబాటుకు సంబంధించి మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సోమవారం ఉదయానికి మండల విద్యాధికారుల లాగిన్‌లో ఆ మండలంలోని మిగులు టీచర్లు, కొరత ఉన్న పాఠశాలలు దర్శనమిచ్చాయి. ఆ జాబితాలు చూసిన టీచర్లకు అయోమయానికి గురయ్యారు. టీచర్ల సర్దుబాటుకు సంబంధించి ఒక్కటే చర్చ.. సీనియార్టీ విషయం తప్ప మరే ప్రతిపాదనను విద్యాశాఖ పరిగణనలోకి తీసుకోలేదు. టీచర్ల సర్దుబాటు ప్రక్రియ యధాతధంగా జరిగితే ప్రభుత్వ పాఠశాలల మనుగడకే ముప్పు వస్తుందని భావించారు. వెంటనే ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) రంగంలోకి దిగింది. ఇతర సంఘాల నాయకులు కూడా కదిలారు. తమతో చర్చలు జరపకుండా, తమ సూచనలను పరిగణనలోకి తీసుకోకుండా సర్దుబాటును తాము అంగీకరించబోమని తేల్చిచెప్పారు. సోమవారం మూడు గంటలకు మండలాల్లో జరగాల్సిన సర్దుబాటు కౌన్సెలింగ్‌ను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఎంఈఓలకు కౌన్సెలింగ్‌ను బహిష్కరిస్తున్నట్లు నోటీసులు ఇచ్చారు. దీంతో కౌన్సెలింగ్ వాయిదాపడింది జీవో నెంబరు 117ను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా దాని ప్రకారం సర్దుబాటుకు సంబంధించి మిగులు టీచర్లు, కొరత ఉన్న పాఠశాలలను గుర్తించడమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి నుంచి టీచర్ల అభిప్రాయాలను తెలుసుకోవాలని విద్యాశాఖ నిర్ణయించింది. దీని కోసం తాజా షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈనెల 15 వరకు టీచర్ల నుంచి అభిప్రాయ సేకరణ చేయనుంది. ఇప్పటికే విడుదల చేసిన మిగులు టీచర్ల సీనియార్టీ జాబితాలపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయమంది. 15వతేదీ వరకు వచ్చిన సూచనలను పరిశీలించి 16న టీచర్ల సీనియార్టీ తుది జాబితాను ప్రకటించి 17న మండల స్థాయిలో సర్దుబాటు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. సోమవారం విడుదలైన జాబితా ప్రకారం ఒంగోలు మండలంలో 51మంది సర్‌ప్లస్‌గా తేలారు. అయితే వారిలో 36 మందిని సర్దుబాటు చేయవచ్చు. దీంతో నికరంగా 15 మంది టీచర్లు మిగులుగా తేలారు. సంతనూతలపాడు మండలంలో 38మంది మిగులుగా తేలగా ఆరుగురు మాత్రమే సర్దుబాటు చేయవచ్చు. దీంతో నికరంగా 32మంది టీచర్లు మిగులుగా తేలారు.

టీచర్ల సర్దుబాటు బహిష్కరణ

అసంబద్ధమైన, అశాస్త్రీయమైన ఉపాధ్యాయుల సర్దుబాటును ఫ్యాప్టో, ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖల పిలుపు మేరకు బహిష్కరిస్తున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాకా జనార్దన్‌రెడ్డి, డి శ్రీనివాసులులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలు చెప్పిన ఏ అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం ఏకపక్షంగా సర్దుబాటు ప్రక్రియను చేపట్టి ఆగమేఘాల మీద కౌన్సెలింగ్ చేపట్టడాన్ని వారు తప్పుబట్టారు. 117 జీవో వల్ల వేలాదిమంది విద్యార్థులు పాఠశాలలను వదిలి డ్రాపవుట్లుగా మిగులుతున్నారని, అందువల్ల ఆ జీవోను రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లు పట్టివేత

ఇంకా చెలరేగిపోతున్న వైసీపీ ముఠా

ఇప్పటికి రెండుస్లార్లు పట్టుకున్నా వెరవని వైనం



అక్రమంగా మట్టి తరలిస్తూ పట్టుబడిన టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లు

దర్శి, ఆగస్టు 12: మండలంలోని రాజంపల్లి చెరువులో మట్టిని అక్రమంగా తరలి స్తున్న టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లను సోమవారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. పట్టపగలు చెరువులో మట్టి అక్రమంగా తరలిస్తున్న సమాచారం అందటంతో తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ హుటాహుటీన వెళ్లారు. చెరువులో నాలుగు ఎక్స్‌కవేటర్లతో టిప్పర్లకు మట్టి ఎత్తుతుండగా పట్టుకున్నారు. అక్కడ ఉన్న నాలుగు ఎక్స్‌కవేటర్లు, రెండు టిప్పర్లను పట్టుకొని దర్శికి తరలించారు. ప్రభుత్వం మారినప్పటికీ వైసీపీ నాయకుల మట్టి దందా ఆగలేదు. అధికారుల మెతక వైఖరితో దొంగచాటుగా మట్టి తరలిస్తూనే ఉన్నారు. ఇటీవలకాలంలో రెండుసార్లు రాజంపల్లి చెరువులో మట్టి తరలిస్తూ పట్టుబడినప్పటికీ మళ్లీ సోమవారం అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం నూతన తహసీల్దార్‌గా బాధ్యత లు చేపట్టిన శ్రావణ్‌కుమార్ సమాచారం అందిన వెంటనే వెళ్లి మట్టి తరలింపును అడ్డుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా ప్రభుత్వ భూముల్లో, కొండల మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మట్టి తర లించే టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లను సీజ్ చేస్తామని చెప్పారు.

కదిలి వచ్చిన కలెక్టర్

‘మీ కోసం’ వేదిక నుంచి దిగి వచ్చిన అన్సారియా

దివ్యాంగుడి సమస్య విని వెంటనే స్పందన

అర్హత ఉంటే పింఛన్ పెంచాలని ఆదేశాలు



దివ్యాంగుడు రామకృష్ణతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 12 : కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా తన హోదాను పక్కన పెట్టి సమస్యను చెప్పుకునేందుకు వచ్చిన దివ్యాంగుడు సమస్యలను తెలుసుకునేందుకు వేదిక దిగి కిందకు వచ్చారు. ఆమె కిందకు రావడమే కాకుండా అక్కడే కింద కూర్చొని ఆ దివ్యాంగుడి సమస్యను అడిగి తెలుసున్నారు. ఒంగోలు మండలం ఉలిచి గ్రామానికి చెందిన మేడా రామకృష్ణ మీ కోసం కార్యక్రమంలో తన సమస్యను చెప్పుకునేందుకు లోపలికి వచ్చాడు. చేనేత కుటుంబానికి చెందిన రామకృష్ణకు 90శాతం వికలత్వం ఉండటంతో ఏమి పనిచేయలేని స్థితిలో ఉన్నారు. ప్రస్తుతం దివ్యాంగుల కోటా కింద నెలకు రూ.6వేలు పెన్షన్ తీసుకుంటున్నారు అయితే పూర్తి స్థాయిలో వికలాంగత్వం ఉన్నందున తనకు నెలకు రూ.15వేలు పెన్షన్ కోసం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చారు. నేలపై కూర్చుని ఉన్న అతనిని చూసిన కలెక్టర్ వేదిక దిగి వచ్చి అతనితో మాట్లాడారు. నిబంధనల ప్రకారం అర్హత ఉంటే తప్పనిసరిగా పింఛన్‌ను పెంచే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు వెంటనే సంబంధిత అధికారులకు ఆ అర్జీని పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా కలెక్టర్ వేదికపై నుంచి కిందకు వచ్చి ఒక దివ్యాంగుడి వద్ద సమస్యను తెలుసుకునే విధానంపై అధికారులతోపాటు అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన ప్రజానీకం ఆమె ఔదార్యం, సహృదయతపై చర్చించుకోవడం కనిపించింది.

లారీ డ్రైవర్ మృతిపై కేసు నమోదు

కనిగిరి, ఆగస్టు 12: గ్రానైట్ క్వారీలో పనిచేస్తున్న లారీ డ్రైవర్ అట్లూరి రత్తయ్య(41) అనుమానాస్పద మృతిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ త్యాగరాజు తెలిపారు. గార్లపేట రోడ్డులోగల దస్తగిరి గ్రానైట్ క్వారీలో ఈ ప్రమాదం జరిగిందని ఆయన తెలిపారు. గ్రానైట్ రాయిని క్వారీ ర్యాంపు నుంచి లారీలోకి లోడ్‌చేసే క్రమంలో ప్రమాదం చోటుచేసుకుంది. బండరాయి ఒక్కసారిగా ఒరిగిపోయి లారీకి, క్వారీ ర్యాంప్‌నకు మధ్యలో లారీ డ్రైవర్ రత్తయ్యపై పడింది. ప్రమాదంలో రత్తయ్య తలకు బలమైన గాయంకాగా స్థానిక ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు అట్లూరి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కనువిందు చేస్తున్న భైరవకోన జలపాతం



సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 12: సీఎస్‌పురం మండలంలోని భైరవకోన జలపాతం నీటి ఉధృతితో సోమవారం కళకళలాడుతుంది. సాయంత్రం కురిసిన వర్షానికి జలపాతంలోకి నీళ్ళు పుష్కలంగా చేరాయి. కొండ కోనల నడుమ నుంచి జాలువారుతున్న నీటిలో స్నానాలు ఆచరిస్తే సకల పాపాలు హరిస్తాయనేది భక్తుల విశ్వాసం. జలపాతం అందాలు తిలకించేందుకు పర్యాటకులు మంగళవారం నుంచి వచ్చే అవకాశం ఉన్నందున జలపాతం వద్ద ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. పామూరు, సీఎస్‌పురం మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది.



డాక్టర్ ఎం.మహేంద్రనాథ్

టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధిగా డాక్టర్ మహేంద్రనాథ్

చీరాల, ఆగస్టు 12 : టీడీపీ చీరాల నియోజకవర్గ అధికార ప్రతినిధిగా డాక్టర్ ఎం.మహేంద్రనాథ్‌ను ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య నియమించారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానానికి లేఖ పంపారు. సోమవారం అధిష్ఠాన ఆమోదం లభించింది. నియోజకవర్గ అధికార ప్రతినిధిగా నియమితులైన మహేంద్రనాథ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. దాంతో పాటు నియోజకవర్గ ప్రజల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గంలో ప్రతి ఒక్కరినీ తాను ప్రత్యక్షంగా కలిసినట్లు చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం రెండు కళ్లుగా కూటమి శ్రేణులను కలుపుకుని ముందుకు సాగుతామన్నారు. తనను అధికార ప్రతినిధిగా నియమించిన ఎమ్మెల్యే కొండయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి శ్రేణులు మహేంద్రనాథ్‌కు అభినందనలు తెలిపారు.

ఆక్రమణలు తొలగించేనా?


» భవనాసిని రిజర్వాయర్‌గా మార్చే క్రమంలో అడ్డంకిగా సమస్య

» అధికారుల ఉదాసీనతతో పెరుగుతున్న చేపల చెరువులు

అద్దంకి, ఆగస్టు 12 : భవనాసి చెరువులో ఉన్న ఆక్రమణలు తొలగింపుపై అధికారుల ఉదాసీనత భవిష్యత్‌లో మరిన్ని సమస్యలకు కారణంగా నిలిచే అవకాశం ఉంది. భవనాసి చెరువును రిజర్వాయర్‌గా మార్చే పనులు 2009 సంవత్సరంలో ప్రారంభమయ్యాయి. అప్పట్లోనే రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి సర్వే చేపట్టి హద్దు రాళ్లు వేశారు. అప్పటికే కొంత మేర భవనాసి చెరువు ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. 1918 సంవత్సరంలో భవనాసి చెరువు నిర్మాణం పూర్తయింది. అప్పట్లో భవనాసి చెరువు విస్తీర్ణం వెయ్యి ఎకరాలు ఉంటుందని అంచనా. ప్రస్తుతం చెరువు విస్తీర్ణం ఏడెనిమిది వందల ఎకరాలకు మించి ఉండదనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. కొంత భాగాన్ని రైతులు ఆక్రమించి సాగు భూములుగా మార్చుకోగా, క్రమేపి ఆ భూమి లో చేపల చెరువుల ఏర్పాటు జరుగుతూ వస్తుంది. భవనాసి చెరువు అంచున పెద్ద ఎత్తున చేపల చెరువులు ఏర్పాటు ఏటికేడు పెరుగుతునే ఉన్నాయి. పనిలో పనిగా కొత్త చేపల చెరువులు తవ్వకాలు సమయంలో భవనాసి చెరువులో కొంత భాగాన్ని ఆక్రమిస్తున్నారు. ఆక్రమణలు జరుగుతున్నా ఆయా శాఖల అధికారులు మొక్కుబడిగా హడావుడి చేయడం మినహా అడ్డుకోకపోవడంతో ఆక్రమణదారులు మరింత రెచ్చిపోతున్నారు. దీంతో భవనాసి చెరువుకు రెండు వైపులా ప్రస్తుతం చేపల చెరువులు పెద్ద ఎత్తున ఏర్పాడ్డాయి. రిజర్వాయర్ పనులు పూర్తయితే చేపల చెరువులు తొలగించకుండా నీటి నిల్వ సామర్థ్యం పెంచటం సాధ్యం కాదు. చేపల చెరువులను తొలగించాలంటే పెద్ద మొత్తంలో పరిహారం ఎలాగూ పొందవచ్చు అన్న ధీమాతో పెద్ద మొత్తంలో చేపల చెరువులు తవ్వకాలకు జరుగుతున్నట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో ముందస్తుగానే అధికారులు ఆక్రమణలు తొలగించాలని పలువురు కోరుతున్నారు. అలా కాకుండా రిజర్వాయర్ నిర్మాణం పూర్తయిన తరువాత అయితే ఆక్రమణల తొలగింపునకు మరికొంత కాలం సమయం పట్టి కాలయాపన జరిగే అవకాశం ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. ఇప్పటికైనా భవనాసి చెరువును ఆక్రమించి ఏర్పాటు చేసిన చేపల చెరువులను, అనుమతులు లేకుండా తవ్విన చేపల చెరువులను తొలగిస్తారో లేక తమ కెందుకులే అని గతంలో పనిచేసిన అధికారుల వలే మిన్నకుంటారో వేచి చూడాల్సి ఉంది.



భవనాసి చెరువు



భవనాసి అంచున ఉన్న చేపల చెరువులు



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయండి

అధికారులకు ఆర్డీవో ఆదేశం

చినగంజాం, ఆగస్టు 12 : అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చీరాల ఆర్డీవో సూర్యనారాయణ రెడ్డి హెచ్చరించారు. మండలంలోని కడవకుదురు, మోటుపల్లి ప్రాంతాల్లోని ఇసుక తవ్విన ప్రదేశాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఇసుక అక్రమ రవణా అడ్డుకట్టకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే ఆ వాహనాలు, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి, యజమానులపై కేసు నమోదు చేయాలన్నారు. మోటుపల్లి ప్రాంతంలోని ఇసుక క్వారీలోకి వాహనాలు వెళ్లకుండా అడ్డుగా ముళ్ల కంచ వేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.ప్రభాకరరావు, వీఆర్వోలు పి.నాగరాజురెడ్డి, బండారు దానియేలు పాల్గొన్నారు.

గోమాతల గ్రాసానికి విరాళం

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



గోశాల నిర్వాహకుడికి సాయం అందిస్తున్న అరుణ కృష్ణమహర్షి

అద్దంకి, ఆగస్టు 12 : పట్టణంలో నిర్వహిస్తున్న హరిహర గోశాలలో ఆవుల ఆకలి తీర్చేందుకు పలువురు దాతలు ముందుకు వచ్చినట్లు గోశాల నిర్వాహకుడు గోనుగుంట సుబ్బారావు తెలిపారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన గోమాతల ఆక్రందన కథనంపై పలువురు దాతలు స్పందించారు. చీరాలకు చెందిన ఆధ్యాత్మిక గురువు గద్దె అరుణ కృష్ణమహర్షి సోమవారం గోశాలను పరిశీలించి చలించిపోయారు. ఆవులకు గ్రాసం కొరత విషయాన్ని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంద్వారా తెలుసుకొని తనకు తిండి కూడా తినబుద్ధి కాలేదని, తనవంతుగా రూ.10వేల నగదును అందజేశారు. తనకు పరిచయం ఉన్న పలువురు ద్వారా ఆర్థిక సాయం సమకూర్చేందుకు కృషి చేస్తానని కృష్ణమహర్షి తెలిపారు. అద్దంకి పట్టణంలోని నాగసూరి సత్యనారాయణ సుమారు రూ.15వేల విలువైన తౌడును అందజేశారు. మరికొందరు దాతలు కూడా తమ వంతు సహకారం అందించేందుకు ముందుకు వచ్చినట్లు నిర్వాహకుడు సుబ్బారావు తెలిపారు.

గిరిజన గురుకులానికి మైక్‌సెట్ అందజేత



మైక్‌సెట్‌ను అందజేస్తున్న రోటరీ సభ్యులు

అద్దంకిటౌన్, ఆగస్టు 12 : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో అద్దంకి పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాలకు మైక్ సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కురిచేటి వెంకట సుబ్బారావు (చిన్ని) సౌజన్యంతో భార్య అలేఖ్య జ్ఞాపకార్థం పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీ రోడ్డులో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలకు మైక్ సెట్‌ను అందించినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పురుషోత్తం, రోటరీ కార్యదర్శి చుండూరి మురళి సుధాకరరావు, చిన్ని మురళికృష్ణ, శ్రీరామచంద్రమూర్తి, హరి ప్రసాద్, రామకోటేశ్వరరావు, సుబ్బారావు, శ్రీనివాసరావు, కొల్లా భువనేశ్వరి పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తితో పలువురు దాడి

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఆగస్టు 12 : ద్విచక్ర వాహనాన్ని ఆపి వ్యక్తిపై పలువురు కత్తితో దాడిచేసి గాయపరిచిన సంఘటన ఆదివారం రాత్రి చీరాల మండలం ఈపూరుపాలెం యూసూఫ్‌నగర్ రైలు గేటు వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల మండలం స్టూవర్టుపురానికి చెందిన దేవరకొండ కిషోర్, మరియమ్మ ద్విచక్ర వాహనంపై చీరాల నుంచి యూసూఫ్‌నగర్ మీదుగా ఇంటికి వెళుతున్నారు. బోయినవారిపాలెంకు చెందిన కోటి మోహన్, మరో ఇద్దరు వీరిని అడ్డగించి కత్తితో దాడిచేసి గాయపరిచారు. అడ్డు వచ్చిన మరియమ్మపై కూడా దాడిచేశారు. బాధితులు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.

బైకిస్టులకు గాయాలు

మార్టూరు, ఆగస్టు 12 : ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని వెనుక వైపు నుంచి వస్తున్న బైకు ఢీకొన్న ఘటన సోమవారం జరిగింది. ఈ ప్రమాదంలో ముందు బైక్‌పై వెళ్తున్న కే వీరబ్రహ్మ, అతని తండ్రి హనుమంతరావుకు గాయాలయ్యాయి. వారు జె.పంగులూరు మండలం కోటపాడు గ్రామానికి చెందిన వారు. వారిని 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఢీకొట్టిన ద్విచక్రవాహనదారుడికీ గాయాలుకాగా అతని స్నేహితులు ఆసుపత్రికి తరలించారు.

వడ్డీ వ్యాపారి వేధింపులతో ఆత్మహత్యాయత్నం

చీరాలటౌన్, ఆగస్టు 12 : వడ్డీ వ్యాపారి వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈఘటన సోమవారం మధ్యాహ్నం పట్టణ పరిధిలోని థామస్‌పేటలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు పేటకు చెందిన గొల్ల సాల్మన్ రోజువారి కూలీ. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. కుటుంబ అవసరాల నిమిత్తం అదే ప్రాంతానికి చెందిన బడుగు హెప్సిబా వద్ద అధిక వడ్డీకు సుమారు రూ.1.50లక్షలు వరకు అప్పు తీసుకున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే చాలా వడ్డీ చెల్లించారు. రోజుకు రూ.వెయ్యి చెల్లించాలని లేదా ఉన్న పళంగా బాకీ ఇవ్వాలని, లేకుంటే ఇంటికి తాళాలు వేస్తానని హెప్సిబా బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ విషయమై రెండు రోజులుగా పంచాయితీ జరుగుతుంది. గడువుకు సోమవారం చివరి రోజు కావడంతో చేసేదిలేక సాల్మన్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గ్రహించిన చిన్న కుమార్తె ఏంజెల్ బిగ్గరగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. ఈమేరకు అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. అయితే దీనిపై బాధితుడి సోదరి దయమ్మ మాట్లాడుతూ హెప్సిబా వేధింపులకు గతంలోనే చిన్న తమ్ముడు సామ్యేల్ రైలు కిందపడి మృతిచెందినట్లు ఆరోపించారు. బాపట్లకు చెందిన తులసి అనే వ్యక్తిని తీసుకువచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. ఇప్పుడు ఇంకో తమ్ముడిని వేధిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎంపీడీవోగా రామాంజనేయులు

పంగులూరు, ఆగస్టు 12 : జె.పంగులూరు ఎంపీడీవోగా బి.రామాంజనేయులు నియమితులయ్యారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళ్లిన బి.రామాంజనేయులును తిరిగి జె.పంగులూరుకు నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు వచ్చినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రమేష్ బాబు తెలిపారు.



అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ పార్వతి

సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తాం

తహసీల్దార్ పార్వతి

వేటపాలెం(చీరాల), ఆగస్టు 12 : ప్రజల సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని తహసీల్దార్ పార్వతి చెప్పారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా అర్జీలు స్వీకరించారు. మొత్తం ఆరు అర్జీలు అందాయని తెలిపారు. వాటిలో కొలత కోసం 1, కేస్ట్ సర్టిఫికెట్ 1, స్థలం ఆక్రమణ 1, ఇందిరమ్మ గృహాలు డామేజీ 1, పెన్షన్ కోసం 1, దేవస్థాన స్థలం ఆక్రమణకు సంబంధించి 1 మొత్తం ఆరు అర్జీలు అందాయని వివరించారు. వాటిని పరిశీలించి నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమానికి పలుశాఖల అధికారులు గైర్హాజరయ్యారు.

ఎంపీడీవోకు సత్కారం



ఎంపీడీవోను సన్మానిస్తున్న ఉద్యోగులు

బల్లికురవ, ఆగస్టు 12 : ఎంపీడీవోగా పనిచేసి గుంటూరు జిల్లాకు బదిలీపై వెళుతున్న హనుమారెడ్డిని సోమవారం కార్యాలయ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. సార్వత్రిక ఎన్నికల విధులలో భాగంగా ఆయన గుంటూరు జిల్లా ఇక్కడకు వచ్చారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తిరిగి గుంటూరు జిల్లాకు వెళుతుండగా కార్యాలయ ఉద్యోగులు ఆయనకు ఘన వీడ్కోలు పలికారు. కాగా బల్లికురవ ఎంపీడీవోగా కార్యాలయ ఏవో రాంబాబుకు బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీలక్ష్మి, ఈవోపీఆర్డీ సుమతి, సీనియర్ అసిస్టెంట్ సీహెచ్‌వై కోటేశ్వరరావు, (బుజ్జి) ఏఈ హనుమంతురావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చినగంజాం ఎంపీడీవోగా స్వరూపరాణి

చినగంజాం, ఆగస్టు 12 : చినగంజాం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కే.స్వరూపరాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అమృతలూరులో పని చేస్తూ బదిలీపై చినగంజాం వచ్చారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆమె చినగంజాం నుంచి బదిలీపై అమృతలూరు వెళ్లారు. ఇన్‌చార్జి ఎంపీడీవోగా పని చేస్తున్న ఈవోపీఆర్డీ ఎన్.వేణుగోపాలకృష్ణమూర్తి నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.



అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ పార్వతి

ఈ-పంట నమోదు పరిశీలన

మార్టూరు, ఆగస్టు 12 : మండలంలో జరుగుతున్న ఈ పంట నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఏడీఏ కే శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్ పరిశీలించారు. అందులో భాగంగా మార్టూరు గ్రామంలో లంబాడీ తాండాలో సూర్యానాయక్‌కు చెందిన మొక్కజొన్న పంట నమోదును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కౌలు రైతులు వీఆర్వో ద్వారా కౌలు గుర్తింపు కార్డులను పొందాలని, అనంతరం కౌలు రైతు పేరుతో పంట నమోదు చేయించుకోవాలన్నారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాలలో గత నాలుగురోజుల నుంచి ఈ పంట నమోదు కార్యక్రమం జరుగుతున్నదన్నారు. పంట నమోదు ఆధారంగానే ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్, పంటలు కొనుగోలు మొదలైనవి అమలు చేస్తారన్నారు. కార్యక్రమంలో వీహెచ్ఏ సువర్చల, పలువురు రైతులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయండి

సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు ప్రారంభమైన మూడు రోజుల శిక్షణ







అద్దంకిలో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, ఇంకొల్లు, పంగులూరులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

అద్దంకిటౌన్, ఆగస్టు 12 : గ్రామ పంచాయతీ పరిపాలనలో భాగంగా నిర్వహించాల్సిన విధులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు చేయాల్సిన పనులపై అవగాహన ఉండాలని ఇన్‌చార్జి డీఎల్‌పీవో, ఈవోపీఆర్డీ డీ హనుమంతరావు తెలిపారు. సోమవారం అద్దంకి ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ హాలులో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఆర్‌జీఎస్ఏ కార్యాచరణ ప్రణాళిక 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ముందుగా మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. తొలిరోజు చక్రాయపాలెం, పేరాయపాలెం పంచాయతీ కార్యదర్శులు పి.నాగేశ్వరరావు, ఏ.నాగేశ్వరరావు పంచాయతీ రాజ్ చట్టం, విధులపై మాట్లాడారు. ప్రజల ఆరోగ్యం, పారిశుధ్యం, చెత్త సేకరణ, వర్మీకంపోస్టు తయారీ తదితర అంశాలు, డ్వాక్రా సంఘాలు, ప్రజల భాగస్వామ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బల్లికురవ, ఆగస్టు 12 : పరిసరాల పరిశుభ్రత పాటించి స్వచ్ఛ గ్రామాలుగా ఉండేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రాంబాబు కోరారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో శానిటేషన్, చెత్త సంపద కేంద్రాలపై పంచాయతీ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా గ్రామాలలో పారిశుధ్యం మెరుగుదలకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అనంతరం అధికారులు మాట్లాడుతు ప్రజా ప్రతినిధులు అధికారులు సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం శానిటేషన్, చెత్త సంపద కేంద్రాలకు నిధులను విడుదల చేస్తుందని తెలిపారు. శిక్షణలో ఎంపీపీ శ్రీలక్ష్మి, ఈవోపీఆర్డీ సుమతి, పీ ఆర్ ఏఈ హనుమంతురావు, సీడీపీవో సుధ పాల్గొన్నారు.

పంగులూరు : గ్రామాల అభివృద్ధికి 100 రోజుల ప్రణాళికను సిద్ధం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో తానికొండ రమేష్‌బాబు సూచించారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల మూడు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ తేళ్ల నాగమ్మ ప్రారంభించారు. ఈవోపీఆర్డీ రాంబాబు మాట్లాడుతూ పంచాయతీలలో ఏఏ పనులకు ఎంత నిధులు వినియోగించాలో శాఖా పరమైన నిబంధనలున్నాయని, వాటికి అనుగుణంగా ప్రణాళిక రూపొందించి, సంబంధిత అధికారుల ఆమోదం పొందాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాసరెడ్డి, పీఆర్ ఏఈ రామ్‌కుమార్, సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం, పలు గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పర్చూరు : అన్ని గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీ (డంపింగ్ యార్డు)లను వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీవో ప్రత్యూష్‌కుమార్ సూచించారు. సోమవారం జరిగిన సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో గ్రామాలో క్లీన్ గ్రీన్ పనులను వివరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు

ఇంకొల్లు : ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఇన్‌చార్జి ఎంపీడీవో, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై అవగాహన కల్పించారు. ఇంకొల్లు,దుద్దుకూరు, పావులూరు, ఇడుపులపాడు, పూసపాడు గ్రామ సర్పంచ్‌లతో సర్పంచ్‌లు, కార్యదర్శులు హాజరయ్యారు.

చినగంజాం : గ్రామ పంచాయతీలకు వచ్చే ఆదాయ మార్గాలపై దృష్టి పెట్టాలని శిక్షణ కోర్సు డైరెక్టర్ కే.స్వరూపరాణి, అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వేణుగోపాలకృష్ణమూర్తి గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు సూచించారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాల్‌లో సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు పలు అంశాలపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. మొదటి రోజు గ్రామ పంచాయతీల పరిపాలన, పారిశుధ్యం, చెత్త సంపద కేంద్రాల షెడ్లు, నిర్వహణ, గ్రామ పంచాయతీలను తనిఖీ చేసే అధికారులు, వారి విధులు తదితర విషయాలపై మండల రిసోర్సు పర్సన్‌లు ఎన్.సూర్యనారాయణ, ఎ.మస్తాన్‌రావు, నాగేంద్రబాబు, నారాయణ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, ఏపీవో, ఏపీఎం, పంచాయతీ రాజ్ ఏఈ, చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

మార్టూరు : గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ విధులు, బాధ్యతలపై అవగాహన ఉన్నప్పుడే ప్రజా సమస్యలు పరిష్కరించగలరని ఎంపీడీవో జీనితిన్ అన్నారు. సోమారం సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఎం పీడీవో కార్యాలయంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో, ఈవోఆర్డీ బొంతా సుబ్బారావు ప్రసగించారు.

గ్రావెల్ తవ్వకాలను నిలిపివేసిన మైనింగ్ అధికారులు

మార్టూరు, ఆగస్టు 12 : నాగరాజుపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలను సోమవారం మైనింగ్, రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు పరిశీలించారు. అనంతరం గ్రావెల్ తవ్వకాలను నిలిపివేయించారు. నాలుగు టిప్పర్లను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న భూములు అటవీ భూములు పరిధిలో లేవని ఫారెస్ట్ అధికారులు స్పష్టం చేశారు. అనంతరం ద్రోణాదులలో గ్రావెల్ కొండ ప్రాంతాన్ని మైనింగ్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఈ కొండలో గ్రావెల్ తవ్వకాలు జరగడంలేదని వెళ్లిపోయారు. కార్యక్రమంలో ఆర్‌డీవో గంధం రవీందర్, తహసీల్దార్ టి ప్రశాంతి, ఫారెస్ట్ అధికారులు జాన్సన్, రమేష్, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.



కేంద్రానికి సామగ్రిని అందజేస్తున్న దాత శ్రీనివాసరెడ్డి

అంగన్‌వాడీకి స్టీల్ సామగ్రి బహూకరణ

అద్దంకిటౌన్, ఆగస్టు 12: అద్దంకి పట్టణంలోని గౌడపాలెం అంగన్‌వాడీ కేంద్రానికి దాత శ్రీనివాసరెడ్డి కుక్కర్, స్టీల్ బిందె, గ్లాసులను బహూకరించారు. సోమవారం మండలంలోని మణికేశ్వరం గ్రామానికి చెందిన మాజీ మండల ఉపాధ్యక్షుడు ఈదా అంజిరెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా కుమారుడు, మాజీ సర్పంచ్ ఈదా శ్రీనివాసరెడ్డి పట్టణంలోని గౌడపాలెం అంగన్‌వాడీ కేంద్రానికి కుక్కర్, స్టీలు బిందె, గ్లాసులు అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు హుస్సేన్ బాషా, వెంకటేశ్వరరావు, టైలర్ మీరావలి, అంగన్‌వాడీ టీచర్ పార్వతి పాల్గొన్నారు.



తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామిని మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, అనగాని సత్యప్రసాద్ సోమవారం దర్శించుకున్నారు.
- అద్దంకి




సదస్సులో పాల్గొన్న డాక్టర్‌లు, పోలీస్ అధికారులు

హెచ్ఐవీపై అవగాహన అవసరం

మేదరమెట్ల, ఆగస్టు 12 : హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిఖిలారెడ్డి తెలిపారు. సోమవారం మేదరమెట్లలో ఎయిడ్స్ నివారణ సంస్థ, హెల్ప్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిఖిలారెడ్డి మత్తు పదార్థాల వాడకంతో కలిగే ఆరోగ్య సమస్యలను వివరించారు. పాఠశాలలు, కళాశాలలో, గ్రామ స్థాయి మహిళా మండలి సమావేశాలలో హెచ్ఐవీ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను తెలియజేయాలన్నారు. వ్యాధి సోకిని వారి వివరాలు గోప్యంగా ఉంచాలని డాక్టర్ చిట్టిబాబు తెలిపారు. ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో అద్దంకి, మేదరమెట్ల, కొరిశపాడు మండలాల్లోని ఆశావర్కర్‌లు, ఏఎన్ఎంలు, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ మనోజ్, డాక్టర్ హర్ష, హెల్ప్ టీఐలు భార్గవ్, ఆరోగ్య సిబ్బంది, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మైనార్టీ నాయకులు

చీరాలటౌన్, ఆగస్టు 12 : ఈపూరుపాలెంలో హత్య ఘటనపై ముస్లిం మైనార్టీ ప్రతినిధులు సోమవారం ప్రజావేదిక కార్యక్రమంలో కలెక్టర్ వెంకటమురళిని కలిశారు. ఘటనను స్వయంగా వివరించారు. అతి కిరాతకంగా హతుడు మృతిచెందినట్లు వేదన చెందారు. చీరాల్లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేట్టాలని విన్నవించారు. అంతేకాకుండా కేసు విచారణ పారదర్శకంగా జరగాలని కోరారు. అనంతరం ఎస్పీని కలిసిన నాయకులు మంగళవారం డీజీపీని కలిసేందుకు వెళుతున్నట్లు తెలిపారు.



16 నుంచి రెవెన్యూ సదస్సులు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం); ఆగస్టు 12 : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15 నుంచి రెవెన్యూ సదస్సులను లాంఛనంగా ప్రారంభించనున్నదని, జిల్లాలో మాత్రం ఈనెల 16 నుంచి ప్రారంభిస్తామని కలెక్టర్ ఓ ఆనంద్ చెప్పారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సబ్‌కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో మాట్లాడారు. సెప్టెంబరు 30 వరకు ఈ సదస్సులు జరుగుతాయని చెప్పారు. రెవెన్యూలో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ల మంజూరు చేస్తామన్నారు. మ్యూటేషన్ ట్రాన్సాక్షన్లపై తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఎలాంటి కారణాలు లేకుండా దరఖాస్తులను తిరస్కరిం చవద్దని తెలిపారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని సూచించా రు. మంచి నీటి ట్యాంకులను శుభ్రపరచాలన్నారు. చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డు లు వెంటనే అందించాలన్నారు. ఎస్టీలకు బర్త్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాల కు బిల్లులను ప్రభుత్వం చెల్లింపులు చేస్తున్నదని చెప్పారు. కూలీలకు ఉపాధిహామీ పనిదినాలు పెంచాలన్నారు. పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు చేయించాలని తెలిపారు. ఈ సమావేశంలో జేసీ సూర్యతేజ, డీఆర్వో లవన్న తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

పొదలకూరు, ఆగస్టు 12 : పంచాయతీ నిధులు స్వాహా చేసిన పొదలకూరు మండలం ప్రభగిరిపట్నం పంచాయతీ సెక్రటరీ పుష్పలతను జిల్లా అధికారులు సస్పెం డ్ చేశారు. సుమారు రూ.35లక్షలను ఆమె గోల్‌మాల్ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. ఈ విషయమై గ్రామస్థులు లోకాయుక్తను ఆశ్రయించారని, లోకాయుక్త ఆదేశాలతో జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపారని వివరించారు. నిధుల స్వాహా చేసింది నిజమేనని తేలడంతో పంచాయతీ సెక్రటరీని సస్పెం డ్ చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రతి కౌలు రైతుకు సీసీఆర్‌సీ

- నూరుశాతం పంపిణీకి ప్రభుత్వం చర్యలు
- ఇప్పటికే 65శాతానికి పైగా మంజూరు
- రైతన్నలను ఆదుకునే దిశగా అడుగులు

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 12 : కౌలు రైతులకు అండగా నిలవాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ప్రభుత్వ ఆర్థిక సహాయం, సున్నా వడ్డీ పంట రుణాలు, రాయితీ, పంటల బీమా వంటి పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రతి కౌలు రైతుకు పంట సాగుదారుపత్రం (సీసీఆర్‌సీ) ఇవ్వాలని నిర్ణయించి ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించింది.

● 50 వేలమంది కౌలు రైతులు

జిల్లాలో సుమారుగా 50 వేలమంది వరకు కౌలు రైతులు ఉన్నారు. వీరంతా వ్యవసాయ, ఉద్యాన, వాణిజ్య పంటలను సాగుచేసుకుంటున్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో ఎంతోమంది అర్హులైన రైతులకు సీసీఆర్‌సీ అందలేదు. కారణం ఈ-పంటలో నమోదు కాకపోవడమే. దీంతో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, పంట దిగుబడులు తగ్గినప్పుడు వీరంతా తీవ్రంగా నష్టపోతున్నారు. అప్పులు చేసి పంటలు సాగుచేసిన వారంతా అప్పులు తీర్చలేక నానాఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం వారికి భరోసా ఇచ్చేలా చర్యలు తీసుకుంటోంది. ప్రతిఒక్కరికీ సీసీఆర్‌సీ అందించాలని ఆదేశాలు జారీ చేసింది.

● 11నెలల కాలపరిమితి..

భూయజమానికి, పంటల సాగుదారుడికి 11నెలల పాటు ఒప్పందం కుదిర్చేదే సీసీఆర్‌సీ. దీనికోసం కౌలుకు పంటలు సాగుచేసే రైతులు ఆయా గ్రామ రెవెన్యూ అధికారి(వీఆర్వో) కి దరఖాస్తు ఇవ్వాలి. అనంతరం మూడు రోజుల్లోనే సీసీఆర్‌సీ అందచేస్తారు. అయితే కొన్ని సందర్భాల్లో భూయజమాని ఇందుకు ఒప్పుకోకపోతే రైతు సేవా కేంద్రాల ద్వారా ఈ-పంటలో నమోదు చేసుకునే అవకాశం ఉంది. తద్వారా ప్రభుత్వం అందించే అన్నీ ప్రయోజనాలు అందుతాయి. దేవదాయశాఖ భూములు సాగు చేసుకనే వారు కూడా ఇందుకు అర్హులే..

● నూరుశాతం పంపిణీ దిశగా చర్యలు

జిల్లాలో దాదాపు ఐదు లక్షల ఎకరాల్లో వరితోపాటు వివిధ పంటలు సాగవుతున్నాయి. సుమారుగా 3,77,000 మంది వ్యవసాయ భూమి ఉన్న రైతులు ఉన్నారు. భూమిలేని రైతులు 50వేల మంది వరకు ఉన్నట్లు అంచనా. ఈనేపథ్యంలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు ఇప్పటికే గ్రామాల్లో పర్యటిస్తూ కౌలుదారులను గుర్తించి వారికి సీసీఆర్‌సీ మంజూరు చేస్తున్నారు. ఎగువ నుంచి వరద నీరు సోమశిలకు చేరుకుంటోంది. దీంతో రానున్న రబీ సీజన్‌లో పంటలసాగు అధికారుల అంచనాలకు మించి జరిగే అవకాశం ఉంది. దీంతో ఇప్పటి నుంచే యజమానులు, కౌలుదారులతో ఒప్పందాలు చేయించే కార్యక్రమాలు వేగంగా సాగుతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో



38,330 మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కాగా ఇప్పటి వరకు 24,817 కార్డులు మంజూరు చేశారు. దాదాపు 65శాతానికిపైగా లక్ష్యాన్ని చేరుకున్నారు. మిగిలిన 13,513 కార్డులను రబీ సీజన్ ప్రారంభానికి ముందే అందించే దిశగా అధికార యంత్రాంగం పనిచేస్తోంది.

రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలి



సీసీఆర్‌సీ కోసం కౌలు రైతులు ఆయా గ్రామాల రెవెన్యూ, వ్యవసాయ అధికారులను సంప్రదించాలి. జిల్లాలో ఇప్పటికే దాదాపు 65శాతం సీసీఆర్‌సీలు మంజూరు చేశాం. నెలాఖరులోగా నూరుశాతం అందించేందుకు అన్నీ చర్యలు తీసుకుంటున్నాం. ఏమైనా అనుమానాలుంటే రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ అధికారులను సంప్రదించాలి.

- సత్యవాణి,
జిల్లా వ్యవసాయాధికారి

ఫలితమివ్వని ఫైబర్ నెట్

- ప్రజల కలల ప్రాజెక్టుకు బ్రేకులు
- వైసీపీ పాలనలో వ్యవస్థ నిర్వీర్యం

మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల జీవన ప్రమాణాల్లోనూ మార్పులు తీసుకురావాలని గత టీడీపీ ప్రభుత్వం భావించింది. అందుకు అనుగుణంగా 'ఏపీ ఫైబర్ నెట్' ప్రాజెక్టును ప్రారంభించింది. అతి తక్కువ ధరకే ఇంటర్నెట్, కేబుల్ కనెక్షన్ ఇచ్చేలా ఈ ప్రాజెక్టును రూపొందించింది. ప్రజల కలల ప్రాజెక్టుగా మారిన ఏపీ ఫైబర్ నెట్‌ను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. జిల్లాలో ఈ ప్రాజెక్టును ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడంతో వారి అవినీతి, నిర్లక్ష్యం కారణంగా ప్రాభవం కోల్పోయింది.



- భారీగా తగ్గిన కనెక్షన్లు
- 2019లో 86 వేలు ఉండగా, నేడు 26 వేలు
- సకాలంలో సేవలు అందించకపోవడమే కారణం
- స్కూళ్లకు కూడా ఇవ్వని కనెక్షన్లు
- ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో కునారిల్లిన సంస్థ

నెల్లూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఇంటర్నెట్, కేబుల్ కనెక్షన్ కలిపి తీసుకోవాలంటే ఏ ప్రైవేటు ఆపరేటర్ అయినా కనీసం రూ.500కు తక్కువ వసూలు చేయడం లేదు. జిల్లాలో పేరుమోసిన ఆపరేటర్లు ఒక్క కేబుల్ కనెక్షన్‌కే నెలకు రూ.330 వసూలు చేస్తున్నారు. ఇందుకు అదనంగా ఇంటర్నెట్ కనెక్షన్ అంటే మరో రూ.300పైనే చెల్లించాల్సి ఉంది. అయితే ఈ రెండింటినీ ప్రస్తుతం ఏపీ ఫైబర్ నెట్ కింద రూ.350 కే అందిస్తున్నారు. ఇంత తక్కువ ధర అయినా ప్రజలు ఎందుకు ప్రభుత్వ సర్వీసును తీసుకోవడం లేదంటే, అందుకు అనేక ప్రశ్నలు తెరముందుకు వస్తున్నాయి. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభమైన ఏపీ ఫైబర్ నెట్ సేవలు జిల్లాలో అనతికాలంలోనే విస్తరించాయి. 2019 ఎన్నికల సమయం నాటికి ఉమ్మడి జిల్లాలో ఈ కనెక్షన్లు 86 వేలకు పెరిగాయి. అయితే ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వంలో ఏపీ ఫైబర్ నెట్‌ను నిర్లక్ష్యం చేసింది. దీన్ని దోపిడీకి కేరాఫ్‌గా మార్చింది. దీంతో జిల్లాలో క్రమేణా కనెక్షన్ల సంఖ్య తగ్గుతూ వచ్చింది. ప్రస్తుత విభజిత జిల్లాలో 16 వేల కనెక్షన్లు మాత్రమే ఉన్నాయి. ఉమ్మడి జిల్లాను కలుపుకున్నప్పటికీ 26 వేలకు మించి లేవని లెక్కలు చెబుతున్నాయి. గత ఐదేళ్లలో కనెక్షన్లు పెరగాల్సింది పోయి భారీగా తగ్గిపోయాయి.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల చేతుల్లో నిర్వీర్యం

ఏపీ ఫైబర్‌నెట్ ప్రాజెక్టులో భారీగా అక్రమాలు జరిగాయని ఎన్డీయే ప్రభుత్వం గుర్తించింది. ప్రస్తుతం అమరావతిలోని ప్రధాన కార్యాలయంలో విచారణ కూడా జరుగుతోంది. అదే సమయంలో జిల్లాలోనూ అక్రమాలు జరిగినట్లు ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. ఇంత పెద్ద వ్యవస్థను జిల్లాలో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది చేతుల్లో పెట్టారు. ఒక్కరంటే ఒక్కరు కూడా రెగ్యులర్ ఉద్యోగి లేరంటే అతిశయోక్తి కాదు. వీరి నియామకం కూడా దొడ్డిదారిన జరిగినట్లు ఆరోపణలున్నాయి. ప్రస్తుతం జిల్లా వ్యవహారాలను చూస్తున్న ఓ ఉద్యోగిపై అవినీతి ఆరోపణలు రావడంతో ఎన్నికలకు ముందు ఉద్యోగంలో నుంచి తొలగించారు. అయితే ఎన్నికల సమయంలో మళ్లీ అదే ఉద్యోగిని తీసుకొచ్చి మళ్లీ అదే స్థానంలో కూర్చోబెట్టడమే ఇందుకు నిదర్శనమని ఆ ప్రాజెక్టు వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఇలా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులంతా సొంత అవసరాలు చూసుకున్నా రు తప్ప సక్రమంగా విధులు నిర్వహించలేదని, అదే జిల్లాలో ఏపీ ఫైబర్ నెట్ కునారిల్లిపోవడా నికి ప్రధాన కారణమన్న అభిప్రాయాలు వ్యక్త మవుతున్నాయి. సర్వీసులో ఎక్కడైనా సమస్య తలెత్తితే ఒక పట్టాన ఆ సమస్యను పరిష్కరించరని,దీంతో కస్టమర్లు విసుగు చెంది ఒక్కొక్కరుగా దూరమవుతున్నారని తెలుస్తోంది.

> **పాఠశాలలకు కనెక్షన్లు ఇచ్చాం**
>
> ఏపీ ఫైబర్ నెట్ సేవల్లో ఎటువంటి ఇబ్బందులు లేవు. ఎక్కడ ప్రాబ్లమ్ వచ్చినా వెంటనే పరిష్కరిస్తున్నాం. కనెక్షన్లు 2019తో పోలిస్తే తగ్గాయి. పాఠశాలన్నింటికీ ఇంటర్నెట్ కనెక్షన్లు ఇచ్చాం. ఇంకా ఎక్కడైనా ఇవ్వాల్సి ఉంటే పరిశీలించి ఇస్తాం.
>
> **- అశోక్ కుమార్, ఏపీ ఫైబర్ నెట్ జిల్లా నెట్‌వర్క్ మేనేజర్**

విద్యార్థులతోనూ ఆటలు



పాఠశాలల్లో విద్యార్థులకు డిజిటల్ బోధన ద్వారా పాఠాలు చెప్పాలని ప్రభుత్వం భావించింది. ఆ క్రమంలో ప్రతీ పాఠశాలలో టీవీను ఏర్పాటు చేసి దానికి ఏపీ ఫైబర్ నెట్ ద్వారా ఇంటర్నెట్ కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. చాలా పాఠశాలలకు రెండేళ్ల క్రితమే టీవీలను అందించారు. కొన్నింటికి ఏడాది క్రితం టీవీలు బిగించారు. కానీ ఇప్పటికీ ఇంటర్నెట్ సేవలను మాత్రం అందించలేదు. ఈ కనెక్షన్లు ఇచ్చే ప్రక్రియలో కూడా అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. పాఠశాలలకు కనెక్షన్లు ఇవ్వకుండానే ఇచ్చినట్లు కొన్ని చోట్ల రికార్డు చేసి బిల్లులు తినేసినట్లు ఆరోపణలున్నాయి. ప్రభుత్వం నుంచి వచ్చిన ఇంటర్నెట్ సామగ్రిని కూడా పక్కదారి పట్టించాలని కుట్రలు చేసినట్లు తెలుస్తోంది. కానీ వైసీపీ ప్రభుత్వం మారి ఎన్డీయే ప్రభుత్వం రావడంతో ఆ కుట్రకు బ్రేక్ పడినట్లు చెప్పుకుంటున్నారు. గడిచిన పది రోజులుగా ఇంటర్నెట్ కనెక్షన్లకు సంబంధించిన సామగ్రి ఎంఈవో కార్యాలయాలు, పాఠశాలలకు చేరుతోంది. అయితే ఏపీ ఫైబర్ నెట్ ఉద్యోగులు మాత్రం పాఠశాలలకు కనెక్షన్లు ఇచ్చినట్లు చెబుతుండడం గమనార్హం.

జిల్లాలో ఎక్కడ సమస్య వచ్చినా పరిష్కరించడానికి ఎనిమిది టెక్నికల్ వాహనాలు ఉన్నాయి. అయితే ఇవన్నీ పేపర్ల మీదనే ఉంటాయని, వాస్తవానికి ఒకటి, రెండు వాహనాలతోనే నెట్టుకొస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కానీ నెల నెలా బిల్లులు మాత్రం అన్ని వాహనాలకు పెడుతూ రూ.లక్షలు దోచుకుతింటున్నారన్న ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. అదే సమయంలో కనెక్షన్లు కూడా తక్కువగా చూపించి ఆ బిల్లులను తినేసినట్లు అధికారులు చెప్పడంతో ఇటీవల ఓ సమావేశంలో స్వయంగా సీఎం చంద్రబాబు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. కనెక్షన్లు పెంచకుండా తగ్గించుకుంటూ వెళ్లడంలో మరో మతలబు కూడా ఉందని ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్టులో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు ప్రైవేటు ఆపరేటర్లతో కుమ్మక్కై ఉద్దేశపూర్వకంగా కస్టమర్ దూరమయ్యేలా వ్యవహరిస్తున్నారన్న

అపరాధ రుసుము రద్దయినా..

- పొగాకు ధర ధమాల్
- సగటున క్వింటంకు రూ. 4వేలు పతనం
- అనధికార కొనుగోళ్లలో వ్యాపారుల చేతివాటం
- నామమాత్రపు బేళ్లకే అధిక ధర



కందుకూరు, ఆగస్టు 12: ప్రజాప్రతినిధులు, బోర్డు ఉన్నతాధికారులు విశ్వప్రయత్నం చేసి, రైతులు అదనంగా పండించిన పొగాకుకు అపరాధ రుసుము రద్దు చేయించినా ప్రయోజనం లేకుండా పోయింది. అపరాధ రుసుము రద్దుతో తమకు మేలుజరుగుతుందన్న రైతుల ఆనందం ఆవిరైంది. అనధికార పొగాకు కొనుగోళ్లు ప్రారంభించినప్పటి నుంచి వ్యాపారులు మాయాజాలంతో ధరలు దిగజార్చారు. దీంతో అపరాధ రుసుము రద్దు వల్ల చేకూరే ప్రయోజనం రైతులకా... లేక వ్యాపారులకా...? అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కేంద్ర వాణిజ్యపన్నుల శాఖామంత్రి పీయూష్ గోయల్‌పై మన రాష్ట్ర ఎంపీలు, పొగాకుబోర్డు ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లు ఒత్తిడితెచ్చి అనధికార పొగాకుకు సాధారణంగా వసూలు చేసే అపరాధ రుసుమును రద్దుచేయించారు. అపరాధ రుసుము ప్రతిఏటా రద్దుచేస్తూపోతే పొగాకుబోర్డు నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందన్న ఆలోచనతో కేంద్రప్రభుత్వం కొంత సంశయించినా, రాష్ట్రప్రభుత్వం నుంచి వచ్చిన ఒత్తిడితో చివరికి రైతులకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో సుమారు 40 రోజులపాటు వేలం కేంద్రాల్లో కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఇటీవలే అనధికార పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. మరుసటి రోజు నుంచే మార్కెట్లో ధరల క్షీణత ప్రారంభమైంది. కందుకూరు-2 వేలం కేంద్రాలతోపాటు అనధికార పొగాకు కొనుగోళ్లు జరుగుతున్న అన్ని వేలం కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితిజ అపరాధ రుసుము ఐదుశాతం అనుకున్నా క్వింటాకు రూ.2వేల వరకు రైతులకు లబ్ధి చేకూరుతుందని ఆశించారు. అయితే అనూహ్యంగా వ్యాపారులు క్వింటాకు రూ. 4వేల వరకు ధరలను దిగజార్చారు. పొగాకు వ్యాపారంలో గుత్తాధిపత్యం వహిస్తున్న ప్రధాన కంపెనీలు సిండికేట్‌గా మారి ధరల్లో మాయాజాలం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

> **అధిక ధరల్లో కోత**
>
> అధికారిక పొగాకు అమ్మకాల చివరి రోజుల్లో వ్యాపారులు పోటీపడి కొనుగోళ్లు చేయటం ద్వారా రోజుకోరీతిలో ధర పెంచారు. నాణ్యమైన పొగాకుకు క్వింటాకు రూ. 36,700 వరకు చెల్లించేందుకు కూడా వ్యాపారులు సిద్ధపడ్డారు. అయితే ప్రస్తుతం నాణ్యమైన పొగాకుకు కూడా క్వింటాకు రూ. 35,800కు మించి చెల్లించేందుకు వ్యాపారులు ముందుకు రావటం లేదు. ఆ ధరను కూడా అతితక్కువ బేళ్లకు మాత్రమే ఇస్తూ మీడియం గ్రేడ్‌లు, లోగ్రేడ్‌లకు ధరలను మరింత దిగజార్చారు.

సోమశిల క్రస్ట్‌గేట్లు భద్రమేనా?

జిల్లా వరప్రదాయిని అయిన సోమశిల జలాశయం క్రస్ట్‌గేట్లు భద్రమేనా? అని జలవనరులశాఖ నిపుణులు సైతం నేడు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటకలోని తుంగభద్ర ప్రాజెక్టు 19వ నెంబరు క్రస్ట్‌గేట్ శనివారం రాత్రి వరద తాకిడికి కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సోమశిల క్రస్ట్‌గేట్ల నిర్వహణపై ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. గత కొన్ని రోజులుగా శ్రీశైలం నుంచి కృష్ణా జలాల రాక కొనసాగుతోంది. రోజురోజుకు ప్రవాహ ఉధృతి కనిపిస్తోంది. ప్రస్తుతం 15 వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. దీనికితోడు ఎగువన వర్షాలు కురిస్తే ప్రవాహం మరింత పెరిగే సూచనలు ఉన్నాయి.

- తుంగభద్ర ఘటనతో అనుమానాలు
- ఎగువ నుంచి కొనసాగుతున్న వరద
- 11,12 క్రస్ట్‌గేట్లపై సందిగ్ధం
- ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిన వైసీపీ ప్రభుత్వం



సోమశిల జలాశయం క్రస్ట్‌గేటుకు ఉన్న పాతరోప్



గేట్ల నుంచి కొనసాగుతున్న లీకేజీ (ఫైల్)

అనంతసాగరం, ఆగస్టు 12: సోమశిల ప్రాజెక్టు నిర్వహణను గత వైసీపీ పాలనలో పట్టించుకున్న దాఖలాలు లేవు. జలాశయం గేట్లకు గ్రీజు పూసేందుకు కూడా నిధులు విడుదల చేయని దుస్థితి. ప్రాజెక్టుకు 12 క్రస్ట్‌గేట్లు ఉండగా, జలాశయ నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన రోప్‌లతో నేటికీ కాలం గడుపుతున్నారు. వాటిని మార్చి ఆధునికీకరణ పనులు చేయాలని గతంలో నిపుణుల కమిటీ సూచించినా పట్టించుకున్న దాఖలాలు లేవు. రోప్‌లను మెయింటెనెన్స్ చేయక కొన్ని గేట్లు మొరాయిస్తున్నాయి. ప్రస్తుతం 11, 12 నెంబర్ల క్రస్ట్‌గేట్ల తీరు ప్రశ్నార్థకంగా ఉంది. రోప్‌లు తప్పు పట్టి ఉన్నాయి. దీంతో వీటి నిర్వహణపై ఇంజనీర్లు ఆందోళన చెందుతున్నారు.

● ప్రభుత్వం చొరవ

సాగునీటి రంగంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోంది. ఇందులో భాగంగా గతనెల 14న మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు సోమశిలను సందర్శించారు. క్రస్ట్‌గేట్ల వ్యవస్థను చూసి నివ్వెరపోయారు. తుప్పుపట్టిన రోప్‌ల ఫొటోలను ప్రదర్శించి, ప్రాజెక్టు లోపాలను బయటపెట్టి వైసీపీ పాలనలో జరిగిన నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. అనంతరం ప్రాజెక్టు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి గేట్లను పటిష్ట పరిచేలా ఆదేశాలు ఇచ్చారు. దీంతో అధికారులు ఇటీవల గేట్ల మెయింటెనెన్స్ పనులను చేశారు. గేట్లన్నీ ఎత్తి ట్రయల్ రన్ నిర్వహించారు. రోప్‌ల వ్యవస్థను పటిష్ట పరిచేలా చేపట్టాల్సిన పనుల కోసం రూ 2.5 కోట్లకు ప్రతిపాదనలు కూడా పంపారు. కాగా, జలాశయం క్రస్ట్‌గేట్ల వ్యవస్థపై పట్టు కలిగిన ప్రత్యేక సిబ్బంది కూడా ఇక్కడ ఎంతో అవసరం. వీరి నియామకంపై ప్రభుత్వం శ్రద్ధ చూపాల్సి ఉంది.

ఎరువుల వినియోగంపై అవగాహన తప్పనిసరి

- కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి
- అన్నదాతకు అధికారుల సూచనలు

సీతారామపురం, ఆగస్టు 12: ఖరీఫ్, రబీ సీజన్‌లలో ఎరువులు, పురుగు మందుల వాడకం అధికంగా ఉంటుంది. ఇలాంటి సమయంలో మార్కెట్లోకి నకిలీ ఎరువులు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ సీజన్‌లో ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసే విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలనివారు సూచిస్తున్నారు. అజాగ్రత్తగా ఉంటే నిలువునా మోసపోయే అవకాశం ఉందన్నారు. నిషేధిత పురుగు మందులు కొనుగోలు చేస్తే నిలువునా మునిగి పోయినట్టే అంటున్నారు. పంట దిగుబడి అధికంగా వస్తుందని నమ్మించి కొంత మంది అనుమతి లేని కంపెనీల ఎరువులు, మందులు రైతులకు అంటగట్టే అవకాశం ఉంది. దుకాణాలలో తక్కువ ధరకే పురుగు మందులు ఎరువులు విక్రయిస్తున్నారని వాటిని కొనుగోలు చేయరాదు. అవి కంపెనీ మందులా.. లేక స్థానికంగా తయారు చేసి విక్రయిస్తున్నారా అనే విషయాలను రైతులు తెలుసుకోవాలి. ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసినపుడు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలి. లైసెన్స్‌లేని దుకాణాలు, దళారుల వద్ద కొనుగోలు చేయరాదు.

- అనుమతులు ఉండాలి

మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి

ప్రభుత్వ అనుమతి ఉన్న దుకాణాల్లోనే ఎరువులు, మందులు, విత్తనాలు కొనుగోలు చేయాలి. అవసరమైనవి కొనుగోలు చేసినట్లయితే తప్పనిసరిగా ఆ షాపు యజమాని సంతకం చేసిన బిల్లులను రైతులు తీసుకోవాలి. క్రిమి సంహారక మందులను కొనుగోలు చేసే సమయంలో డబ్బాపై ఉన్న వివరాలు పరిశీలించాలి. అర్థం కాకపోతే తెలిసిన వారికి చూపించాలి. మందులు పిచికారీ గురించి ముద్రించిన కరపత్రాలు తీసుకోవాలి. మందులు, విత్తనాలు కొనుగోలు చేసిన డబ్బాలు, సంచులను పంట దిగుబడి చేతికివచ్చేంత వరకు భద్రపరచాలి. ఒకవేళ నష్టం వస్తే సంబంధిత డీలర్‌పై కేసులు నమోదు చేయడానికి ఉపయోగపడతాయి.





సీతారామపురంలో విక్రయాలకు సిద్ధంగా పురుగు మందులు

సీఐ గంగాధర్‌రావుకు సన్మానం



సన్మానిస్తున్న టీడీపీ నేతలు

ఆత్మకూరు, ఆగస్టు 12 : స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్‌రావును సోమవారం టీడీపీ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ చల్లా రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నేతలు, మున్సిపల్ కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా సీఐని కలిసి సన్మానించారు. శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అందుకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. ముందుగా వారు తహసీల్దారు సుధీర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు కొత్తపల్లి రమేష్, కౌన్సిలర్లు మాదాల శ్రీనివాసులనాయుడు, షేక్ గౌస్‌బాషా, గందళ్ల వేణు, టీడీపీ నేతలు నలిశెట్టి శ్రీనివాసులు, కముజుల ప్రసాద్‌రెడ్డి, అంబటి నాగేశ్వరరావు, చల్లా మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

ఆత్మకూరు, ఆగస్టు 12: పట్టణంలోని 17వ వార్డుకు చెందిన షేక్ షర్మిల ఇటీవల ఆటో ప్రమాదానికి గురికావడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తి, ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితి నెలకుంది. విషయం తెలుసుకున్న వెంకటేశ్వర ప్రజావైద్యశాల ఎండీ డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్ వింజం దొరసానమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సోమవారం బాధితురాలి కుటుంబసభ్యులకు రూ.10వేలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కుమార్, డాక్టర్ వెంకట సందీప్, తేడేటి అశోక్ పాల్గొన్నారు.

సమావేశ మందిరం ప్రారంభం

ఆత్మకూరు, ఆగస్టు 12: మహిమలూరు పంచాయతీలోని కోటపాడులో నూతనంగా నిర్మించిన బీఆర్ అంబేడ్కర్ సమావేశ మందిరాన్ని సోమవారం సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్, ఏఎస్‌పేట మోడల్ స్కూల్, జూనియర్ కాలేజి జువాలజీ లెక్చరర్ గంధం వెంకటరామయ్య ప్రారంభించారు. గ్రామ ప్రజల అవసరనిమిత్తం మంది రాన్ని నిర్మించామన్నారు. అనంతరం టీడీపీ రాష్ట్ర కార్య దర్శి దావా పెంచలరావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి సేవలను కొనియాడారు. న్యాయవాది నం దా ఓబులేశు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల అధ్యక్షులు, అంబేడ్కర్ ఇండియా మిషన్ కార్యకర్తలు పాల్గొన్నా రు.

ఉన్నతాధికారుల ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరికుంటపాడు, ఆగస్టు 12: యర్రంరెడ్డిపల్లిలో పనిచేయని తాగునీటి పథకానికి సంబంధించి సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన పంచాయతీ నిధులు దుర్వినియోగం కథనానికి స్పందించిన డీఈ లక్ష్మణ్‌నాయక్, ఏఈలు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులతో పాటు సంబంధిత సిబ్బందితో మాట్లాడి త్వరితగతిన పనులు చేపట్టాలని సూచించినట్లు సమాచారం. విషయం బట్టబయలవడంతో గుమ్మడి కాయల దొంగ బుజాలు తడుముకున్నట్లు అన్న చందంగా తమకేమి సంబంధం లేదన్నట్లుగా ఉద్యోగులు మౌనవ్రతం పాటిస్తుండడం గమనార్హం. రంగంలోకి దిగిన ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు చేపట్టి తాగునీటి పథకానికి మరమ్మతులు చేయిస్తారో వేచి చూడాలి మరి.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు



హోటల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

వరికుంటపాడు, ఆగస్టు 12: మండలంలో ఎవరైనా సరే బెల్టు షాపులు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ తిరుపతయ్య హెచ్చరించారు. సోమవారం విరువూరుకు చెందిన కొంతమంది మహిళలు అందించిన ఫిర్యాదు మేరకు స్పందించిన ఆయన సిబ్బందితో విరువూరుతో పాటు సమీప కోటవర్తినిపల్లిలోని హోటళ్ళ, కిరాణ దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. పల్లెల్లో ప్రశాంత వాతా వరణానికి ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా సహక రించా లన్నారు. రాత్రి సమయంలో అమ్మకాలు జరుగకుండా సిబ్బందితో పహారా ఏర్పాటు చేస్తామన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

ఆత్మకూరు, ఆగస్టు 12: సర్పంచులు, కార్యదర్శులు గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ ఉషారాణి తెలిపారు. స్థానిక మండల కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన సర్పంచులు, కార్యదర్శులకు రిఫ్రెషర్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ.. గ్రామపంచాయతీ పాలన, సుస్థిరత అభివృద్ధి లక్ష్యాలు, పారిశుధ్య అంశాలపై వివరించారు. గ్రామాల్లో పారిశుధ్య మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ, చెత్త సేకరణ, పొడి, చెత్త వేరుచేయుట, వర్మీకంపోస్టు తయారీ, మార్కెటింగ్‌లో ఎస్‌హెచ్‌జీ సభ్యులు, ప్రజల భాగస్వామ్యంపై విపులీకరించారు. అభివృద్ధి ప్రణాళిక మేర పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముందుగా డ్రగ్ ఫ్రీ ఇండియా ప్రచారంలో భాగంగా అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీ షేక్ షఫీ, మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక మండల కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సర్పంచులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, ఈవోఎఆర్డీ భార్గవిలు అభివృద్ధి పనులను గురించి వివరించారు.

సంగం: స్థానిక మండల కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణా తరగతులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపి, డీఎల్‌పీఓ నారాయణరావు, తెలిపారు.

ఉదయగిరి రూరల్: స్థానిక స్త్రీశక్తి భవనంలో సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ, ఈవోపీఆర్డీ మల్లికార్జున, శిక్షకులు షేక్ కరీముల్లా, ఖాదర్‌కరీముల్లా, కార్యదర్శులు నాగూర్‌బీ, చంద్రశేఖర్, తేజ, ఆంజనేయులు, వీరేంద్ర, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

పని సర్దుబాటు కౌన్సెలింగ్ బహిష్కరణ



ఉదయగిరిలో ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 12: ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండలస్థాయి పని సర్దుబాటు కౌన్సెలింగ్‌ను సోమవారం ఉదయగిరిలో ఉపాధ్యాయులు బహిష్కరించారు. అనంతరం ఎంఈవో-2 తోట శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో సంఘం నాయకులు దస్తగిరిఅహ్మద్, షేక్‌ఎండీ ఖాజా, రామిరెడ్డి, మీనిగ ఫణిరాజ్, నల్లబో తుల రామకృష్ణ, షబ్బీర్, ఫయాజ్ పాల్గొన్నారు.

సీతారామపురం. ఆగస్టు 12: ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ అసంబద్ధంగా ఉండటం వలన ఉపాధ్యాయ సంఘాలు విజ్ఞప్తులను ఏ మాత్రం పరిగణలోకి తీసుకోకుండా ముందుకు వెళ్తున్న దరమిల ఫ్యాప్టో పని సర్దుబాటు ప్రక్రియను బహిష్కరిస్తున్నట్లుగా ఆ సంఘం మండల నాయకులు సోమవారం మండల విద్యాధికారి షేక్ మస్తాన్‌వలికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి గొడ్లవేటి వెం కటేశ్వర్లు, ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, దేవరాజు, మహేష్ పాల్గొన్నారు.

ఏఎస్ పేట: ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ అంతా అసంబద్ధంగా ఉండడంతో బహిష్కరించినట్లు ఫ్యాప్టో సంఘం నాయకులు తెలిపారు. సోమవారం వారు మండల విద్యాశాఖ అధికారిణి జ్యోతికి విన్నతిపత్రం అందజేశారు.

తహసీల్దారుకు డీలర్ల సన్మానం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 12: నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దారు ఎం.సుభద్రను సోమవారం కార్యాలయంలో మండల చౌకదుకాణాల డీలర్లు సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. డీలర్లు సకాలంలో డీడీలు చెల్లించి కార్డుదారులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని తహసీల్దారు సూచించారు. కార్యక్రమంలో చౌక దుకాణాల డీలర్లు ఖాదర్‌బాషా, ఏసుదాసు, ఫయాజ్, నాయబ్, ఆదాం, ఆరీఫా తదితరులు పాల్గొన్నారు.

జామాయిల్ చెట్ల నరికవేతకు అనుమతి ఉండాలి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 12: మండల రైతులు సాగు చేసిన జామాయిల్ చెట్ల నరికివేతకు అనుమతులు తప్పనిసరి అని తహసీల్దారు ఎం.సుభద్ర తెలిపారు. సోమవారం ఆమె ఈ విషయంపై విలేకరు లతో మాట్లాడారు. అసైన్డ్, సెటిల్‌మెంట్ పొలాల్లో సాగు చేసిన జామాయిల్ నరికివేతకు సంబంధిత వీఆర్వోకు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అనుమతి మంజూరు చేస్తామన్నారు. రైతులు సాగు చేసిన జామాయిల్ చెట్లను కొంతమంది అక్రమా ర్కులు గుట్టుచప్పుడు కాకుండా నరికి అక్రమ రవాణా చేస్తుండడంతో రైతుల ఫిర్యాదు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

విరివిగా రుణాలు అందిస్తాం

ఏఎస్ పేట, ఆగస్టు 12: అర్హులకు రుణాలందిస్తామని ఎన్‌డీసీసీ బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎస్.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన మండలకేంద్రంలోని ఎన్‌డీసీసీ బ్యాంక్‌ను తనిఖీ చేశారు. రూ.15లక్షలు అంత కంటే ఎక్కువ డిపాజిట్ చేస్తే అత్యధిక వడ్డీ అందజేస్తామన్నా రు. అనంతరం రాజవోలు సొ సైటీని తనిఖీ చేశారు. ప్యాక్ కంప్యూటరైజేషన్ వర్క్‌ను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పేట బ్రాంచ్ మేనేజరు సుబ్బారెడ్డి, సొసైటీ సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

రెవెన్యూలో విలీనం చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ వీఆర్వోలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 12: మండలంలో గ్రేడ్-2 గ్రామ రెవెన్యూ అధికారులుగా పనిచేస్తున్న తమను రెవెన్యూ శాఖలో విలీనం చేయాలని సోమవారం సచివాలయ వీఆర్వోలు తహసీల్దారు ఎం.సుభద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో తమకు కేటాయించిన జాబ్‌చార్ట్ ప్రకారం విధులు నిర్వహిస్తూ అదనంగా వ్యవసాయ, హౌసింగ్, పంచాయతీరాజ్ శాఖల విధులను కూడా నిర్వహిసున్నట్లు చెప్పారు. స్పందించిన తహసీల్దారు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు అంజాద్, వెంకట్, మస్తాన్, అనూష, దయానశ్రీ పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథన్ జయంతి



అనంతసాగరం, ఆగస్టు 12: స్థానిక ఉన్నత పాఠశాలలో సోమవారం గణిత, గ్రంథాలయ శాస్త్రవేత్త రామామృత రంగనాథన్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీ ప్రసన్న, గ్రంథపాలకుడు నారాయణరావు, హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

వరికుంటపాడు, ఆగస్టు 12: మండల తహసీల్దారుగా సోమవారం ఎస్ఎండీ హుసేన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడారు. ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

వెలుగోటితో కంభం భేటీ

వింజమూరు, ఆగస్టు 12: ఏపీఎన్‌జీజీఓఎస్ అధ్యక్షుడు వెలుగోటి మధును సోమవారం ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి దంతపతులు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వెలుగోటి మధు దంపతులు వారిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించి శాలువా, పూలమాలతో సన్మానించారు. వీరి భేటిలో 3 మండలాల ఉద్యోగులు సమస్యలు, వింజమూరు రాజకీయ అంశాలపై చర్చించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 12: దుత్తలూరు కొండపై వెలసిన రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాస సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారికి అభిషేకాలు చేసి విశేష అలంకరణలు చేపట్టారు. .

మెకానిక్‌ల అసోసియేషన్ ఎన్నిక

వింజమూరు, ఆగస్టు 12: మండల మెకానిక్ వర్క్స్ ఆటోమొబైల్స్ షాపులు నిర్వాహకులు నూతన యూనియన్‌ను ఏర్పాటు చేశారు. దానికి ద వింజమూరు ఆటో మొబైల్స్ డీలర్స్ టెక్నికల్ వర్స్ హెల్పర్ అసోసియేషన్ నామకరణం చేశారు. సోమవారం స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో బైక్ మెకానిక్‌లు, ట్రాక్టర్ మెకానిక్‌లు, ఆటో మొబైల్ షాపుల సభ్యులు, ఎలక్ట్రికల్స్, కొయ్యల దుకాణాలు వర్కర్స్, మెకానిక్‌లు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్

అక్రమాలపై చర్య తీసుకోవాలి

కావలి, ఆగస్టు 12: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కారవేదికకు కావలి డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి సమస్యలు పరిష్కారం కోరుతూ 8అర్జీలు వచ్చాయి. బీజేపీ పట్టణ అధ్యక్షుడు బ్రహ్మానందం ఆధ్వర్యంలో నేతలు డివిజన్‌లో జలజీవన్ మిషన్‌లో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి ఇంటికి కొళాయి ద్వారా మంచినీరు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం జలజీవన్‌మిషన్‌ను

ప్రజాసమస్యల పరిష్కారవేదికకు 8 అర్జీలు

ప్రారంభిస్తే గత వైసీపీ ప్రభుత్వంలో కొళాయి కనెక్షన్‌లు ఇవ్వకుండా అధికారులు, కాంట్రాక్టర్లతో కుమ్మక్కై అవినీతికి పాల్పడ్డారని మండిపడ్డారు. దగదర్తి మండలం నారాయణపురంకు చెందిన రైతులు తమ భూములను అటవీశాఖ అధికారులు తమవని ఇబ్బందులు పెడుతున్నారని దానిపై కోర్టుకు వెళ్లగా కోర్టు మాకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని చెప్పారు. ఈ భూములకు వన్‌బీ అడంగల్ ఇప్పించాలని ఆర్డీవో శీనానాయక్‌ను కోరామని, ఆయన తహసీల్దార్‌తో మాట్లాడి వారం రోజుల్లో వచ్చేలా చూస్తానని తెలిపారని గుర్తు చేశారు. అల్లూరు మండలం పడమరగోగుల పల్లికి చెందిన రైతులు తమ డీకేటీ భూములను ఆ గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు పోలేరమ్మగుడి పేరు చెప్పి లాగేసుకుని ఆయన ఆధీనంలో ఉంచుకున్నారని ఫిర్యాదు చేశారు. ఆ భూములను తిరిగి మాకు అప్పగించాలని విన్నవించారు.



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న నారాయణపురం రైతులు

తన భూమిని మరొకరిపేరుకు మార్చారని ఫిర్యాదు

కొండాపురం. ఆగస్టు 12: ప్రభుత్వం తమకు ఇచ్చిన అసైన్డ్ భూమిని గ్రామంలోని మరొకరిపేరుకు మార్చారంటూ సత్యవోలు పంచాయతీలోని లింగసపాలెంకు చెందిన కోట వెంకటేశ్వర్లు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ కోటేశ్వరరావుకు గ్రీవెన్స్ డేలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 10-01-2008లో ఎఫ్‌డీసీ నెంబరు 901-1417తో నా భార్య కోట శివరంజని పేరుతో సర్వే నెంబరు 275ఎలో ప్రభుత్వం 3.20 సెంట్లు భూమిని మంజూరు చేసిందన్నారు. దీనికి సంబంధించి పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్ డీడ్ రెవెన్యూ అధికారులు మంజూరు చేశారన్నారు. మా గ్రామానికి ఎటువంటి సంబంధంలేని వ్యక్తులు షేక్ షఫీ ఉల్లా, సయ్యద్ ఫరీదాభేగం, షేక్ జుబేదా, షేక్ సనవుల్లా అనే వ్యక్తులు గత నెల 17వ తేదీన సదరు భూమిలోకి అక్రమంగా వచ్చి జేసీబీతో చదును చేయుస్తుండగా విషయం తెలుసుకుని తాను అక్కడకు వెళ్లి ప్రభుత్వం మాకు పట్టా ఇస్తే మీరు ఇక్కడకు వచ్చి ఎందుకు చదును చేస్తున్నానని ప్రశ్నించగా మాకే పట్టా ఇచ్చి ఉన్నారు, ఈ భూమి మాది అని నాపై దౌర్జన్యం చేసి బెదిరించారని వినతిలో పేర్కొన్నారు. ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని కోరారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలి

కందుకూరు, ఆగస్టు 12: కందుకూరు మున్సిపాలిటీలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల వేదికలో 6 అర్జీలు వచ్చినట్లు కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి తెలిపారు. సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయా సెక్షన్ హెడ్‌లకు ఆదేశాలు జారీచేశారు. పారిశుధ్యం, వీధిలైట్లు, తాగునీటి సమస్యలను ఫోన్‌ద్వారా తెలియజేసినా తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

కందుకూరులో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ర్యాలీలో సబ్‌కలెక్టర్, ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు

కందుకూరు, ఆగస్టు 12: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సహకార శాఖ ఆధ్వర్యంలో సోమవారం కందుకూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సబ్ కలెక్టరు జీ విద్యాధరి తన కార్యాలయం వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించగా, స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి సహకార ఉద్యోగులు అంబేడ్కర్ విగ్రహం సెంటర్ మీదుగా పోస్టాఫీసు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హర్ ఘర్ తిరంగా నినాదంతో విద్యార్థులు హోరెత్తించారు. కార్యక్రమంలో డివిజన్ సహకార అధికారి కె రవిచంద్రారెడ్డి, ఉప విభాగేయ సహకార అధికారి కేవీ సుబ్బారావు, డిప్యూటీ తహసిల్దార్ పి బ్రహ్మయ్య, కె లక్ష్మీప్రసన్న, బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నరసింహమూర్తి, రెవిన్యూ ఉద్యోగులు, పిడిసిసి బ్యాంక్ సిబ్బంది, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు అన్ని ఏర్పాట్లు

అల్లూరు : స్వాతంత్ర్య దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు ఎంపీడీవో జ్యోతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలాధ్యక్షురాలు దర్శిగుంట శశిరేఖ జెండా ఆవిష్కరణలో ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలు సాధించాలి : ఎమ్మెల్యే ఇంటూరి



విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే

ఉలవపాడు, ఆగస్టు 12 : తల్లిదండ్రుల ఆశయాలు సాధించేలా విద్యార్థులు చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కందుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. సోమవారం ఉలవపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటర్ విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు, బ్యాగుల పంపిణీ ఎమ్మెల్యే చేతుల మీదుగా చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సగం విద్యా సంవత్సరం పూర్తయ్యాక పుస్తకాలు ఇచ్చేవారని, కానీ కూటమి ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పుస్తకాలు అందించడం హర్షణీయమన్నారు. కాగా, నియోజకవర్గంలోని అన్ని కాలేజీలు, హైస్కూల్స్‌లో అత్యధిక మార్కులు సాధించిన మొదటి ముగ్గురు విద్యార్థులకు ప్రతి సంవత్సరం ప్రోత్సాహక బహుమతులు తన సొంత నిధులతో అందచేస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. అనంతరం దాతలు హేచరీస్ యజమానుల ఆధ్వర్యంలో కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలేజి ప్రిన్సిపాల్ గోపిచంద్ ప్రకాష్, ఎంఈవోలు శివనాగేశ్వరరావు, రమణయ్య, సంధ్యా హేచరీస్ నిర్వాహకులు సుబ్బాజీ, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్ సేవలు మరువలేనివి : శ్రీనివాస కిరణ్

కావలి, ఆగస్టు 12: విశ్వోదయ వ్యవస్థాపకులు దొడ్ల రామచంద్రారెడ్డి(డీఆర్) గొప్ప విద్యాప్రదాత, మానవతావాదని సమాజానికి ఆయన చేసిన సేవలు అమూల్యమని మాజీ మున్సిపల్ చైర్మన్ నగళ్ల శ్రీనివాసకిరణ్ కొనియాడారు. డీఆర్ విశ్వోదయ సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం వెంగళరావునగర్‌లోని సమితి కార్యాలయంలో 60మంది నిరుపేద వృద్ధులకు రూ.60వేల విలువ చేసే నిత్యావసరాలు, నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసకిరణ్ మాట్లాడారు. తండ్రి బాటలో ఆయన కుమారులు విద్యాధర్‌రెడ్డి, వినయకుమార్ రెడ్డిలు విద్యాలయాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయకుమార్ రెడ్డి, సేవాసమితి చైర్‌పర్సన్ దొడ్ల లక్ష్మీ, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, రామ్‌సెంటర్ చైర్మన్ మనోహర్‌రెడ్డి, జేబీ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం నాయుడు, విశ్రాంత ప్రిన్సిపాల్ ఆర్ మాల్యాద్రి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కావలి, ఆగస్టు 12: స్థానిక ముసునూరు తెలుగుదేశం నాయకులు కండ్లగుంట మధు నాయుడు, రవినాయుడుల తల్లి రత్నమ్మ మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి సోమవారం ఆమె పార్థి వదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సాను భూతి తెలిపారు. అలాగే స్థానిక బాపూజీనగర్‌కు చెందిన గువ్వల సురేష్ మృతి చెందగా ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి : టీడీపీ



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

బిట్రగుంట, ఆగస్టు 12: మండల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, స్థానిక నేతలు తహసీల్దారు సురేష్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాలేపాటి మాట్లాడారు. రైతుల భూములకు సంబంధించిన సర్వే నంబర్లలో తప్పు, 1బీ అడంగల్ రాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొందరు ప్రైవేటు లేఅవుట్ల వారు రైతు పొలాల్లోకి వ్యర్థపు నీరు పోయేందుకు కాలువలు తీశారని వాటిని తొలగించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి, ఎల్.సుధీర్‌బాబు, గనేషం రమేష్‌రెడ్డి, యర్రం వెంకటేశ్వర్లు రెడ్డి, రావి విజయ్‌కుమార్ యాదవ్, అన్నంగి ఆదిశేషయ్య, వాకా మహేష్‌రెడ్డి ఉన్నారు.

హోరాహోరీగా ఎడ్ల బండలాగుడు పోటీలు

బిట్రగుంట, ఆగస్టు 12: బోగోలు మండలం ముంగమూరు పంచాయతీ పేటగ్రామంలోని పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. హోరాహోరీగా జరిగిన ఈ పోటీల్లో కడప, నంద్యాల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి ఎడ్లు పాల్గొన్నాయి. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పోటీలను ప్రారంభించారు. కావలి పట్టణ బీజేపీ అధ్యక్షుడు కుట్టుబోయిన బ్రహ్మానందం, నాయుడు రాంప్రసాద్, మండల టీడీపీ నేతలను గ్రామస్థులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్యేని సన్మానించారు. మొదటి బహుమతిగా నంద్యాల జిల్లా ఎడ్లకు రూ.50వేలు, ప్రకాశం, కడప జిల్లా ఎడ్లకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఒంటేరు మల్లికార్జున, యన్నాబత్తిన శ్రీనివాసులు, కేతిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కే.చంద్రారెడ్డి, కాసల దయాకర్ యాదవ్ పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

కందుకూరు, ఆగస్టు 12: కందుకూరు పట్టణంలోని రౌడీషీటర్లకు సీఐ కే వెంకటేశ్వరరావు సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇటీవలికాలంలో రౌడీషీటర్ల ప్రవర్తన, వారి నడవడికను తెలుసుకుని ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొన్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర ఎరువుల వాడకమే సాగుకు లాభదాయకం: ఏడీఏ

కావలి రూరల్, ఆగస్టు 12: సమగ్ర ఎరువుల వాడకమే సాగునకు లాభదాయకమని జలవనరుల కేంద్రం జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు మారుతీదేవి తెలిపారు. మండలంలోని గౌరవరంలో ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సేంద్రియ వ్యవసాయం, సమగ్ర ఎరువుల వాడకంపై సోమవారం రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నెల్లూరు, కావలి ఏడీఏలు మారుతీదేవి, నాగరాజులు మాట్లాడారు. వరిసాగులో మేలైన యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు వాడకంతోపాటు భూసార పరీక్షలు చేయించుకోవాల రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏవోలు శైలజ, మధురిమ, గీతాకుమారి, కావలి ఏవో లలిత, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషిచేయాలి

లింగసముద్రం, ఆగస్టు 12: గ్రామ పంచాయతీల అభివృద్ధికి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీపీ పెన్నా కృష్ణయ్య సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన శిక్షణా కార్యక్రమం ప్రారంభం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసులు, ఈఓఆర్డీ రామసుబ్బారావు మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వేస్ట్ మేనేజ్‌మెంట్, పంచాయతీ విద్యుత్ బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ శిక్షణ మరో రెండు రోజులు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికులకు డీఏ బకాయిలు చెల్లించాలి

బిట్రగుంట, ఆగస్టు 12: కష్టపడి పనిచేస్తున్న రైల్వేకార్మికుల 18నెలల డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ బిట్రగుంట బ్రాంచ్ చైర్మన్ ఎంవీ శేఖర్‌యాదవ్, కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ విషయంపై సోమవారం వారు మజ్దూర్ యూనియన్ నాయకులతో కలిసి బిట్రగుంట రైల్వే పీడబ్ల్యూఐ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని, 8వ వేతన సంఘం ఏర్పాటు చేసి 1-1-2026 నుంచి వేతన సవరణ చేయాలన్నారు. రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, మహిళ ఉద్యోగులను ట్రాక్ మెన్, రన్నింగ్ డిపార్ట్‌మెంట్ల నుంచి ఇతర డిపార్ట్‌మెంట్లకు బదిలీ చేయాలని తెలిపారు. అలాగే కార్మికులను రిఫెరల్ హాస్పటల్‌లో నేరుగా అడ్మిట్ అయేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అందరికీ 8గంటల పని విధానం అమలు చేయాలని, లోకో పైలట్లకు విశ్రాంతి సమయాన్ని పొడిగించాలన్నారు. కార్య క్రమంలో మజ్దూర్ యూనియన్ సభ్యులు మైకేల్, మధు, రఘు, శ్రీహరి, క్రాంతి, మాధవి, మహేంద్ర, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో 8వ తరగతి ప్రవేశ పరీక్ష

బిట్రగుంట, ఆగస్టు 12: బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చేరేందుకు అర్హులైను విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి సోమవారం సాయంత్రం తెలిపారు. బీసీ-1, ఎస్టీ-3 సీట్లు ఖాళీలు ఉన్నాయని ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 14వ తేదీ ఉదయం 10గంటలకు ప్రవేశ పరీక్షకు ఆధారు కార్డుతో రావాలని కోరారు.

డీబీఎస్‌లో యువజన దినోత్సవం

కావలిటౌన్, ఆగస్టు 12: అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని సోమవారం స్థానిక మద్దూరుపాడులోని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు, ప్రిన్సిపాల్ టీపీ రావులు యువజన దినోత్సవం ప్రాముఖ్యతను తెలిపారు. యువత సమస్యలు, హక్కులపై అవగాహన పెంపొందించడానికి సామాజిక అభివృద్ధిలో యువత భాగస్వామ్యం చేసి ప్రోత్సహించేందుకు ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.